

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Ongole, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-7-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 156 పేజీలు: 12 వెల: 6.50



116 యేళ్ల నవనీతమ్మకు వెంకన్న విఐపి దర్శన భాగ్యం 3లో

11న ఇస్లామాబాద్‌లో అమెరికా-ఇరాన్ చర్చలు 9లో




## ముగింపు దిశగా రష్యా, ఉక్రెయిన్ పోరు!

### ఫోన్‌లో సుదీర్ఘంగా ట్రంప్, పుతిన్ చర్చలు

**వాషింగ్టన్/మాస్కో, జులై 5:** ప్రపంచదేశాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతున్న రష్యా - ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా అడుగులు పడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు అర్ధరాత్రి దాదాపు 90 నిమిషాల పాటు సుదీర్ఘ ఫోన్ సంభాషణ జరిపారు అమెరికా 250వ స్వాతంత్ర దినోత్స వాన్ని పురస్కరించుకుని ట్రంప్‌కు పుతిన్ శుభాకాంక్షలు తెలపడంతో ప్రారంభమైన ఈ సంభాషణ చివరకు ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే వ్యూహాల వైపు మళ్లిందని చెబుతున్నారు. రష్యా అధ్యక్షుడి అత్యంత నమ్మకస్తుడు, విదేశాంగ వ్యవహారాల సహాయకుడు యూరి ఉషాకోవ్ ఈచర్చల వివరాలను అధికారికంగా వెల్లడించారు. కేవలం ఫార్మాలిటీ కాదు ఈ ఏడాది పుతిన్, ట్రంప్ మధ్య జరిగిన నాలుగో అధికారిక సంభాషణ ఇది. ఇది కేవలం ఒక సాధారణ ఫార్మాలిటీ కాదు. అత్యంత నిర్మాణాత్మకంగా, పనిపై స్పష్టమైన ఫోకస్‌తో ఈ చర్చలు జరిగాయి. అంతర్జాతీయంగా ప్రాధాన్యత ఉన్న అన్ని అంశాలపై ఇరు దేశాల నేతలు బహిరంగంగా మాట్లాడుకున్నారని ఉషాకోవ్ వెల్లడించారు. ఈ చర్చల సందర్భంగా ఉక్రెయిన్ యుద్ధభూమిలో ఉన్న వాస్తవ పరిస్థితిని పుతిన్ ట్రంప్‌కు వివరించారు. ప్రస్తుతం రష్యా సైన్యం లైన్ ఆఫ్ కాంటాక్ట్ వెంబడి అన్ని వైపులా వేగంగా దూసుకుపోతోందని పుతిన్ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ సంక్షోభంపై యూరప్ దేశాల అవగాహన పూర్తిగా తప్పని ఈ సందర్భంగా రష్యా >>2

## ఢిల్లీలో రూ. 105 కోట్లతో 'ఆంధ్రా భవన్'

### దాదాపు 2.49 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం

**విజయవాడ,జులై5,ప్రభాతవార్తప్రతినిధి:** భారత రాజధాని ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యాధునిక సౌకర్యాలతో కొత్త ఎపి భవన్‌ను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. సుమారు రూ.105.5 కోట్ల వ్యయంతో ఈ భవన నిర్మాణాన్ని చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థైన నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌బిసిసి)తో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఒప్పందం కుదుర్చుకుంది. ఇటీవల ఈ నిర్మాణ ఒప్పంద పత్రాలపై ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, ఎన్‌బిసిసి చీఫ్ జనరల్ మేనేజర్ అనిల్‌కుమార్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఇరు సంస్థల అధికారులు భవన నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి పరస్పర సహకారంతో పనిచేయనున్నట్లు తెలిపారు. నూతన ఎపి భవన్‌ను ఆధునిక వాస్తుశిల్పం, సమకాలీన నిర్మాణ శైలికి ప్రతీకగా తీర్చిదిద్దనున్నట్లు ఎన్‌బిసిసి తన అధికారిక ఎక్స్ వేదిక ద్వారా వెల్లడించింది. పర్యావరణహిత నిర్మాణ విధానాలు, శక్తి పొదుపు సాంకేతికత, అత్యాధునిక భద్రతా ప్రమాణాలు, స్మార్ట్ మౌలిక వసతులతో ఈ భవనం రూపు దిద్దుకోనుంది. జాతీయ రాజధానిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిపాలనా కార్యకలాపాలకు మరింత సమర్థవంతమైన వేదికగా నిలవడంతో పాటు, రాష్ట్ర ప్రతిష్ఠను చాటిచెప్పే గుర్తింపుగా ఈ >>2

## రాష్ట్రంలో 5 వేల భజన మందిరాలు

### -మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



**చేజర్ల (నెల్లూరు), జులై 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అయిదు వేల భజన మందిరాలను నిర్మించనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. చేజర్ల మండలంలో ఆదివారం ఆయన పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా చిత్తలూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందుకోసం 1500 కోట్ల రూపాయలను వ్యయం చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 1269 భజన మందిరాలకు 216.45 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రంలోని ప్రాచీన దేవాలయాలను పునరు ద్ధరించి, ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 684 పురాతన ఆలయాల అభివృద్ధి పనులు రూ.808 కోట్ల వ్యయంతో కొనసాగుతున్నాయని వెల్ల డించారు. సుమారు 200-300 సంవత్సరాల చరిత్ర కలిగిన పెరుమాళ్లపాడులోని శైవ క్షేత్రానికి పూర్వ వైభవం తీసుకురావాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్ద నున్నట్లు చెప్పారు. ఆలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, వైదిక సంప్రదా యాలకు ప్రతీకలనిపేర్కొన్నారు.

# కుప్పం తరహాలో రాష్ట్రమంతా అభివృద్ధి

### అభివృద్ధి వికేంద్రీకరణతో ప్రణాళికలు

### డిసెంబర్ కల్లా క్వాంటం కంప్యూటర్ రెడీ

### ఏజెన్సీని గంజాయి కేంద్రంగా మార్చిన గత పాలకులు

### కుప్పంలో మీడియాతో సిఎం చంద్రబాబు



ఆదివారం కుప్పం నియోజకవర్గంలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న సిఎం చంద్రబాబు

**కుప్పం, జూలై 5 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని కుప్పం తరహాలో అభివృద్ధి చేస్తామని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొ న్నారు. ఆదివారం శివపురం వద్ద గల సిఎం సొంత నివాసగృహంలో మీడియాతో సిఎం చంద్ర బాబు చిట్‌చాట్ నిర్వహించారు. కుప్పానికి గతంలో ఎన్నడూరానన్ని పరిశ్రమలు వస్తున్నాయన్నారు. ఇక్కడ ఎంఎస్ఎంఇ పార్కులు, రెడ్ కనెక్టివిటీ, కమ్యూనికేషన్ రంగాలు పెంచుతున్నట్లు చెప్పారు. ఇదే తరహాలో అన్ని నియోజకవర్గాలను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. గొడ్డలి పార్టీ హింస, బూతులను నమ్ముకుందన్నారు. తనపై, డిసిఎం పవన్ కల్యాణ్‌పై విమర్శలు చేసేందుకు కొన్ని సామాజిక మాధ్య మాలకు ఫండింగ్ ఇస్తున్నారన్నారు. అలాగే ఫ్యాక్షన్, రౌడీ యిజాన్ని ప్రోత్స హిస్తున్నారన్నారు.

ఫండింగ్‌ద్వారా తమ ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. >>2

## మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం

### - సిఎం చంద్రబాబు

**కుప్పం, జులై 5 ప్రభాతవార్త :** విశాఖ పట్నం నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారులను రక్షించేందుకు గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఆదేశించారు. సము ద్రంలో మత్స్యకారులు గల్లంతయ్యారన్న విషయం తెలిసిన వెంటనే సిఎం చంద్రబాబునాయుడు కుప్పం నుంచి ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బంగాళాఖాతంలో గల్లంతైన మత్స్యకారుల బోట్‌ను గాలించేందుకు కోస్ట్‌గార్డ్ నౌక ప్రయత్నిస్తోందని అధికారులు సిఎంకు వివరించారు. వైజాగ్ ఫిషింగ్ హార్బర్ నుంచి ఇండ్‌ఎపి-విఎస్-ఎంఎం-83 అనే బోటు ఏడు మంది మత్స్యకారులతో జూన్ 1న సాయంత్రం 4గంటలకు సముద్రంలోకి చేపల వేటకు బయలే ్దరి వెళ్లిందన్నారు. 4వతేది మధ్యాహ్నంకు ఆ బోటు ఫిషింగ్ హార్బర్‌కు తిరిగి రావాల్సి ఉందని >>2

# గల్లంతైన మత్స్యకారుల్లో ఒకరు సురక్షితం

### తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో సాగిన గాలింపు చర్యలు

### మిగిలిన ఆరుగురి కోసం సాగుతున్న అన్వేషణ

### బోటు యజమానితో పాటు మరికొందరిని కూడా రక్షించాం: మంత్రి అచ్చెన్నాయుడు



**విశాఖపట్నం, జులై 5 ప్రభాతవార్త:** విశాఖపట్నం నుంచి వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల కోసం ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చేపట్టిన సహాయక చర్యల్లో భాగంగా ఒక మత్స్యకారుడిని సురక్షితంగా రక్షించినట్లు రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. జూలై 5వ తేదీ ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో సముద్రంలో ప్రయాణిస్తున్న ఎంవీ యూనివర్స్ వెల్తీ మర్చంట్ నౌక సిబ్బంది సముద్రంలో కొట్టుకుపోతున్న మత్స్యకారులను గుర్తించారు. వెంటనే నౌక కెప్టెన్ అత్యవసర సహాయక చర్యలు ప్రారంభించి, లైఫ్ రింగులు, తాళ్ల సహాయంతో ఒక మత్స్యకారుడిని ఉదయం 7:50 గంటల ప్రాంతంలో సురక్షితంగా రక్షించారు. అయితే ఆ సమయంలో గంటకు బలమైన గాలులు, సుమారు మూడు మీటర్లఎత్తులో అలలు ఉండటంతో పాటు సముద్రం అత్యంత అల్లకల్లోలంగా ఉండడం వల్ల మిగిలిన మత్స్యకారులు కనిపించకుండా పోయారని నౌక కెప్టెన్ సమాచారం అందించినట్లు మంత్రి తెలిపారు. తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రెస్క్యూ బోటును సముద్రంలోకి దించడం కూడా సాధ్యపడలేదని వివరించారు. కాకినాడ నుంచి ప్రత్యేక నౌక తెప్పించి హెలికాప్టర్లతో కూడా గాలింపు చేసామని వెల్లడించారు. ప్రస్తుతం మిగిలిన ఆరుగురు మత్స్యకారుల కోసం భారత కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికా రులు సమన్వయంతో విస్తృతంగా గాలింపు చర్యలు కొన సాగిస్తున్నారని మంత్రి తెలిపారు. గల్లంతైన ప్రతి మత్స్యకారుడిని సురక్షితంగా రక్షించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తోందని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. గల్లంతైన వారిలో కారి గంగయ్య, అమర అప్పలరాజు, కారి సితోడు, మేడ చిన అమ్మోరు, కారి >>2



# వాయు 'గండం'

### 3 రోజులు భారీ వర్ష సూచన

**విజయవాడ,జూలై5,ప్రభాతవార్తప్రతినిధి:** వాయవ్య బంగాళాఖాతం, ఉత్తర ఒడిశా బెంగాల్ తీర ప్రాంతాల్లో అల్పపీడనం వాయుగుండంగా బలపడిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రస్తుతం బాలాసోర్‌కు 50 కి.మీ., చాంద్‌బలికి 60 కి.మీ., దిఘాకు 60 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే 24 గంటల్లో బాలాసోర్ సమీపంలో తీరం దాటే అవకాశముంది. వాయుగుండం ప్రభావంతో ఆదివారం ఉత్తరాంధ్రలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసాయని తెలిపారు. ఉత్తరాంధ్రలో పలు జిల్లాల్లో నేడు ఈదురు గాలులతో కూడిన వానలు పడినట్లు సమాచారమని తెలిపారు. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు పడవచ్చని అంచనా. ఆంధ్రప్రదేశ్ వాసులకు ఎపి విపత్తు నిర్వహణ సంస్థ వర్ష సూచనలు జారీచేసింది. వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో మూడురోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. వాయువ్య బంగాళాఖాతం, ఉత్తర ఒడిశా పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో వాయుగుండంగా కేంద్రీకృతమై ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఇది ప్రస్తుతానికి బాలాసోర్ (ఒడిశా)కు 40 కి.మీ., చాంద్‌బలి (ఒడిశా)కు 50 కి.మీ., దిఘా (పశ్చిమ బెంగాల్)కు 70 కి.మీ దూరంలో ఉందని తెలిపారు. పశ్చిమవాయువ్య దిశగా కదులుతూ రాబోయే 12 గంటల్లో చాంద్‌బలి - దిఘా మధ్య బాలాసోర్ సమీపంలో ఉత్తర ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉందన్నారు. ఆ తదుపరి 24 గంటల్లో ఇది ఉత్తర ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా కదిలే అవకాశం ఉందన్నారు. దీని ప్రభా >>2



హాంగ్‌కాంగ్ ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న తెలుగు కుటుంబం

## హాంగ్‌కాంగ్ ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న తెలుగు ఫ్యామిలీ

- వెంటనే బాధితులకు సాయం అందించిన మంత్రులు లోకేష్, కొండపల్లి
- డూప్లికేట్ పాస్‌పోర్టుకు అనుమతించేలా ఏర్పాట్లు

**విజయనగరం, జులై 5, ప్రభాతవార్త :** హాంకాంగ్ ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న తెలుగు కుటుంబానికి రాష్ట్ర ఐటీ, విద్యా, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బాసటగా నిలిచారు. హైదరాబాద్ నుంచి చికాగో వెళ్తుండగా, ప్రయాణంలో పాస్‌పోర్ట్‌లు పోగొట్టుకోవడంతో హాంకాంగ్ విమానాశ్రయంలో తెలుగు కుటుంబం చిక్కుకు పోయింది. హాంకాంగ్ ఎయిర్‌పోర్టు నుంచి చిన్నపిల్లలతో తాము పడుతున్న ఇబ్బంది >>2

# ప్రవాసాంధ్రులంతా ఎపి బ్రాండ్ అంబాసిడర్లే

### ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా తెలుగువారే..


### దక్షిణ కొరియా విజయగాథ మనకు ప్రేరణ: సియోల్‌లో మంత్రి లోకేష్



ఆదివారం సియోల్‌లో తెలుగు డయాస్పోరా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

**విజయవాడ.జులై 5,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రవాసాంధ్రులంతా ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ అంబాసడర్లే అని ఎపి విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఇక్కడ మీలో ఉన్న ప్రతిఒక్కరూ రాష్ట్రానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకుని వచ్చేవారేనన్నారు. మీరు విజయాన్ని సాధించినప్పుడు, వ్యాపారం ప్రారంభించినప్పుడు, మంచి పేరును సంపాదించినప్పుడల్లా ఆంధ్రప్రదేశ్ గర్వపడుతుంది. మీరు వెళ్లే ప్రతీచోట ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గాథను చెప్పాలన్నది నా ఆకాంక్ష అని అన్నారు. సియోల్‌లో తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ప్రపంచంలో తెలుగు ప్రజలు లేని దేశం లేదు. ఏ దేశంలో, ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడ తెలుగు ప్రజల ఉనికి ఉంటుంది. నేను ఎక్కడికెళ్లినా నా పరిచయాలు తెలుగు సమాజంతోనే మొదలవుతాయి. విదేశాల్లో ఉంటున్న తెలుగువారికి తమ దేశం, సంస్కృతిపై అపారమైన ప్రేమ. వారు ఎంత దూరంలో ఉన్నా భారతీయ >>2

## కెల్విన్ వేవ్




## సముద్రం అడుగున 14,500 కి.మీ. భారీ ఉష్ణ ప్రవాహం

### గుర్తించిన 'నాసా'... పర్యవేక్షిస్తున్న 'సెంటినెల్6'

### శీతాకాలం నాటికి బలంగా మారే అవకాశం

### ప్రపంచ దేశాలకు సూపర్ ఎల్ నినో ముప్పు

### వాతావరణ శాస్త్రవేత్తల ఆందోళన

**న్యూఢిల్లీ, జులై 5:** పసిఫిక్ మహాసముద్రం అడుగున ఎక్కడో, ఒక భారీ వెచ్చని నీటి ప్రవాహం కదులుతోంది. ఇది ఇండోనేషియా సమీపంలో ప్రారంభమై, నెలల తరబడి భూమధ్యరేఖ వెంబడి తూర్పు వైపు కదులుతోంది. ఈ నెమ్మదైన, కంటికి కనిపించని వేడి ప్రవాహం ఉష్ణమండల పసిఫిక్‌లో దాదాపు 14,500 కిలోమీటర్ల మేర విస్తరించిందని వాతావరణ శాస్త్రవేత్తలు వర్ణించారు. ఏ ఓడ, ఏ నావికుడు కూడా దానిని చూడలేకపోయాడు. అయినప్పటికీ, 1,300 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలో తిరుగుతున్న నాసా ఉపగ్రహం దీనిని గుర్తించింది. ఎందుకంటే ఆ వెచ్చని నీరు వెళుతున్నప్పుడు, దానిపై ఉన్న సముద్ర ఉపరితలం నిశ్శబ్దంగా సుమారు 15 సెంటీమీటర్లు పెరిగింది. 2026 వసంతకాలం వరకు గమనించిన ఆ స్వల్ప ఉబ్బరం, సముద్రం నెలల ముందుగానే పంపిన ఒక >>2

6-7pg2exHMNWJQE_6-7pg2exHMNWJQE.qxd 06/Jul/26 12:15 AM Page 1





ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

# ప్రైవేటు బస్సు ఢీకొని నలుగురు మృతి

## కాకినాడకు చెందిన తల్లి, ఇద్దరు పిల్లలు, సన్నిహితుడు చిట్యాలలో దుర్మరణం

**చిట్యాల రూరల్, జులై 5, ప్రభాతవార్త:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోని పెద్దచెరువు సమీపంలో జాతీయ రహదారి (ఎన్‌హెచ్65)పై ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం పాలయ్యారు, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన తల్లి, కుమార్తె, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందగా, వారితో ప్రయాణిస్తున్న కుటుంబ సన్నిహితుడు, సినీ పరిశ్రమలో ఫిల్మ్ ఎడిటర్‌గా పనిచేస్తున్న కట్టా శ్రీకర్ ప్రసాద్ కూడా ప్రాణాలు కోల్పోయారు. కారు నడుపుతున్న వీర వెంకట నాగవర ప్రసాద్ బాబు తీవ్ర గాయాలయ్యాయి. నార్కట్‌పల్లి సిఐ సికిలోకంల సురేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన మలిరెడ్డి వీర వెంకట నాగవర ప్రసాద్ బాబు, ఆయన భార్య విజయలక్ష్మి (40), కుమార్తె శ్రీయ (17), కుమారుడు ప్రభవ్ (12), కుటుంబ సన్నిహితుడు, హైదరాబాద్ గుండ్లపోచంపల్లికి చెందిన సినీ పరిశ్రమ ఫిల్మ్ ఎడిటర్ కట్టా శ్రీకర్ ప్రసాద్ (62) వ్యక్తిగత పనుల నిమిత్తం వెన్నెల వెన్నెల ఎపి09 సిఆర్0010 నంబర్ గల వెర్నా కారులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 4.40 గంటల సమయంలో పెద్దకాపర్తి గ్రామ శివారులోని పెద్దచెరువు సమీపానికి చేరుకోగానే, వైజాగ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓడి18క్యూ6786 నంబర్ గల ఆర్డియా (ప్రైవేట్ (ట్రావెల్) బస్సు వెనుక నుంచి అతివేగంగా వచ్చి కారును బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు చుట్టూ తిరుగుతూ డివైడర్‌ను ఢీకొని పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో విజయలక్ష్మి, ఆమె కుమార్తె శ్రీయ, కుమారుడు ప్రభవ్, కుటుంబ సన్నిహితుడు కట్టా శ్రీకర్ ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడుపుతున్న వీర వెంకట నాగవర ప్రసాద్ బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన వాహనదారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి చిట్యాల పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ మామిడి రవికుమార్, ఎస్‌ఐ జానిరెడ్డి, పోలీసు సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారు పూర్తిగా ధ్వంసం కావడంతో మృతదేహాలు, గాయపడిన వ్యక్తి లోపలే ఇరుక్కుపోయారు. దీంతో జెసిబి, క్రేన్ సహాయంతో కారు పైభాగాన్ని, డోర్లను తొలగించి తీవ్రంగా శ్రమించి వారిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన వీర వెంకట నాగవర ప్రసాద్ బాబును అంబులెన్స్‌లో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన మలిరెడ్డి వీర వెంకట నాగవర ప్రసాద్ బాబు, మృతులు విజయలక్ష్మి, శ్రీయ, ప్రభవ్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలోని శ్రీరంగనగర్ కాగా, ప్రస్తుతం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ మధురానగర్‌లో నివాసముంటుండగా, శ్రీకర్ ప్రసాద్ హైదరాబాద్‌లోని గుండ్లపోచంపల్లిలో నివాసముంటున్నారు. గాయపడిన వీర వెంకట నాగవర ప్రసాద్ బాబు గతంలో ఎస్‌బిఐలో మేనేజర్‌గా పనిచేసి, ఐటీలో పదోన్నతిపై విశాఖపట్నం బదిలీ అయినట్లు తెలిసింది. ప్రమాదం కారణంగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, ఎన్‌హెచ్‌ఎఐ సిబ్బంది క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన కారును రహదారి పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

# ఎపి బ్రాండ్ అంబాసిడర్లే

>> సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తారు. దక్షిణ కొరియాలోని భారతీయ సమాజానికి నా హృదయపూర్వక అభినందనలు. ఎంబసీ అధికారులు, నిర్వాహకులు, ఈ వేదిక ఏర్పాటుచేసిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. దేశం నుంచి దూరంగా ఉన్న ప్రతీ భారతీయుడినీ కలిసిన ప్రతిసారీ నాకు ఒకింత గర్వంగా ఉంటుంది. మీ కష్టపడేతత్వం, నైపుణ్యం, సంకల్పం ద్వారా మీరు భారత్‌కు గౌరవాన్నిఇనుమడింపజేస్తున్నారు. మీ ప్రతి విజయం భారతదేశ ప్రతిష్టను పెంచుతుంది అన్నారు.

**దక్షిణకొరియా విజయగాథ మనకు ప్రేరణ..**

దక్షిణ కొరియా అభివృద్ధి ప్రయాణం ఆదర్శనీయం. దక్షిణ కొరియా ఇప్పుడు సాంసంగ్,. హుండాయి.ఎల్‌జీ వంటి ప్రఖ్యాత కంపెనీలను ప్రపంచవ్యాప్తంగా తన సత్తా చాటుతున్నాయి. సంపద కేవలం ప్రకృతి వనరుల ఆధారంగా రాదని.. శ్రమ, ఆవిష్కరణ, శాస్త్రీయ దృక్పథం, తపన ద్వారానే దేశాలు అభివృద్ధిపథంలో ముందుంటాయని దక్షిణ కొరియా నిరూపించింది. దక్షిణ కొరియా విజయగాథ మనకు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కి పెద్ద ప్రేరణ. భారత్ దక్షిణ కొరియా మధ్య సంబంధం కేవలం వాణిజ్యం మాత్రమే కాదు. మన భాగస్వామ్యం ప్రజాస్వామ్య విలువలు, పరస్పర విశ్వాసం, ఆవిష్కరణ, యువతపై పెట్టుబడి అనే పటిష్ట మూలాలపై ఆధారపడి ఉంది. గత కొన్ని సంవత్సరాల్లో ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, సెమీ కండక్టర్లు, షిప్ బిల్డింగ్, గ్రీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఉన్నత విద్య వంటి రంగాల్లో రెండు దేశాలు కలిసి మంచి ఫలితాలను సాధించాయన్నారు.

**కియాతో ఆటో మొబైల్ ఎకోసిస్టమ్ అభివృద్ధి..**

కియా తమ మొదటి ఇన్ఇండియా ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడానికి స్థలాలు అన్వేషిస్తున్నపుడు ఆంధ్రప్రదేశ్ తక్షణ నిర్ణయం తీసుకొని, పారదర్శకత, వేగవంతమైన అనుమతులు, భూమి, మౌలిక సదుపాయాలను సమకూర్చి నిజమైన భాగస్వామిగా నిలిచింది. ఫలితంగా ఆవిష్కృతమైందే కియా ప్లాంట్. కేవలం కార్ల తయారీ కేంద్రంగానే కాకుండా, ఒక పూర్తిస్థాయి ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌గా మారి, వేలాదిమందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు కల్పించింది. మన ఈ ప్రయాణాన్ని మరిన్ని సక్సెస్ స్టోరీలుగా మార్చాలి. ఐటీ, సెమికండక్టర్లు, మొబిలిటీ, బ్యాటరీ టెక్నాలజీలు, గ్రీన్ హైడ్రోజన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ దక్షిణ కొరియాకు భారతదేశంలో అత్యంత నమ్మకమైన భాగస్వామి కావడానికి సిద్ధంగా ఉంది. వచ్చే దశాబ్దం ఎపి కేంద్రంగా భారత్-దక్షి ణ కొరియా సంబంధాలు మరింత బలపడతాయని నేను విశ్వసిస్తున్నాను. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌తో కొత్త భాగస్వామ్యాలు వికసిస్తాయని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# కెల్విన్ వేవ్

>> అమెరికా వాతావరణ సంస్థ నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (నోవా) ఎల్ నినో ఏర్పడిందని ప్రకటించింది, ఇది ఒక అరుదైన, శక్తివంతమైన సంఘటనగా మారగలదని వాతావరణ నిపుణులు భావిస్తున్నారు.

**కెల్విన్ వేవ్ అంటే ఏమిటి? అది ఎల్ నినోను ఎలా ప్రేరేపిస్తుంది?**

సాధారణంగా, వాణిజ్య పవనాలు పసిఫిక్ మీదుగా తూర్పు నుండి పడమరకు వీస్తాయి. ఇవి ఇండోనేషియా సమీపంలో వెచ్చని నీటిని పోగుచేస్తుండగా, పెరూ తీరంలో చల్లని, పోషకాలు అధికంగా ఉన్న నీరు ఉపరితలంపైకి వస్తుంది. ఈ విధంగా లోతైన చల్లని నీరు పైకి రావడాన్ని అప్‌వెల్లింగ్ అంటారు. అప్పుడప్పుడు, ఈ పవనాలు బలహీనపడి, కొద్దికాలం పాటు వ్యతిరేక దిశలో వీస్తాయి. పశ్చిమాన ఉన్న వెచ్చని నీటి పర్వతం అప్పుడు తూర్పు వైపుకు జారుతూ తిరిగి వస్తుంది. వందల కిలోమీటర్ల వెడల్పుతో, పసిఫిక్‌లో చాలా వరకు విస్తరించి ఉన్న ఈ నెమ్మదైన నీటి అడుగున ఉప్పెననే కెల్విన్ తరంగం అంటారు. వెచ్చని నీరు వ్యాకోచించి ఎక్కువ స్థలాన్ని ఆక్రమించడం వల్ల, దానిపై ఉన్న సముద్ర ఉపరితలం పైకి లేస్తుంది. ఈ తరంగం, వెచ్చని ఉపరితల నీటికి, చల్లని లోతులకు మధ్య ఉన్న సరిహద్దు అయిన థర్మోక్లైన్‌ను కూడా కిందికి నెడుతుంది. దీనివల్ల దక్షి ణ అమెరికా సమీపంలో చల్లబరుస్తున్న అప్‌వెల్లింగ్ ఆగిపోతుంది. తూర్పు పసిఫిక్ వేడెక్కుతుంది, ఎల్ నినో పుడుతుంది.

**నాసా 'సెంటినెల్6' ఉపగ్రహం దీనిని ఎలా గుర్తించింది?**

నాసా, దాని యూరోపియన్‌భాగస్వాములు 2020లో ప్రయోగించిన 'సెంటినెల్ 6' మైఖేల్ ఫ్రీలిచ్ ఉపగ్రహం, ప్రతి 10 రోజులకు ఒకసారి మొత్తం సముద్రపు ఎత్తును అంగుళంలో కొంత భాగం వరకు కచ్చితత్వంతో మ్యాప్ చేస్తుంది. ఇది జనవరి చివరిలో మైక్రోనేషియా సమీపంలో ఒక చిన్న కెల్విన్ తరంగాన్ని గుర్తించింది, అది ఫిబ్రవరి మధ్యనాటికి క్షీ ణించింది. మార్చి ప్రారంభంలో అంతకంటే చాలా పెద్ద తరంగం ఉద్భవించి తూర్పువైపుకు కదిలింది. మే మధ్య నాటికి, పెరూ చుట్టూ ఉన్న సముద్రాలు దీర్ఘకాల సగటుల కంటే 15 సెంటీమీటర్లకు పైగా ఎత్తులో ఉన్నాయి.

**2026లో సూపర్ ఎల్ నినో వస్తుందా?**

రావచ్చు. 1997, 2015 సంవత్సరాలనాటి ఎల్ నినోల వంటి అత్యంత బలమైన ఎల్ నినోకు సూచిక అయిన పసిఫిక్ సముద్రపు ఉష్ణోగ్రతలు, సగటు కంటే 2డిగ్రీల సెల్సియస్ మేర పెరిగేందుకు 63 శాతం అవకాశంఉందని నోవా వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారతదేశానికి ఇది ఒక అవాంఛనీయ పరిణామం. చారిత్రాత్మకంగా, బలమైన ఎల్ నినో సంఘటనలు నైరుతి రుతుపవనాలను బలహీనపరుస్తాయి, అయితే హిందూ మహాసముద్ర ద్విధ్రువం వంటి అంశాలు ఈ ప్రభావాన్ని కొంతవరకు తగ్గించగలవు. ఈ సంఘటన ఈ శీతాకాలంలో గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. ప్రపంచ దేశాలకు ఈ సూపర్ ఎల్ నినో పెనుముప్పు అని వాతావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాంటి భారీ వెచ్చటి నీటి ప్రవాహం పసిఫిక్ మహాసముద్రం దాటిన ప్రతిసారీ ప్రపంచ వాతావరణంలో పెద్ద మార్పులు జరిగాయి. కొన్ని దేశాలు తీవ్ర కరువును ఎదుర్కొన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు నమోదయ్యాయి. ఇప్పుడు మరోసారి అలాంటి సంకేతాలే కనిపిస్తున్నాయి.

# రాష్ట్రమంతా అభివృద్ధి

>> **మేం తెచ్చిన ప్రాజెక్టులు వారే తెచ్చామంటారు**

తమ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రతి ప్రాజెక్టునూ తామే తెచ్చామని చెప్పుకుంటున్నారని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమాలకు అడ్డుపడుతున్నారన్నారు. వాస్తవం లేకపోయినా అదేపనిగా అసత్యాలు చెబితే ఎవరేం చేయగలమని పేర్కొన్నారు. ఆర్సెలార్ మిట్టల్ ప్రపంచంలో దిగ్గజ స్టీల్ కంపెనీ అని దీన్ని తాము తీసుకువచ్చామన్నారు.అలాగే జెఎస్‌డబ్ల్యు కంపెనీ సైతం వచ్చిందన్నారు. గత పాలకులు కంపెనీలకు తరిమేయడం, పరిశ్రమల్ని పారిపోయేలా చేశారన్నారు. గత ంలో కంపెనీలకు భూములు ఇచ్చి వివాదాల్లో నెట్టారని పేర్కొన్నారు. ఓ వ్యక్తి లబ్ది కోసం విలువైన భూములు, ఖనిజ సంపద బ్లాక్ అయిందన్నారు. ఓబుళాపురం గనులతో సహా ఆన్‌రాక్ కూడా ఇలాగే ఇబ్బందుల్లో పడిందన్నారు. తిరుమల ప్రసాదాలు కల్తీ చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన వ్యక్తులు ఇప్పుడు నీతులు చెబుతున్నారని పేర్కొన్నారు. గత పాలకులు ఏజెన్సీ ప్రాంతాన్ని గంజాయి సాగు కేంద్రంగా మార్చారన్నారు. డ్రగ్స్, గంజాయి నిరోధానికి తమ ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టిందన్నారు. కేంద్రం కూడా డ్రగ్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్ చేపట్టిందన్నారు.

**డిసెంబర్‌లో క్వాంటం కంప్యూటర్ రెడీ**

డిసెంబర్ కల్లా అమరావతిలో క్వాంటం కంప్యూటర్ సెంటర్ కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.సెమీ కండక్టర్ల విభాగంలో పెట్టుబడులు తెచ్చే ందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమలతో పాటు పచ్చదనంకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.ఇంధన రంగంలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తితో పాటు ఇతర అత్యుత్తమ విద్యుత్ సరఫరా విధానాలు అందుబాటులో తెస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం చూపుతున్నామని సిఎం చెప్పారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం పెంపుకు చర్యలు చేపట్టామన్నారు. రాయలసీమ అభివృద్ధికి నీటి ప్రాజెక్టులు తెచ్చామన్నారు. కుప్పానికి హంద్రీ-నీవా తెచ్చామని త్వరలోనే తిరుమల కళ్యాణిడ్యామ్‌కు సైతం నీరు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

# మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం

>> కారణాలతో ఇంతవరకు తిరిగి రాలేదని వివరించారు. గంగవరం సముద్ర తీరంలో బోటుకు సా ంకేతిక సమస్య ఉత్పన్నమైనట్లు గుర్తించామని అధికారులు సిఎంకు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి నౌకా దళంకు చెందిన హెలికాప్టర్ల ద్వారా గాలింపు చర్యలు ప్రారంభించామన్నారు. ప్రస్తుత ం కోస్ట్‌గార్డ్, నేవీ, మెరైన్ పోలీసు విభాగాలు గాలింపుచర్యలు చేపట్టినట్లు సిఎంకు తెలిపారు. దీనిపై స్పందించిన సిఎం చంద్ర బాబు సము ద్రంలో చేపడుతున్న గాలింపు చర్యలను సమన్వయం చేసుకోవాలని మెరైన్ ఐజి, వైజాగ్‌సిపిలను ఆదేశించారు. గాలింపుచర్యలఅంశాలు తనకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. మత్స్య కారులకుటుం బాలకు ధైర్య ం చెప్పాలని మంత్రి అచ్చెన్నాయుడు, వైజాగ్ ప్రజాప్రతినిధులకు సిఎం

# జీరామ్‌జీ అమలు కోసం 25,863 కోట్లు విడుదల

## పారదర్శకత, గ్రామీణ ఉపాధి విస్తరణ చేయాలి

## రాష్ట్రాలకు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సూచన

**న్యూఢిల్లీ, జులై 5:** 'వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' (విబి జి రామ్‌జి) పథకం అమలు కోసం కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం రూ.25,863 కోట్ల మొదటి విడత నిధులను విడుదల చేశారు. విబి జి రామ్‌జి పథకం అమలులో భాగంగా ఉన్న ఈ నిధులను, అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గ్రామీణాభివృద్ధి మంత్రులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా విడుదల చేశారు. వర్చువల్‌గా నిర్వహించిన సమావేశంలో శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, 15 రోజుల్లోపు వేతనాలు చెల్లించేలా రాష్ట్రాల వద్ద తగిన నిధులు ఉం డేలా చూడటమే ఈ మొదటివిడత విడుదల ఉద్దేశమని పేర్కొన్నారు. వేతనాల చెల్లింపులో ఎటువంటి జాప్యం జరగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వాలన్నీ తమ వాటా నిధులను సకాలంలో విడుదల చేయాలని ఆయ న కోరారు. జులై 1 నుండి దేశవ్యాప్తంగా ఎటువంటి అంతరాయం లేకుండా విబి జి రామ్‌జిని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ పథకం విజయవంతంగా ప్రారంభమైందని, ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ నుండి విబి జి రామ్‌జికి మారే ప్రక్రియ సజావుగా, ఎటువంటి సమస్యలు లేకుండా జరిగిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఎటువంటి సాంకేతిక లేదా నిర్వహణ పరమైన సమస్యలు నమోదు కాలేదని తెలిపారు. మొదటి వారంలోనే పెద్ద సంఖ్యలో గ్రామ పంచాయతీలలో పనులు ప్రారంభమయ్యాయని, లక్షలాది మంది గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించబడిందని మంత్రి చెప్పారు. మొదటి రోజే భారీగా ఉపాధి అవకాశాలను కల్పించినందుకు ఆంధ్రప్రదేశ్, కేరళ, రాజస్థాన్ రాష్ట్రాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మిగిలిన గ్రామ పంచాయతీలలో కూడా వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లను కోరారు. అలాగే జార్ఖండ్ ఈ పథకాన్ని అధికారికంగా ప్రకటించి, అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌బిఐ ఖాతాలులేదా ఇతరలాంఛనాలు ఇంకా పెండింగ్‌లో ఉన్న రాష్ట్రాలు వాటిని నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని కూడా సూచించారు. గ్రామీణ కార్మికులకు గౌరవప్రదమైన ఉపాధి, సకాలంలో వేతనాల చెల్లింపు, దీర్ఘకాలిక గ్రామీణ ఆస్తుల కల్పనను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ పథకం అమలులోకి రావడానికి దాదాపు మూడేళ్లు పట్టినప్పటికీ, విబి జి రామ్‌జి పథకం మాత్రం ఒక్క రోజులోనే దేశవ్యాప్తంగా ప్రారంభించబడిం దని చౌహాన్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం, రాష్ట్రాల సహకారం, దేశ పరిపాలనా సామర్థం కారణంగానే ఈ గొప్ప విజయం సాధ్యమైందని ఆయన అభివర్ణించారు.

విబి జి రామ్‌జి కింద వేతన రేట్లు సగటున దాదాపు 10 శాతం పెంచబడ్డాయని, ఇకపై దేశంలోని ఏ రాష్ట్రంలోనూ రోజువారీ వేతనం రూ.300 కంటే తక్కువగా ఉండదని ఆయన తెలిపారు. గ్రామీణ కార్మికుల ఆదాయం, సామాజిక భద్రతను బలోపేతం చేయడంలో ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. విబి జి రామ్‌జి పథకం సమర్థవంతమైన అమలుకు నిధుల కొరత

## వారం - వర్జ్యం

06-07-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
షష్ఠి మ.1.43, పూర్వాభాద్ర సా4.03
వర్జ్యం : రా.1.45-రా.3.22
దు.మ.12.38-మ.1.30,
2)మ.3.15-సా.4.07
రాహుకాలం - ఉ.7.30-9.00

## వారఫలం

**మేషం:** నిర్మాణ సంబంధమైన లోన్లు మంజూరవుతాయి. ఆర్థికపరమైన సర్దుబాటులను అద్భుతముగా చేయగలుగుతారు.

**వృషభం:** విదేశములకు సంబంధించిన యత్నములకు ఇతరులకు పరపతిని నమ్ముకోవడం కన్నా స్వయంకృషి చేయడం మంచిది.

**మిథునం:** మానసిక శారీరక శ్రమ అధికమవుతుంది. ఫలితాలు కూడా లాభసాటిగానే ఉంటాయి. బంధువుల కలయిక.

**కర్కాటకం:** మీలోని వ్యక్తిగత ప్రతిభ, మంచితనము, కష్టపడి పనిచేసే తత్త్వము కార్యాలయములో గుర్తింపునకు నోచుకుంటాయి.

**సింహం:** దీర్ఘాలోచనల కన్నా సమయస్ఫూర్తితో వెనువెంటనే తీసుకునే నిర్ణయాల వల్ల లాభపడతారు.

**కన్య :** సంతానం వలన మానసిక శాంతి గోచరిస్తోంది. ఉన్నతావకాశములు లభిస్తాయి. వాహనసౌఖ్యం ఏర్పడుతుంది.

**తుల :** పరిస్థితులకు అనుగుణంగా మీ అభిరుచులను మార్చుకోగలుగుతారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**వృశ్చికం:** మాటల వరకే కోపమును పరిమితము చేయటం వలన లాభపడతారు. ఎగుమతి ఆర్డర్లు అనుకూలిస్తాయి.

**ధనుస్సు:** పోటీ పరీక్షలలో మీరు ఊహించిన ఫలితాలు పొందలేరు. ఉద్యోగులకు స్థానమార్పులు కలుగుతాయి.

**మకరం:** ముఖ్యమైన శుభకార్యమును వ్యవహారమును చక్కబెట్టి బరువు బాధ్యతలను దించుకుంటారు.

**కుంభం:** రావలసిన మొండిబాకీలు వసూలవుతాయి. సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**మీనం:** నిర్మోహమాటంగా వ్యవహరించి కొన్ని కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. కీర్తిప్రతిష్ఠల కోసం తాపత్రయపడతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



ఆదివారం సియోల్‌లో భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌తో మంత్రి లోకేష్ భేటీ అయిన దృశ్యం

# కొరియన్ ఎలక్ట్రానిక్స్, చిప్ కంపెనీలు ఎపికి వచ్చేలా సహకరించండి

## సియోల్‌లో భారత రాయబారి గౌరంగలాల్ దాస్ తో మంత్రి లోకేష్ భేటీ

**విజయవాడ,జులై 5, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌తో సియోల్‌లో దక్షిణ కొరియా భారత రాయబారి గౌరంగలాల్ దాస్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... శాంసంగ్, ఎల్‌జీ, ఎస్‌కె, ఎఎస్ఐపి- ఎపిఎసిటఓశాట్‌ల ఆధారంగా, ఇండియా సెమీకండక్టర్ మిషన్, ఎపి ఎలక్ట్రానిక్స్ పాలసీ 4.0కు అనుగుణంగా కొరియన్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు, చిప్ దిగ్గజాలను ఎపికి రప్పించేందుకు సహకారం అందించాలని కోరారు. ఎపిలో శ్రీసిటీ, నాయుడుపేట, కొప్పర్తి, విశాఖపట్నంలలో రెడీ టు యూజ్ క్లస్టర్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఐఐటి తిరుపతి, ఐఐఐటి శ్రీసిటీ, ఆంధ్ర విశ్వవిద్యాలయాలతో కలిసి కొరియా అనుసంధాన నైపుణ్య కార్యక్రమాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కొరియా అధ్యక్షుడు లీ జేమ్యుంగ్ ఏప్రిల్ 2026లో భారత్ పర్యటన సందర్భంగా "కొరియా ఎన్‌క్లేవ్" ఏర్పాటు కోసం చేసిన ప్రతిపాదనకు కార్యరూపం ఇచ్చేందుకు.. కొరియన్ చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం ఉద్దేశించిన ఒక ప్లగ్‌అండ్‌ప్లే టౌన్‌షిప్‌కు శ్రీసిటీలో ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని లోకేష్‌తెలిపారు. కొరియా ప్రాధాన్యతారంగ పరిశ్రమలను ఎపికి తీసుకొచ్చేందుకు చొరవచూపాలని కోరారు. అనంతపురంలో కియా/హ్యుందాయ్ మోబిస్ ఆటోఈవీ క్లస్టర్‌ను విస్తరించడంపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ తీరంలో హెచ్‌డి హ్యుందాయ్ తరహా గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్‌ను ఏర్పాటు, బ్యాటరీ/గ్రీన్‌హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాల్సిందిగా సూచించారు.

# ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న తెలుగు ఫ్యామిలీ

>> లను మంత్రి నారా లోకేష్‌కు ఎక్స్ (ట్విట్టర్) ద్వారా బాధితురాలు బొల్లా రాజేశ్వరి వివరించారు. రాజేశ్వరి ట్వీట్‌కు స్పందించిన మంత్రి నారా లోకేష్ వెంటనే కేంద్రమంత్రి జైశంకర్‌తో మాట్లాడారు. బొండపల్లి పర్యటనలో ఉన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు విషయం తెలిసిన వెంటనే బాధితులకు తక్షణమే తాత్కాలిక పాస్‌పోర్టులు ఏర్పాటు చేసి, సురక్షితంగా ఇండియా తీసుకురావాలని ఎపి ఎన్నార్టీ అధికారులను ఆదేశించారు. రాజేశ్వరి కుటుంబానికి హాంకాంగ్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చేస్తుందని కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మంత్రి నారా లోకేష్ పాస్‌పోర్ట్ నిబంధనల ప్రకారం పాస్‌పోర్ట్ కలిగిన వ్యక్తులు పాస్‌పోర్ట్ పోయిన యెడల స్వదేశానికి తిరిగి వచ్చి పాస్‌పోర్ట్ కోసం ధరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. దాంతో పాస్‌పోర్ట్ కేంద్రం వారు పరిశీలన చేసి డూప్లికేట్ పాస్‌పోర్ట్ మంజూరు చేయటం జరుగుతుంది. కానీ దీనికి భిన్నంగా ఎయిర్‌పోర్ట్‌లో చిక్కుకున్న బాధిత కుటుంబాల కోరిక మేరకు లోకేష్ హాంకాంగ్ నుంచి పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేయించి ఢిల్లీ నుండి హాంకాంగ్‌కు కొరియర్ పంపించే ఏర్పాట్లు చేసేలా ఎంబసీ వారితో చర్చలు జరిపారు. తద్వారా డూప్లికేట్ పాస్‌పోర్ట్ మంజూరు చేయించి వారి ప్రయాణాన్ని హాంకాంగ్‌కు కొనసాగించాలా ఏర్పాటు చేసినట్లు ఎన్నార్టీ విభాగం వారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు తెలిపింది. ఒక మంచి నిర్ణయాన్ని తీసుకుని చాకచక్యంగా వ్యవహరించి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మంత్రి నారా లోకేష్ నిర్ణయం పట్ల మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.

# గల్లంతైన మత్స్యకారుల్లో ఒకరు సురక్షితం

>> కారుడిని రక్షి ంచిన మర్చంట్ నౌక కెప్టెన్, సిబ్బందికి మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఒడిశా ప్రభుత్వం, మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారుల సమన్వయంతో 10 మంది మత్స్యకారులు క్షేమంగా బయటపడ్డారుఒడిశా తీరంలో సాంకేతిక లోపం కారణంగా చిక్కుకున్న విశాఖపట్నానికి చెందిన మెకనైజ్డ్ ఫిషింగ్ బోటులో ఉన్న బోటు యజమాని దానయ్యతో పాటు మొత్తం 10 మంది మత్స్యకారులను సురక్షి తంగా రక్షి ంచినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. బోటు ఇంజిన్ పనిచేయకపోవడం, యాంకర్ కోల్పోవడంతో మత్స్యకారులు సముద్రంలో చిక్కుకున్నట్లు సమాచారం అందిన వెంటనే ఒడిశా మెరైన్ పోలీస్, మత్స్యశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు ఒడిశా మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారులు వేగంగా స్పందించి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి బోటు యజమాని దానయ్యతో పాటు మొత్తం 10 మంది మత్స్యకారులను సురక్షి తంగా రక్షి ంచారు. ప్రస్తుతం వారందరూ క్షేమంగా ఉన్నారని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా సకాలంలో స్పందించి మత్స్యకారుల ప్రాణాలను కాపాడిన ఒడిశా ప్రభుత్వం, ఒడిశా మెరైన్ పోలీస్,

# రూ. 105 కోట్లతో 'ఆంధ్రా భవన్'

>> భవనం నిలుస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నూతన ఆంధ్రప్రదేశ్ భవన్‌ను సుమారు 2.49 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. రాష్ట్ర ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో పాటు ఢిల్లీకి వచ్చే రాష్ట్ర ప్రజలకు అవసరమైన అన్ని ఆధునిక సౌకర్యాలు ఒకే చోట అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించారు. సమావేశ మందిరాలు, అతిథి గదులు, కార్యాలయ విభాగాలు, పార్కింగ్, భద్రతా వ్యవస్థలు, డిజిటల్ సదుపాయాలు వంటి అన్ని అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సమాచారం. భవన నిర్మాణం పూర్తైన అనంతరం కనీసం ఐదు సంవత్సరాల పాటు వార్షిక నిర్వహణ బాధ్యతలను కూడా ఎన్‌బిసిసి లేదా దాని అనుబంధ సంస్థకు అప్పగించనున్నారు. ఇందుకోసం త్వరలో మరో ప్రత్యేక ఒప్పందం చేసుకునేందుకు ఇరుపక్షాలు సిద్ధమవుతున్నాయి.

# వాయు 'గండం'

>> వంతో సోమవారం విజయనగరం, మన్యం, అల్లూరి, పల్నాడు జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. తీరం వెంబడి గంటకు 40-50 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు.ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని సూచించారు. అవసరం అయితే తప్ప ఎవరూ బయటకు వెళ్లవద్దని తెలిపారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో చెట్లు, విద్యుత్ స్థంభాలు విరిగి పడే అవకాశం ఉందని.. పొలాలకు వెళ్లే సమయంలో రైతులు జాగ్రత్తగా ముందు చూస్తూ వెళ్లాలని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్థంభాలు విరిగి పడితే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఇక విశాఖపట్నంలో తుపాను ప్రభావంతో సముద్రంలో ఏడుగురు మత్స్యకారులు గల్లంతయ్యారు. ఈనెల 1న ఏడుగురు జాలర్లు సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి చేరుకుంటామని మత్స్యకారులు ఫోన్ చేశారు. మత్స్యకారులు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేశారు. అయితే ఫోన్‌లు స్విచ్‌ఆఫ్ అవ్వడంతో గల్లంతయ్యారని కోస్ట్, మెరైన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. గల్లంతైన మత్స్యకారుల కోసం కోస్ట్‌గార్డ్, నేవీ, మెరైన్ పోలీసులు గాలింపు చేపట్టారు.

# ముగింపు దిశగా రష్యా, ఉక్రెయిన్ పోరు!

>> పేర్కొంది. వచ్చే వారం టర్కీలో జరగబోయే నాటో సదస్సులో ఈ యుద్ధానికి ముగింపు పలికేలా మధ్యవర్తిత్వం వహించడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించారు. అమెరికా ప్రత్యేక దౌత్యవేత్తలు స్టీవ్ విట్కాఫ్, జెరెడ్ కుష్నర్ ఈ శాంతి ఒప్పందం కోసం తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తారని, అవసరమైతే మరోసారి మాస్కో పర్యటనకు వచ్చేందుకు రెడీగా ఉన్నారని ట్రంప్ తెలిపినట్లు సమాచారం. రష్యా, అమెరికాల మధ్య సైనిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో పరస్పర సహకారానికి బోలెడు అవకాశాలు ఉన్నాయని, ఈ సహకారం పునరుద్ధరించాలంటే ఉక్రెయిన్ సంక్షోభానికి త్వరితగతిన పరిష్కారం లభించడమే మొదటి షరతుఅని ట్రంప్ నొక్కి చెప్పారని తెలుస్తోంది. మరోవైపు, ఉక్రెయిన్, దాని యూరోపియన్ మిత్రదేశాలు యుద్ధాన్ని మరింత తీవ్రం చేస్తున్నాయని, సాధారణ పౌరులపై ఉగ్రవాద దాడులకు పాల్పడుతున్నాయని ఉషాకోవ్ ఆరోపించారు. రష్యా అధ్యక్షుడి ప్రెస్ సెక్రటరీ డిమిత్రి పెస్కోవ్ తాజాగా ఒక సంచలన ప్రకటన చేశారు. క్రెమ్లిన్ నిర్దేశించిన అత్యంత కీలకమైన, బాధ్యతాయుతమైన నిర్ణయాలను ఆమోదించడానికి సిద్ధంగా ఉంటే ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ స్వయంగా అధ్యక్షుడు పుతిన్‌ను కలవడానికి మాస్కో రావచ్చని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా శాంతిని ఆశించే శక్తులన్నీ ఇప్పుడు పుతిన్ ట్రంప్ డీల్ వైపు ఆసక్తిగా చూస్తున్నాయి.

6-7Pg3exHMNWJQE_6-7Pg3exHMNWJQE.qxd 05/Jul/26 10:58 PM Page 1



## తిరుమల సమాచారం



## ఏడుకొండలవాడా... ఏదీ నీ దర్శనం

- 25గంటలపైగానే సర్వదర్శనం

**తిరుమల, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యాసంస్థలు పునఃప్రారంభమైనా.. వారాంతం సెలవులతో తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. అలిపిరి టోల్ గేట్ నుంచే రద్దీ కనిపిస్తోంది. ఆదివారం సాయంత్రానికి సర్వదర్శనానికి 25 గంటల పైగానే సమయం పడుతోంది. భక్తులు పూర్తిగా సిబ్బందికి సహకరించాలని, సంయమనంతో దర్శనం చేసుకోవాలని టిటిడి ప్రకటించింది. క్యూ లైన్లలో ఉన్న వారికి శ్రీవారి సేవకులు అన్న ప్రసాదం, మజ్జిగ, మంచినీరు, పాలు అందిస్తున్నారు. తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. భక్తుల క్యూ లైన్ శిలాతోరణం వరకూ విస్తరించింది. శనివారం రాత్రి వరకు 90,546 మంది భక్తులు దర్శించుకున్నారు. కానుకల రూపంలో శ్రీవారి హుండీకి 3.93 కోట్లు రూపాయలు ఆదాయం వచ్చింది. ఆదివారం సాయంత్రానికి 43వేల మంది భక్తులకు మహాలఘులో స్వామివారి దర్శనం చేయించారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో వెలుపల క్యూ లైన్లలో భక్తుల నిరీక్షణ తప్పడంలేదు.

## 13న, 16న విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

**తిరుమల, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆణిమాసంలో కలియుగ వైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి ఎంతో విశిష్టత ఉన్న ఆణివార ఆస్థానం నిర్వహించడం ఆనవాయితీ. ఈ పర్వదినం ముందు మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతారు. ఈనెల 14వ తేదీ మంగళవారం తిరుమల ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 17వ తేదీ శుక్రవారం ఆణివార ఆస్థానం జరగనుంది. ఈ రెండు ప్రత్యేక రోజుల్లో ఆలయంలో విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేశారు. దీనికి ముందు సోమవారం 13వ తేదీ విఐపి బ్రేక్ దర్శనాల సిఫార్సు లేఖలు తీసుకురావద్దని టిటిడి విజ్ఞప్తి చేసింది. అలాగే 16వ తేదీ గురువారం కూడా 17వ తేదీ విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి సిఫార్సు లేఖలు స్వీకరించబోమని టిటిడి వెల్లడించింది. భక్తులు ఈ విషయాలను గమనించి టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. జులై 17న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ రద్దు చేసినట్లు పేర్కొంది.

## 17న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం



**తిరుమల, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 17వ తేదీ శుక్రవారం సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం జరుగనుంది. ఆణివార ఆస్థానం ఉత్సవం రోజున ఉదయం 7 గంటలకు బంగారువాకిలి ముందు గల ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయదేవేరులతో మలయప్పస్వామి గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన విష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతో పాటు ఆనంద నిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు. తిరుమల పెద్ద జీయ్యర్ స్వామి పెద్ద వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేస్తారు. వీటిలో నాలుగు పట్టువస్త్రాలను మూలమూర్తికి అలంకరిస్తారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామికి, మరొకటి విశ్వక్సేనులకి అలంకరిస్తారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు తలకు శ్రీవారిపాదవస్త్రంతో వరిపట్టం కట్టుకుని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి నిత్యైశ్వరోభం అని స్వామిని ఆశీర్వదిస్తారు. ఆ తరువాత అర్చకులు పెద్దజీయర్, చిన్నజీయర్ స్వామికి, టిటిడి ఇఒ చేతులకు లచ్చన తాళపు చెవిగుత్తిని వరుసక్రమంలో కుడిచేతికి తగిలిస్తారు. హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసి తాళపు గుత్తిని స్వామివారి పాదాలచెంత ఉంచుతారు.

**పుష్ప పల్లకీపై ఊరేగింపు:** ఆణివార ఆస్థానం సందర్భంగా 17వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకీపై ఆలయ మాఢవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేస్తారు.

**ఆర్జితసేవలు రద్దు:** ఆణివార ఆస్థానం కారణంగా 17న కల్యాణోత్సవం, ఊంజల్

## రౌడీ షీటర్‌పై పిడి యాక్ట్

- భక్తుల భద్రతకు విఘాతం కలిగిస్తూ నేరాలు



**తిరుమల, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తుల భద్రత, ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తూ వరుసగా నేరాలకు పాల్పడుతున్న రౌడీ షీటర్ జి. శ్రీనివాసులు అనే శ్రీను(20)పై ఆంధ్రప్రదేశ్ ప్రివెన్షన్ ఆఫ్ డేంజరస్ యాక్టివిటీస్ (పిడియాక్ట్) పోలీసులు నమోదు చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ప్రతిపాదన మేరకు తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పిడి యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిందితుడు తిరుమల ప్రాంతంలో దొంగతనాలు, దాడులు, ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిపై దౌర్జన్యాలు, మహిళలపై వేధింపులు, ఆయుధాలతో బెదిరింపులు, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే చర్యలకు పాల్పడుతూ గత ఏడాది కాలంలో మొత్తం ఐదు క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. పలుమార్లు అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నప్పటికీ, అతని నేరప్రవృత్తిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో, ప్రజా శాంతిభద్రతలకు ముప్పుగా మారినట్లు జిల్లా పోలీసు శాఖ నిర్ధారించింది. దీంతో జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వుల మేరకు నిందితుడిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

# వేడుకుందామా.. వేంకటపతి వేంకటనాధుని!

- 116ఏళ్ళ నవనీతమ్మకు ఏడుకొండలస్వామి విఐపి దర్శనభాగ్యం
- సిఎం చంద్రబాబు కూడా ముగ్ధులు

**తిరుమల, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడు ఏడుకొండల వేంకటేశ్వర స్వామి తన దర్శనానికి 116ఏళ్ళ అవ్వను పిలుచుకుంటున్నాడనే భక్తిభావంతో భక్తులు పరవశులవుతున్నారు. అవ్వ కాలినడకన ఏ మాత్రం అలుపుసోలుపు లేకుండా కుటుంబ సభ్యుల సహకారంతో ఏకంగా అలిపిరి మెట్ల మార్గంలో తిరుమలకు చేరుకోవడం తెలిసిందే. భక్తి పారవశ్యంతో, మనసు నిండా గోవింద నామస్మరణతో తమిళనాడుకు చెందిన నవనీతమ్మ 116 ఏళ్ల వృద్ధురాలు కాలినడకన తిరుమల కొండెక్కి వచ్చిన అద్భుత ఘట్టం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారింది. భగవంతునిపై ఆమెకున్న అచంచలమైన భక్తి, పట్టుదల దేశవ్యాప్తంగా లక్షలాది మంది నెటిజన్లను, భక్తులను ముగ్ధులను చేయడమేగాక స్వయంగా చిత్తూరుజిల్లా కుప్పం పర్యటనలో ఉన్న సిఎం చంద్రబాబునాయుడు కూడా శభాష్ అవ్వా అంటూ వీడియో పోస్ట్ చేశారు. వయసు కేవలం అంకె మాత్రమేనని కర్ణాటకకు చెందిన అవ్వ నిరూపించారు. 116 ఏళ్ల వయస్సులో తిరుమలకు మెట్లు ఎక్కి రావడం ఆశ్చర్యపరిచింది. అవ్వకు అండగా నిలిచిన కుటుంబసభ్యుల మద్దతు అభినందనీయం. స్వామివారిపై ఆమెకు ఉన్న అచంచల భక్తికి ఈ ప్రయాణమే ఒక నిదర్శనమంటూ సిఎం పేర్కొన్నారు.



**అవ్వకు దేవదేవుని దర్శనం:** ఆ ఏడుకొండలస్వామే తన దర్శనాన్ని ఇవ్వడమంటే మాటల్లో చెప్పడంకాదు. అంతటి అనుభూతిని పొందిన భక్తులకే అది సాధ్యం. ఆ స్వామి పిలుపు రావాలంటే అదృష్టం ఉండాలని, ఏడు కొండలు ఎక్కాలంటే ఎంతో పుణ్యం చేసుకోవాల్సి ఉంటుంది. యువకులు, భక్తులు కూడా అలిపిరి మెట్లు ఎక్కి తిరుమలకు రావాలంటే ఆయాసపడుతుంటారు.

అలాంటిది వయసు మళ్ళిన వృద్ధులు కూడా ఆ స్వామి దర్శన భాగ్యం కోసం పరితపిస్తుంటారు. ఇదీ తిరుమల వేంకటేశ్వరస్వామి మహత్యం. కాలినడకన రావడం మాటల్లో చెప్పనలవికాదని, ఆమెను ఆమె కుటుంబసభ్యు లను ఆ దేవుడే చల్లంగా చూడాలని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తన సామాజిక మాధ్యమం వేదికగా పోస్టు చేశారు.

వృద్ధురాలి గురించి వారి కుటుంబం గురించి వివరాలు తెలుసుకోవాలని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశించారు. ఆ వెంటనే టిటిడి విజిలెన్స్ అధికారులు అవ్వగురించి ఆరా తీశారు. 116ఏళ్ల అవ్వ తమిళనాడుకు చెందిన నవనీతమ్మగా గుర్తించారు. ప్రస్తుతం ఆమె తిరుపతి జీవకోనలోని బంధువుల ఇంట్లో ఉన్నట్లు తెలుసుకు న్నారు. శేషాచలం కొండల్లో 3,550 నిటారైన రాతి మెట్లను ఎలాంటి అలసట లేకుండా, కేవలం స్వామిపై ఉన్న నమ్మకంతోనే ఆమె ఎక్కి తిరుమలకు చేరుకోవడంపై బిఆర్‌నాయుడు స్పందించారు. ఆమెకు, ఆమె కుటుంబసభ్యులకు నేడు (సోమవారం) ఉదయం విఐపి బ్రేక్ దర్శనం కల్పించే భాగ్యం కలిగిందని ఆయన పేర్కొన్నారు. అవ్వకుటుంబసభ్యులకు ఈ సమాచారం అందించారు. ఇంకేముంది ఆ దేవుడే దిగివచ్చినంత ఆనందాన్ని వ్యక్తం చేశారు. మరీ అవ్వ నేటి ఏడుకొండల స్వామిని దర్శించుకుని దివ్యానుభూతి పొందనుండటం మాత్రం ఆ దేవుని ఆశీస్సులేనని భావిస్తున్నారు.

# రుషికొండ సౌధాలు పర్యాటక ప్రయోజనాలకే!

- ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ నిర్ణయం
- లీజు కోసం జులై 10లోగా తమ దరఖాస్తులను దాఖలు చేయాలి

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ రుషికొండపై నిర్మించిన అత్యాధునిక సౌధాల వినియోగంపై ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవటు సంస్థల భాగస్వామ్యంతో పర్యాటక ప్రయోజనాలకు వినియోగించాలనే దిశలో కార్యచరణ చేపట్టింది. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విధానంలో నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రక్రియను ప్రారంభిస్తూ ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఎపిటిడిసి) ఆసక్తి వ్యక్తీకరణ కోసం అధికారిక ప్రకటన విడుదల చేసింది. పర్యాటక, ఆతిథ్య రంగంలో అనుభవం ఉన్న సంస్థలు జులై 10లోగా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించింది. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగనమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.452 కోట్ల ప్రజాధనంతో ఈ భవనాల నిర్మాణం చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు రెండేళ్లు గడిచినా ఈ భవనాల వినియోగంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. ఇటీవల మంత్రుల కమిటీ రుషికొండ భవనాలను పరిశీలించి, వాటిని ప్రైవేటు సంస్థల ద్వారా నిర్వహించడం ఉత్తమమనే అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో లీజు ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రుషికొండపై సుమారు 9.8 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఐదు బ్లాకుల భవనాలను లీజుకు ఇవ్వనున్నారు. భవనాలతో పాటు సుందరమైన ఉద్యానవనాలు, అంతర్గత రహదారులు, నడక మార్గాలు, విశాలమైన పార్కింగ్ స్థలాలు వంటి అన్ని మౌలిక వసతులు ఇప్పటికే అందు



బాటులో ఉన్నాయని ఎపిటిడిసి వెల్లడించింది. అంతర్జాతీయ స్థాయి అతిథ్య సేవలకు అనుగుణంగా ఈ సముదాయం సిద్ధంగా ఉందని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న భవనాలతో పాటు సుమారు 1,200 చదరపు ఖాళీ స్థలం కూడా లీజుదారులకు అందుబాటులో ఉంటుందని ఎపిటిడిసి తెలిపింది. అలాగే మొత్తం 4,800 చదరపు మీటర్ల విస్తీర్ణంలో గ్రౌండ్ ప్లస్ వన్ (జీ+1) భవనాలను నిర్మించుకునే అవకాశాన్ని కూడా కల్పించింది. దీనివల్ల భవిష్యత్తులో గదుల సంఖ్యను పెంచుకొని పర్యాటకులకు మరింత మెరుగైన సేవలు అందించే వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు. రుషికొండ ప్రాంతంలో పర్యాటకశాఖకు మొత్తం 70.63 ఎకరాల భూమి ఉంది. ఇందులో 18.65 ఎకరాలు ప్రస్తుతం వినియోగంలో ఉండగా, సుమారు 47.4 ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. మరికొంత భూమి ఆక్రమణలకు గురైనట్లు ప్రభుత్వం అధికారికంగా గుర్తించింది. ఇప్పటి కట్టడాలను వినియోగంలోకి తీసుకుని వస్తూ భవిష్యత్తులో ఈ ప్రాంతాన్ని సమగ్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రుషికొండ ప్యాలెస్‌ల నిర్వహణపై ఇప్పటికే పలు ప్రముఖ అంతర్జాతీయ హోటల్ గ్రూపులు ఆసక్తి వ్యక్తం చేశాయి. తాజ్, అట్మాస్ఫియర్ కోర్, లీలా, ఫెమా వంటి ప్రముఖ ఆతిథ్య సంస్థల ప్రతినిధులు గతంలోనే భవనాలను పరిశీలించినట్లు సమాచారం.

అయితే ప్రస్తుతం ఉన్న గదుల సంఖ్య భారీ స్థాయి హోటల్ నిర్వహణకు అనుకూలంగా లేకపోవడంతో అదనపు గదుల నిర్మాణానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో అంతర్జాతీయ ప్రమాణాల రిసార్ట్ లేదా లగ్జరీ హోటల్‌గా అభివృద్ధి చేసే అవకాశాలు పెరిగాయి. రుషికొండ సముద్ర తీరానికి సమీపంలో ఉండటంతో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్‌జడ్) నిబంధనలు అమల్లో ఉన్నాయి. ఈ కారణంగా విస్తృత స్థాయిలో కొత్త నిర్మాణాలు చేపట్టేందుకు పరిమితులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఖాళీ స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ సిఆర్‌జడ్ నిబంధనలకు అనుగుణంగానే అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటుంది.

# 8 నుంచి సదరం స్లాట్ బుకింగ్

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్



**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** దివ్యాంగుల కోసం పింఛన్‌కు సంబంధించిన వైకల్య ధ్రువపత్రాల (సదరం) జారీ సేవల్లో కీలక సంస్కరణలు తీసుకొచ్చినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ వెల్లడించారు. ఆదివారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ జులై 8 నుంచి సదరం స్లాట్ బుకింగ్ పునః ప్రారంభం అవుతుందని ప్రకటించారు. జులై 13 నుంచి వైకల్య నిర్ధారణ పరీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇకపై జోనల్ విధానంలోనే సదరం స్లాట్ బుకింగ్ ఉంటుందని వివరించారు. రాష్ట్రాన్ని 6 జోన్లుగా ప్రభుత్వం విభజించిందని చెప్పారు. సొంత జోన్‌లోని జిల్లాల్లోనే స్లాట్ బుక్ చేసుకునే అవకాశాన్ని దివ్యాంగులకు కల్పించామని మంత్రి సత్యకుమార్ వివరించారు. తద్వారా సుదూర జిల్లాలకు వెళ్లాల్సిన ఇబ్బందులకు చెక్ పెట్టినట్లు అయిందన్నారు. స్లాట్ బుకింగ్‌కు స్వీయ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అని మంత్రి సత్యకుమార్ చెప్పారు. వైకల్య కేటగిరీపై స్పష్టత లేకపోతే డాక్టర్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. తప్పుడు స్లాట్ బుకింగ్‌లకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయనుందని తెలిపారు. హాజరు నమోదు అనంతరమే వైకల్య పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సదరం పోర్టల్‌లో ఆన్‌లైన్ హాజరు నమోదు తప్పనిసరి అని వివరించారు. హాజరు నమోదుతోనే సదరం ఐడీ యాక్టివేషన్ అవుతుందని పేర్కొన్నారు. సదరం సేవల్లో పారదర్శకత పెంచే దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎపి సేవా పోర్టల్ ద్వారా నేరుగా స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. సిటిజన్ లాగిన్‌తో ఉచితంగా అపాయింట్‌మెంట్ బుకింగ్ చేసుకోవచ్చునని చెప్పారు. సదరం ధ్రువీకరణ పత్రాన్ని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించామని అన్నారు.

సచివాలయాల ద్వారా కూడా సదరం సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఖిమన మిత్రఖి వాట్సాప్ సేవలో స్లాట్ లభ్యత వివరాలు పొందుపరిచామని చెప్పారు. సదరం సేవలన్నీ పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. దళారులకు ఎలాంటి నగదు చెల్లించవద్దని దివ్యాంగులకు అధికారులు స్పష్టం చేశారు. దివ్యాంగులకు ప్రయాణ భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వైద్యులపై పనిభారం తగ్గించేలా ఈ కొత్త విధానం ఉంటుందని తెలిపారు. ఈ సదరంపై అవగాహన కల్పించాలని అధికారులను మంత్రి సత్యకుమార్ ఆదేశించారు.

## యూట్యూబర్ రావణ్‌పై రాజద్రోహం కేసు

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ సార్వభౌమాధికారానికి, సమాజ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించారనే ఆరోపణలపై యూట్యూబర్ రావణ్‌పై పోలీసులు రాజద్రోహం కేసు నమోదు చేసినట్లు పోలీసు వర్గాల సమాచారం. జనసేన పార్టీ ముఖ్య నాయకుడు గరికపాటి శివశంకర్ ఇచ్చిన అధికారిక ఫిర్యాదు ఆధారంగా గన్నవరం పోలీసులు ఈ మేరకు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. సమాజంలో ద్వేషాన్ని పెంచి పోషించడం, దేశ సమగ్రతను దెబ్బతీసేలా వ్యూహాత్మకంగా వ్యవహరించడం వంటి తీవ్రమైన అంశాలను ఈ ఫిర్యాదులో ప్రస్తావించారు. రావణ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, అతని చట్టవిరుద్ధ కార్యకలాపాలు.. దేశ రక్షణకు, అంతర్గత భద్రతకు ముప్పుగా పరిణమించాయని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. తీవ్రమైన విద్వేషాలను రెచ్చగొట్టడానికి అతను ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి. దేశద్రోహ పూరిత చర్యలను ప్రోత్సహించడం, చట్ట వ్యతిరేక శక్తులకు మద్దతుగా నిలవడం వంటి అంశాలపై ప్రాథమిక ఆధారాలను పరిశీలించిన తర్వాతే పోలీసులు కేసు నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ వ్యవహారంలో రావణ్‌పై చట్టపరంగా కఠినమైన సెక్షన్లను ప్రయోగించారు. రావణ్‌పై భారతీయ శిక్షాస్మృతి మేరకు 147, 148, 152, 192, 197(1)డి, 353(1బి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వీటితో పాటు అత్యంత కీలకమైన, దేశ రక్షణకు సంబంధించిన చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం లోని సెక్షన్ 13, సెక్షన్ 39లను కూడా ఇందులో చేర్చి, దర్యాప్తు ప్రారంభించారు.

## ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్లకు పోస్టింగ్‌లు


**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్లుగా పదోన్నతి పొందిన వారికి ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది,. వీరిలో రాజమండ్రి జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్‌గా జి.శ్రీనివాస్, ఎపిఎస్‌బిసిఎల్ డిపో మేనేజర్‌గా ఆర్వీ ప్రసాద్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సూపరింటెండెంట్‌గా డి.రఘురామరెడ్డి, హెడ్ క్వార్టర్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఆర్.జగదీశ్వరరెడ్డి ఉన్నారు. వీరంతా తక్షణం విధుల్లో చేరాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# పుర మిత్ర యాప్‌లో నాలుగు కొత్త ఫీచర్లు




- అందుబాటులోకి తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- పట్టణ, నగర ప్రజలకు

**మరింత వేగవంతంగా, పారదర్శకంగా పౌర సేవలు అందించడమే లక్ష్యం**



**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పురమిత్ర యాప్‌లో కొత్త ఫీచర్లును అందుబాటులోకి తీసుకుని వచ్చింది. పట్టణ ప్రాంత ప్రజలకు మరింత వేగవంతంగా, పారదర్శకంగా పౌర సేవలు అందించేందుకు ప్రభుత్వం పురమిత్ర యాప్‌లో నాలుగు కీలకమైన కొత్త ఫీచర్లను అందుబాటు లోకి తీసుకువస్తోంది. కొత్త ఫీచర్లతో పురమిత్ర యాప్ ప్రజలకు మరింత సౌకర్యవంతమైన డిజిటల్ సేవల వేదికగా మారనుంది. ఫిర్యాదుల నమోదు నుంచి సమస్యల పరిష్కారం వరకు ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు, ప్రజల అభిప్రాయాలను సేకరించ డం, ప్రభుత్వ సమాచారాన్ని ఒకే వేదికపై అందించడం వంటి చర్యలతో పట్టణ పాలనలో పారదర్శకత, వేగం, ప్రజల భాగస్వామ్యం మరింత పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ప్రజల్లో మంచి ఆదరణ పొందిన ఈ యాప్‌ను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'సేవ్ మై ప్రాపర్టీ', రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల (ఆర్‌డబ్ల్యూఏ) ఇంటిగ్రేషన్, సిటిజన్ ఫీడ్‌బ్యాక్ మాడ్యూల్, సోషల్ మీడియా ఇంటిగ్రేషన్ వంటి సదుపాయాలను ప్రవేశపె డుతున్నారు. ఈ మార్పులతో పురమిత్ర యాప్‌ను కేవలం ఫిర్యాదుల నమోదు వేదికగా కాకుండా సమగ్ర పౌరసేవల డిజిటల్ ప్లాట్‌ఫారంగా అభివృద్ధి చేస్తున్నారు.

ప్రడివిజన్లు, వార్డుల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ వంటి పౌర సమస్యలను ప్రజలు నేరుగా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువచ్చే ఉద్దేశంతో ప్రభుత్వం గత ఏడాది మార్చి 16న పురమిత్ర యాప్‌ను ప్రారంభించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని 123 పురపాలక సంస్థలు, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల పరిధిలో 18.44 లక్షల మంది ఈ యాప్‌ను తమ మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకున్నారు. యాప్ ద్వారా ఇప్పటివరకు నమోదైన 1.45 లక్షల ఫిర్యాదుల్లో 98 శాతం సమస్యలను పరిష్కరించినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. యాప్ పనితీరును సమీక్షించిన ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ చేసేలా సాంకేతికంగా మరిన్ని సౌకర్యాలను జోడిస్తోంది.

కొత్తగా ప్రవేశపెడుతున్న 'సేవ్ మై ప్రాపర్టీ' ఫీచర్ ద్వారా ఇళ్ల యజమానులు లేదా అద్దెకు నివసించే వారు తమ ఇంటి వివరాలను ఒకసారి మాత్రమే యాప్‌లో నమోదు చేస్తే సరిపోతుంది. అనంతరం ఎలాంటి ఫిర్యాదు చేసినా ప్రతిసారి ఇంటి చిరునామా నమోదు చేయాల్సిన అవసరం ఉండదు. దీంతో ఫిర్యాదుల నమోదు ప్రక్రియ మరింత వేగవంతం అవుతుంది. అలాగే మున్సిపల్ సిబ్బంది సంబంధిత ప్రదేశాన్ని సులభంగా గుర్తించి సమస్యను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుంది. పురమిత్ర యాప్‌లో మరో కీలకమైన సదుపాయంగా 'హాట్ స్పాట్' గుర్తింపు వ్యవస్థను అమలు చేస్తున్నారు. 100 మీటర్ల పరిధిలో ఒకే సమస్యపై అయిదు కంటే ఎక్కువ ఫిర్యాదులు నమోదైతే ఆ ప్రాంతాన్ని హాట్ స్పాట్‌గా గుర్తిస్తారు. అలాంటి ప్రాంతాలకు మున్సిపల్ కమిషనర్లు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి స్వయంగా పరిశీలించి సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సి ఉంటుంది. దీని ద్వారా తరచుగా సమస్యలు ఎదురయ్యే ప్రాంతాల్లో వేగంగా చర్యలు తీసుకునే అవకాశం ఏర్పడుతుంది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అందిస్తున్న సేవల నాణ్యతపై ప్రజల అభిప్రాయాన్ని నేరుగా తెలుసుకునేందుకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ మాడ్యూల్ అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ ఫీచర్ ద్వారా సేవలపై ప్రజలు తమ సూచనలు, అభిప్రాయాలు, అసంతృప్తిని నమోదు చేయవచ్చు. ఈ సమాచారం ఆధారంగా సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. సోషల్ మీడియా ఇంటిగ్రేషన్ ద్వారా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అధికారిక ప్రకటనలు, ప్రభుత్వ కార్యక్రమాలు, తాజా సమాచారం, ప్రజలకు అవసరమైన అవగాహన సందేశాలు అన్నీ పురమిత్ర యాప్‌లోనే అందుబాటులో ఉంటాయి. దీంతో ప్రజలు వివిధ ప్రభుత్వ సమాచారాన్ని ఒకే వేదికపై సులభంగా తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో సుప్రీంకోర్టు జడ్జి

**శ్రీకాళహస్తి, జులై 5 ప్రభాతవార్త:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ విపుల్ యం.పంచోలి కుటుంబసభ్యులతో కలసి రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. సుప్రీం కోర్టు జడ్జికి దక్షిణ గోపురం వద్ద ఆలయ కార్యనిర్వహణాధికారి బికె వెంకటేశు, ప్రోటోకాల్ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గురప్పశెట్టి ఆలయ మర్యాదలతో వేదపండితులతో స్వాగతం పలికారు. అలాగే న్యాయశాఖకు చెందిన తిరుపతి ఎడిజె శ్రీకాళహస్తి ఫుల్ అడిషనర్‌చార్జి జడ్జి ఏ.నరసింహామూర్తి స్వాగతం పలికారు. న్యాయమూర్తి ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా వారికి సహస్రలింగేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసారు. వేదపండితులు శాస్త్రోక్తంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపారు. వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.



మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, ఎపిఆర్‌ఓ రవి, పర్యవేక్షకులు నాగభూషణం కోర్టు ప్రోటోకాల్ పర్యవేక్షకులు రవిలు పర్యవేక్షించారు.



## జ్ఞానమ్మకు బంగారు ఆభరణాలు వితరణ

**శ్రీకాళహస్తి, జులై 5 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి విజయవాడకు చెందిన భక్తులు అమరేశ్వరరావు బంగారు ఆభరణాలను వితరణగా అందించారు. ఆదివారం అమరేశ్వరరావు కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో రూ.6.05లక్షల విలువ గల బంగారు హారాన్ని ఆలయ ఇఒ బికె వెంకటేశు ద్వారా ఆలయానికి సమర్పించారు. దాతలకు గుర్తింపుగా వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయంతో పాటు వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. ఏర్పాట్లను ఆలయ ప్రోటోకాల్ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి ఎపిఆర్‌ఓ కె.శ్రీనివాసులు అకౌంటెంట్ యుగంధర్, అప్రైజర్ బాలాజిలు పాల్గొన్నారు.

6-7pg4_6-7pg4.qxd 05/Jul/26 10:54 PM Page 1



వార్త

సంస్కారం, సభ్యత అనేవి ఎక్కడికి వెళ్లినా గౌరవం లభింపచేసే పాస్‌పోర్టులు.

- న- జాన్సన్

# హే రామ్! హే భగవాన్!!

ఇందుగలడందులేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుండు' ఎందెందు వెదకిచూచిన అందందే...! అనే పోతన భాగవతంలోని పద్యతాత్పర్యం ఆలకిస్తే విష్ణువు అలవైకుంఠపురంలోనే కాదు ఎక్కడ చూసినా అన్ని చోట్లా ఉంటాడని అర్థం. దేవుడున్నచోట మకిల ఉండదని చెప్పుకునేవారిని ఆశ్చర్యానికి గురిచేస్తూ దైవ క్షేత్రాల్లోనూ అవినీతి మూడుపువ్వులు ఆరుకాయలుగా విలసిల్లుతూ ఉంటుందనే విషయం 'అయోధ్య, బద్రీనాథ్ వంటి దైవక్షేత్రాల్లో సైతం బయటపడుతోంది. అయోధ్య అదొక దివ్యధామం. బాబ్రీ మసీదు, రామజన్మభూమి అంశంపై హిందూ ముస్లింల మధ్య పొరపొచ్చాలను ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం 'క్షీర నీర' న్యాయం అన్న చందాన తేల్చేశాక అయోధ్య రామ మందిర నిర్మాణానికి ఎంతో శ్రద్ధాసక్తులతో రామభక్తులు పూనుకున్నారు. ఆ వెంటనే గత కాలంలో వారణాసి, మధుర, వంటి ఎన్నో దివ్య క్షేత్రాల్లో భారతీయ భక్తితత్వంపై, దివ్యక్షేత్రాలపై ముస్లింలు దాడి చేసి ఆక్రమించుకోవడాన్ని నిరసిస్తూ కోర్టులకెక్కారు. జరిగింది ఎప్పుడైనా న్యాయం ఇప్పటికైనా లభిస్తోంది. కొన్నిటిపై హిందూ ధర్మ పరిరక్షణ పేరిట తీర్పులు సానుకూలంగా పొందారు కూడా. ఆ మేరకు ఆయా ఆధ్యాత్మిక క్షేత్రాల్లో దైవక్షేత్ర పునర్నిర్మాణ కార్యక్రమాలు చేపట్టారు. భరతుడు రామపాదుకలు పట్టినట్లుగా దేశంలోని మారుమూల ప్రాంతాలు సైతం రామ మందిర నిర్మాణానికి పేర్చనున్న ఇటుకలను పరమభక్తి భావంతో పూజలు చేసి మరీ ఫైజాబాద్‌కు తీసుకెళ్లారు రామభక్తులు. భక్తిపారవశ్యంలో అయోధ్య రామమందిర నిర్మాణం జరగడం, బాలరాముడి విగ్రహ ప్రతిష్టాపన చరిత్రలో అతి ప్రాధాన్యమైన విషయంగా నిలిచిపోయింది. 'రామో విగ్రహవాన్ ధర్మః' అనేమాట భక్తుల నోట ఎప్పుడూ నానేమాట. రాముడంటేనే ధర్మం మూర్తీభవించిన వ్యక్తి అతని రాజ్యంలో ధర్మం నాలుగు పాదాలతో నడుస్తుందని ప్రతీతి. కాగా ప్రస్తుత కలియుగధర్మం కుంటినడక నడుస్తోందని చెప్పక తప్పదు. దైవధామాల్లో అవినీతి రాజ్యమేలుతోందన్న విషయం ఒక్కటొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. సాధారణ హిందూ దేవాలయాల్లో భక్తుల దోపిడీ జరుగుతుందన్నది జనశ్రుతిగా సాగుతోంది. రాముడి పేరిట, దేముడి దోసిట ప్రసాదాలు, ధానధర్మాలుగా వచ్చినవి ఎటువంటివైనా కైంకర్యమే. వాటిని అడ్డుకునేందుకు ఎలాంటి భక్తిభావం కానీ, ధర్మాచరణ కానీ అందుబాటులో లేవు. హుండీల్లో నగలు, నగదు కూడా మాయమే. తన కళ్లెదుట అపవిత్ర కార్యాలు, అసంగతులు జరుగుతున్నా ఎవరూ ఏమీ చేయలేకపోతున్నారు. అయోధ్య విరాళాల కుంభకోణంలో ఎన్నో అవినీతి కార్యక్రమాలు బయటపడ్డాయి. ఈ రామమందిర నిర్మాణ చరిత్రను తవ్విచూస్తే బాబ్రీ మసీద్ అయోధ్య రామమందిరం కథల కన్నా ఎన్నో విషయాలు బయటి కొస్తున్నాయి. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకుంటున్నారన్న రీతిలో కలియుగ ప్రస్థానంలో ఎవరితోనూ మాట్లాడని రాముడి సేవా కైంకర్యాలు, వైభవ సంకేతాలను సైతం సొంతం చేసుకునే చంపత్ రాయ్‌లు, పూజారిలు, కొంత మంది ఆధ్యాత్మికవేత్తలు, ఆస్తిక నేతలు సైతం 'తిలాపాపం తలా పిడికెడు' అన్న చందాన చేతులేశారు. రాముడు ఎంతో పతితపావనుడు, రామజన్మ భూమి ఎంతో పవిత్రమైనది' అని పదేపదే మనం గొంతు చించుకోవడం తప్పితే ఆయా దేవుళ్లకు, ఆయా ప్రాంతాలకు పవిత్రతను సమకూర్చే ఎలాంటి కార్యాచరణ అక్కడ కనపడదు. కుంభకోణాలు, కైంకర్యాలు, అవినీతి కార్యకలాపాలు, ఇవన్నీ దైవలీలలా అంటే కాదనే చెప్పాలి. 'తీగ లాగితే డొంకంతా కదిలినట్లు' ప్రతీ అంశంలోనూ ఎన్నో చిత్రవిచిత్రాలు తారసపడుతున్నాయి. అయోధ్య రామమందిరం విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తాజాగా స్పందించింది. ఆరెస్సెస్ తొలిసారి ఈ అంశంపై దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. అసాధారణ అవినీతిని నొచ్చుకుంది కూడా. ఈ ఉదంతం యావత్తూ రామ భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసిందని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే ఆందోళన చెందారు. హిందూ ధర్మాన్ని సమాజాన్ని అప్రతిష్టపాలు చేసే శక్తుల్ని వారి కుట్రల్ని తిప్పికొట్టాలని పిలుపు నివ్వడంలో ఎలాంటి ప్రత్యేకత కనిపించలేదు. ఇలాంటి కుంభకోణాల వ్యవహారాల్లో ఏలినవారు కానీ గట్టు మీదనున్నవారు కానీ స్పందించే తీరు సహజంగా ఇలాగే ఉంటుంది. అంతాజరిగాక ఆలయ నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయాలని శ్రీ రామజన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు సూచించడమంటే ఎంతో పరిహాసాస్పదంగానే గోచరిస్తోంది. ఎక్కడైతే నిజాయితీ పాదముద్రలు స్పష్టంగా కనపడతాయని భావి స్తామో అక్కడవి మచ్చుకైనా కానరాకపోతే కలిగే ఫీలింగ్ మాత్రమే జనిస్తోంది. ప్రజాబాహుళ్యంలో బిజెపి పాలిత ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ ధామ్‌లో కానుకలు, విరాళాల దుర్వినియోగం జరిగినట్లుసోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న విమర్శలు ఈ దేశ దైవధామాల అవినీతి కథలను మరింత గందరగోళపరుస్తున్నాయి. విరాళాల నోట్ల లెక్కింపు కోసం నియమించుకున్న వారి నేపథ్యం సరిగా పరిశీలించుకోనందు వల్లనే ఈ పొరపాట్లు జరిగాయని సరిపెట్టుకున్నా, జరిగిన 'తమాషా'ను ఏ విధంగానూ సమర్థించుకోలేని పరిస్థితి రామభక్తుల్లో నెలకొని ఉంది. అయోధ్య భారతీయుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక. కోట్లాది మంది భక్తులు భావోద్వేగాలతో ముడిపడి ఉన్న అంశం కావడంతో పూర్తిస్థాయి చట్టబద్ధ దర్యాప్తు అవసరం ఉంది. విశ్వాసం ఉన్నచోట పారదర్శకతకూ ఎక్కువ విలువ ఇవ్వాల్సి ఉంటుంది.



మనిషి విజయం ఆర్జించిన డబ్బును బట్టి కాక సాధించిన మనశ్శాంతిని బట్టి ఉంటుంది.

అరిస్టాటిల్



జీవితంలో కొన్నిసార్లు విఫలమైనా సఫలం కావడానికి మరొక అవకాశం కలుగుతుంది.

డావిన్సి

# అప్రమత్తం కాకపోతే ఆహార సంక్షోభమే!

**వాతావరణ మార్పులు ఇక తాత్కాలిక సమస్య కాదు. రాబోయే దశాబ్దాల్లో ఇవే వ్యవసాయ విధానాలను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, రైతులు, సమాజం కలిసి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి. వాతావరణ సమాచారాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్లాలి. నీటి సంరక్షణ, మట్టి ఆరోగ్యం, వాతావరణానికి అనుగుణమైన వ్యవసాయ విధానాలు, బలమైన నిల్వవ్యవస్థ, సమర్థవంతమైన పంటల బీమా, రైతులకు ఆర్థిక భరోసా వంటి అంశాలను సమగ్రంగా అమలు చేస్తేనే ఈ సవాలును ఎదుర్కోగలం. ఎల్‌నినో ప్రభావాన్ని మనం ఆపలేము. కానీ దాని వల్ల కలిగే నష్టాన్ని మాత్రం తగ్గించవచ్చు. వాతావరణ సంక్షోభం కేవలం వ్యవసాయాన్నే కాదు.. దేశ ఆహార భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కోట్లాది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది.**

వనకల్ల వీరప్ప

వాతావరణ మార్పులు ఇప్పుడు భవిష్యత్ ప్రమాదం కాదు.. వర్తమాన వాస్తవం. ఒకప్పుడు రుతువులు సమయానికి వచ్చేవి. వర్షాలు ఒక క్రమంలో కురిసేవి. రైతులు వాటిని ఆధారంగా చేసుకుని సాగు ప్రణాళికలు రూపొందించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎండలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. వర్షాలు ఆలస్యంగా వస్తున్నాయి. వచ్చినా ఒకేసారి కుండపోతగా కురిసి వరదలు సృష్టిస్తున్నాయి. తర్వాత మళ్లీ దీర్ఘకాలం పొడి వాతావరణం నెలకొంటోంది. ఈ అసాధారణ పరిస్థితులకు ప్రధాన కారణాల్లో ఒకటి ఎల్‌నినో ప్రభావం. భారత వాతావరణ శాఖ, భారత ఉష్ణమండల వాతావరణ అధ్యయన సంస్థతో పాటు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు కూడా ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశాన్ని హెచ్చరిస్తున్నాయి. ఈ ప్రభావం సెప్టెంబరు వరకు కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీనివల్ల రుతుపవనాల బలం తగ్గి, దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉంది. భారత వాతావరణ శాఖ కూడా ఈ ఏడాది రుతుపవన వర్షపాతం దీర్ఘకాలిక సగటులో సుమారు 90శాతమే ఉండవచ్చని పేర్కొంది. అంటే వ్యవసాయం, తాగునీరు, విద్యుత్, ఆహార ఉత్పత్తి వంటి రంగాలపై ప్రత్యక్ష ప్రభావం పడే అవకాశం ఉంది. ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం. ఈమార్పు ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాత విధానాలను ప్రభావితం చేస్తుంది. భారతదేశంలో సాధారణంగా ఇది నైరుతి రుతుపవనాలను బలహీనపరుస్తుంది. ఫలితంగా వర్షాలు ఆలస్యంగా రావడం, తక్కువగా కురవడం లేదా అసమానంగా కురవడం జరుగుతుంది. ఈ పరిస్థితులు ముఖ్యంగా వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి. భారతదేశంలో దాదాపు 60 శాతం వ్యవసాయం ఇప్పటికీ వర్షాలపైనే ఆధారపడి ఉంది. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, పత్తి వంటి పంటలు ఎక్కువగా వర్షాధార ప్రాంతాల్లోనే సాగవుతాయి. వర్షాలు తగ్గితే దిగుబడులు పడిపోతాయి. రైతుల ఆదాయం తగ్గుతుంది. అప్పులు పెరుగుతాయి. చివరకు దేశ ఆహార భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. అందుకే వాతావరణ మార్పు అనేది కేవలం ప్రకృతి సమస్య కాదు. అది ఆర్థిక, సామాజిక, ఆహార భద్రతకు సంబంధించిన పెద్ద సవాలు. ఇటీవలి సంవత్సరాల్లో భారతదేశం తీవ్ర వాతావరణ వైపరీత్యాలను వరుసగా చూస్తోంది. ఒకవైపు రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మరోవైపు కొద్ది గంటల్లోనే నెల రోజుల వర్షం కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూన్‌లో భారీ వర్షాలు, ఆగస్టు లేదా అక్టోబరులో తీవ్ర పొడి వాతావరణం వంటి అసాధారణ పరిస్థితులు సాధారణమైపోతున్నాయి. పశ్చిమ వాతావరణ కల్లోలాలు, వేడి గాలులు, ఆకస్మిక తుఫాన్లు సంప్రదాయ వాతావరణ చక్రాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ పరిస్థితుల్లో రైతులు గత అనుభవాల ఆధారంగా పంటలు వేయడం ప్రమాదకరంగా మారుతోంది. ఈఏడాది వేసవిలో భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగటి వేడితో పాటు రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గకపోవడం ఆందోళన కలిగించే అంశం.



మరోవైపు ఉత్తర భారతదేశంలో ఆకస్మిక తుఫాన్లు, భారీ వర్షాలు నమోదయ్యాయి. ఇవి సాధారణ వర్షాలు కాదని, రుతుపవనాల క్రమాన్ని దెబ్బతీసే వాతావరణ మార్పుల సంకేతాలని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిణామాలు రాబోయే నెలల్లో వ్యవసాయంపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం కేవలం రైతులకే పరిమితం కాదు. మార్కెట్‌లో ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతుంది. గోధుమలు, బియ్యం, పప్పులు, వంట నూనెల ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం కూడా అధికమవుతుంది. గతంలో గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక ఆంక్షలు విధించాల్సి వచ్చిన సందర్భాలున్నాయి. దీనికి ప్రధాన కారణం దేశీయ అవసరాలను ముందుగా తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడటమే. ప్రపంచ పరిస్థితులు కూడా భారత్‌కు కొత్త సవాళ్లు విసురుతున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు కారణంగా ఇంధనాలు, ఎరువులు, ఖనిజాల ధరలు పెరుగుతున్నాయి. ఇవి వ్యవసాయ వ్యయాన్ని మరింత పెంచుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల నిల్వలున్నప్పటికీ, రబీ సీజన్‌కు సరిపోతాయా అనే సందేహాలు ఉన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా పంటలపై తెగుళ్ల పెరిగితే పురుగుమందుల అవసరం కూడా అధికమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు మాత్రమే సరిపోవు. రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపిక, సాగు పద్ధతులు మార్చుకోవాలి. ప్రభుత్వం కూడా సమయానికి వాతావరణ హెచ్చరికలు, పంటల సూచనలు అందించాలి. ప్రతి జిల్లాకు తగిన వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని విత్తనాలు అందుబాటులో ఉంచాలి. తక్కువ నీటితో సాగయ్యే చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలి. ఇవి నీటిని ఆదా చేయడమే కాకుండా పోషకాహార భద్రతను కూడా బలోపేతం చేస్తాయి. మట్టిలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం కూడా అత్యంత అవసరం. ఆవు పేడ, కంపోస్ట్, పెరటి ఎరువులు, జీవబొగ్గు వంటి సహజ వనరులను వినియోగించడం ద్వారా నేలనీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీంతో వర్షాలు ఆలస్యమైనా పంటలకు కొంత రక్షణ లభిస్తుంది. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో పంటల బీమా వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులందరికీ బీమా రక్షణ కల్పించాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. అలాగే బహుళ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా ఒకే పంటపై ఆధారపడే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. దేశ ఆహార భద్రతను కాపాడాలంటే ఉత్పత్తి పెరగడం మాత్రమే కాదు.. నిల్వ సామర్థ్యం కూడా పెరగాలి. ప్రస్తుతం పంట కోత తర్వాత సరైన గిడ్డంగులు లేక లక్షల టన్నుల ధాన్యం వృథా అవుతోంది. ప్రతి గ్రామం లేదా మండలస్థాయిలో ఆధునిక గిడ్డంగులు నిర్మించి, రైతుల భాగస్వామ్యంతో నిర్వహించే విధానాన్ని అమలు చేయాలి. యువ పారిశ్రామికవేత్తలను ఈ రంగంలో ప్రోత్సహిస్తే గ్రామీణ ఉపాధి పెరగడంతో పాటు ఆహార నిల్వ వ్యవస్థ కూడా బలపడుతుంది. వాతావరణ మార్పులు ఇక తాత్కాలిక సమస్య కాదు. రాబోయే దశాబ్దాల్లో ఇవే వ్యవసాయ విధానాలను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, రైతులు, సమాజం కలిసి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి. వాతావరణ సమాచారాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్లాలి. నీటి సంరక్షణ, మట్టి ఆరోగ్యం, వాతావరణానికి అనుగుణమైన వ్యవసాయ విధానాలు, బలమైన నిల్వవ్యవస్థ, సమర్థవంతమైన పంటల బీమా, రైతులకు ఆర్థిక భరోసా వంటి అంశాలను సమగ్రంగా అమలు చేస్తేనే ఈ సవాలును ఎదుర్కోగలం. ఎల్‌నినో ప్రభావాన్ని మనం ఆపలేము. కానీ దాని వల్ల కలిగే నష్టాన్ని మాత్రం తగ్గించవచ్చు. వాతావరణ సంక్షోభం కేవలం వ్యవసాయాన్నే కాదు.. దేశ ఆహార భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కోట్లాది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. •

# ఎఐలోను 'మహిళా హక్కులు' అవసరం

మర్రాపు వసుంధరా దేవి

ఈ రోజుల్లో ఎక్కడ చూసినా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) గురించే చర్చ జరుగుతోంది. మనుషుల పనిభారాన్ని తగ్గిస్తూ, అద్భుతాలు సృష్టిస్తోందని కొనియాడబడుతున్న ఈ కృత్రిమ మేధస్సు, అంతర్లీనంగా ఒక ప్రమాదకరమైన జాడ్యాన్ని కూడా తనలో దాచుకుంటోంది. అదే 'లింగ వివక్ష'. ఇటీవల ఐక్యరాజ్యసమితి (యుఎన్) మహిళా విభాగం విడుదల చేసిన ఒక నివేదిక ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. 'లేడీస్ అంటే ఎఐకి అలుసు' అనే పచ్చి నిజాన్ని ఈ నివేదిక సమాజం ముందు పెట్టింది. అయితే ఈ వివక్షకు, సమాధానాల్లో దొర్లేతప్పులకు సాంకేతిక పరిభాషలో చెప్పుకునే ఎలాంటి 'బగ్' కారణం కాకపోవడమే ఇక్కడ అసలు ట్విస్ట్. ఎఐ అనేది ఒక ఖాళీ కాగితం లాంటిది. దానికి సొంతంగా ఆలోచించే హృదయమో, నైతికతతో కూడిన మేధస్సో ఉండవు. ఇంటర్నెట్లో దశాబ్దాలుగా అందుబాటులో ఉన్నకోట్లాది మానవ సంభాషణలు, పుస్తకాలు, వార్తలు, సమాచారాన్ని విశ్లేషించి అది సమాధానాలు నేర్చుకుంటుంది. అంటే, మన సమాజంలో శతాబ్దాలుగా వేరూనుకుపోయిన పితృస్వామ్య పోకడలను, స్త్రీలపై ఉన్న పక్షపాతాలను, మూస పద్ధతులను ఎఐ తన గురువులైన మనుషుల నుంచే నేర్చుకుంది. మనుషుల అవలక్షణాలు, పక్షపాతాలే ఎఐకి పాఠాలుగా మారాయి. ఐక్యరాజ్యసమితి పరిశోధనల ప్రకారం.. అధ్యయనంచేసిన ఎఐ వ్యవస్థల్లో 44 శాతం వ్యవస్థలు తీవ్రమైన లింగ వివక్షను, 25 శాతం కంటే ఎక్కువ వ్యవస్థలు లింగ, జాతి వివక్షను స్పష్టంగా ప్రదర్శించడమే దీనికి నిదర్శనం. వివిధ సందర్భాలలో ఎఐ ఇచ్చిన సమాధానాలను పరిశీలిస్తే స్త్రీలపై దానికి ఉన్న చులకనభావం, అలుసు స్పష్టంగా అర్థమ



వుతుంది. సాధారణ వాక్యాలను పూర్తి చేయమని ఎఐని అడిగినప్పుడు, అది పురుషులను వ్యాపారాలు, నాయకత్వం, వృత్తిపరమైన విజయాలతో ముడి పెట్టింది. అదే సమయంలో స్త్రీలను ఇల్లు, వంటగది, కుటుంబం, పిల్లల సంరక్షణకే పరిమితం చేస్తూ సమాధా నాలిచ్చింది. కొన్ని ప్రత్యేకసందర్భాల్లో స్త్రీలను స్వతంత్ర వ్యక్తులుగాకాకుండా, కేవలం ఆస్తిగా లేదా పురుషులకు లోబడిన లైంగిక వస్తువులుగా చిత్రీకరించేలా ఎఐ ప్రవర్తించింది. ఇందులో ప్రతి ఐదు సమాధానాలలో ఒకటి లింగ వివక్ష లేదా స్త్రీ వ్యతిరేకతతో కూడి ఉండటం గమనార్హం. ఇంతటితో ఆగకుండా, ఇంటర్నెట్ వేదికగా మహిళలపై జరిగే హింసకు, వేధింపులకు కూడా ఎఐ ఒక సాధనంగా మారుతోంది. మహిళా హక్కుల కార్యకర్తలు, జర్నలిస్టులలో నలుగురిలో ఒకరు ఎఐ సహాయంతో ఆన్లైన్ వేధింపులను ఎదుర్కొంటుండటం ఆందోళనకరం. మహిళలఅనుమతి లేకుండా వారి ముఖాలను మార్చేసి 'డీప్‌ఫేక్' అశ్లీలచిత్రాలు, వీడియోలు సృష్టించడానికి ఎఐని వాడుతూ డిజిటల్ ప్రపంచంలో మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. కోట్లాది మంది ప్రజలు ఇమెయిళ్లు రాయడానికి, ప్రెజెంటేషన్లు సిద్ధం చేయడానికి, కంటెంట్ సృష్టించడానికి నిత్యం ఎఐని వాడుతున్న తరుణంలో, అది ఇలాంటి వివక్షతో కూడిన సమాధానాలుఇస్తూపోతే సమాజంలో లింగ వివక్ష మరింత బలపడేప్రమాదం ఉంది. అందుకే ఐక్యరాజ్య సమితి హెచ్చరించినట్లుగా.. మానవ మేధస్సును భర్తీ చేయడం కంటే, మానవులదుర్మార్గాలు, పక్షపాతాలు, వివక్షలను ఎఐ వారసత్వంగా తీసుకోకుండా చూడటమే ప్రస్తుతం మానవాళి ముందున్న అతి పెద్ద సవాలు. ఎఐ అభివృద్ధి దశ నుండి దాని వినియోగం వరకు ప్రతి చోటా లింగ సమానత్వాన్ని, మహిళల హక్కులను జోడించాల్సిన అవసరం ఉంది. ఎఐకి కేవలం కోడింగ్ మాత్రమే కాదు, 'సమానత్వం' అనే పాఠం కూడా నేర్పినప్పుడే అది నిజమైన ప్రగతికి బాటలు వేస్తుంది. •

# ప్రజావాక్కు



## నేల మాళిగను హేతువాద సంఘం తెరుస్తుంది

**కేరళలోని** తిరువనంతపురం అనంతపద్మనాభుని దేవాలయంలోని ఆరవ నేలమాళిగలో ఏదో ఉన్నదని, కొంత మంది ఈమధ్య సైన్స్‌కు కూడా అంతుపట్టని దేవుడు, దెయ్యాలు, అద్భుత శక్తులున్నాయని, తెరిస్తే ప్రళయం వస్తుందని, నాగబంధం తెరిస్తే లోకం అల్లకల్లోలం అవుతుందని, నాగుపాములు బుసకొడుతుంటాయని, సముద్రం ఉప్పొంగుతుంది అని 'యుట్యూబుల్లో' రకరకాలుగా ప్రజలను భయపెడుతున్నారు. ఇలాంటి ప్రకటనల ద్వారా ప్రజలను భయపెట్టేవారిని అరెస్ట్ చెయ్యాలి. ఐదవ నేల మాళిగలో లభించిన ఆభరణాలు కోట్లవిలువ చేస్తాయని, అరవ నేలమాళీగ కూడా తెరవాలని ఆమధ్య హైకోర్టు ప్రయత్నించి, తెరచిన వాళ్ళు చనిపోతున్నారని భక్తులు భయపెట్టగా కోర్టు తెరవటాన్ని వాయిదవేసింది. వాటి గుట్టు రట్టుచేసి ప్రపంచంలో అద్భుతశక్తులు ఏమీ లేవని నిరూపించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది. నాగ బంధం తెరిస్తే వాళ్ళు చనిపోతారని, గతంలో ఇలాంటివి జరిగాయని భయపెడుతున్నారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## మెసేజ్ చార్జీల మోత!

**ఈ మధ్యకాలంలో** బ్యాంకులవారు ఎస్.ఎం.ఎస్. ఛార్జీల మ్రోత మ్రోగించడం మరీ ఎక్కువైంది. దీంతో ఎందుకు తమ బ్యాంకు ఖాతాలోని డబ్బు మాటిమాటికీ కోత పడుతున్నదో తెలియని ఆగమ్యగోచర పరిస్థితుల్లో ఖాతాదారులు కొట్టుమిట్టాడుతున్నారు. ఒకవిధంగా చెప్పాలంటే పరిస్థితి అనేది ఎలా తయారుఅయ్యింది అంటే ఇంట్లో డబ్బు పెట్టుకుంటే రక్షణ సమస్య, అదే బ్యాంకులో వేసుకుంటే ఇలా తమ బ్యాంకు ఖాతాలోని డబ్బు కేంద్రప్రభుత్వం వారుఅనుసరిస్తున్న కొన్ని అర్థం, పర్థం లేని అస్థవ్యస్థమైన విధానాలు ఖాతాదారుల పాలిట పెనుశాపంగా పరిణమిస్తున్నది. దీంతో ప్రజల పరిస్థితిముందు నొయ్యి వెనుక గొయ్యిలా తయారు అయ్యింది.

- బి. మధుపాళి, నంద్యాల జిల్లా

## మొబైల్ వాడకాన్ని తగ్గించాలి

**ఇప్పటి కాలంలో** చిన్న పిల్లల చేతుల్లో కూడా మొబైల్ ఫోన్లు కనిపిస్తున్నాయి. ఆటల కోసం అని మొదలైన ఈ అలవాటు క్రమంగా హానికరంగా మారుతోంది. ఎక్కువ సేపు మొబైల్ వాడడం వల్ల కంటి చూపు తగ్గిపోవడం, శారీరక చలనం తగ్గడం, చదువుపై దృష్టి తగ్గిపోతోంది. తల్లిదండ్రులు మొబైల్ వాడకాన్ని తగ్గించాలి.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

## విరాళాల నిర్వహణలో నైతికత అవసరం

**దేవాలయాలు** భక్తులవిశ్వాసానికి ప్రతీకలు. భక్తులు సమర్పించే విరాళాలు దైవభక్తికి, ధార్మిక సేవకు చిహ్నం. అలాంటి పవిత్ర నిధులదుర్వినియోగం లేదా అపహరణకు సంబంధించిన ఆరోపణలు వెలుగులోకి రావడం బాధాకరం. ఇటీవల శ్రీరామాలయ విరాళాల అక్రమ వినియోగానికి సంబంధించిన వార్తలు కూడా ఈఅంశంపై మరోసారి దృష్టి సారింపజేశాయి. ఈ సమస్యను భావోద్వేగంతో కాకుండా వివేకంతో పరిశీలించాలి. నేరం ఎక్కడ జరిగినా నేరమే. దేవాలయం కావచ్చు, ఇతర ప్రార్థనా మందిరం కావచ్చు లేదా ఏ సంస్థ అయినా కావచ్చు ప్రజల విశ్వాసానికి భంగం కలిగించే చర్యలను చట్టం కఠినంగా ఎదుర్కోవాలి. ఆధునిక డిజిటల్ లెక్కల విధానం, స్వతంత్ర ఆడిట్లు, సీసీటీవీ పర్య వేక్షణ, విరాళాల వినియోగంపై క్రమం తప్పకుండా ప్రజలకు సమాచారం అందించడం వంటి చర్యలు విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తాయి. విరాళాల నిర్వహణలో నైతిక విలువలు, పారదర్శకత, చట్టబద్ధత పాటించాలి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## నైపుణ్యం పెంచుకోవాలి

**నిరుద్యోగం** రోజురోజుకీ పెరిగిపోతుంది దీనికి కారణం ఇటు విద్యార్థులు అటు గవర్నమెంట్. గవర్నమెంట్ ఏమో పాత సిలబస్ అలాగే ఉంచడం, కేవలం సిలబస్ మాత్రమే పూర్తి చేసి చేతులు దులుపుకుంటున్నారు. కానీ నేటి ప్రపంచానికి ఉపయోగపడే నైపుణ్యాలు ఏమి విద్యార్థులకు నేర్పించడం లేదు. నేటి సాంకేతిక రంగానికి తగ్గట్టుగా సిలబస్ పూర్తి చేసి విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచాలి. విద్యార్థులు కూడా ఏదో డిగ్రీ చదివామా అని కాకుండా నైపుణ్యం పెంచుకుని భవిష్యత్తులో ఉద్యోగం తెచ్చుకోవాలి. నైపుణ్యం ఉంటేనే ఏదైనా సాధించగలుగుతారు. నైపుణ్యం ఉంటేనే కొత్త ఉద్యోగాల్లో స్థిరపడతారు. లేకుంటే ఆరునెలలకు ఒకసారి ఉద్యోగం వెతుక్కునే పరిస్థితులు ఏర్పడతాయి.

- రాఘవేంద్ర బాబు, ఈస్ట్ గోదావరి జిల్లా

## నీటిని పొదుపుగా వాడుకుందాం

**వర్షాకాల** పరిస్థితుల దృష్ట్యా, ఎల్‌నినో ప్రభావం, దృష్ట్యా భవిష్యత్‌లో నీరు లభ్యత ఉండడం చాలా కష్టం. కావున అవసరమైన వరకు మాత్రమే నీటిని వాడుకుందాం. మనం ఏ పని చేయాలన్న నీరు లేనిది పని పూర్తి కావడం అసంభవం. కావున మనం నీటిని పొదుపుగా వాడుకుంటూ భవిష్యత్ తరాలకు నీటిని వనరులను అందించాలి.

-ఎం. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి


ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సకాలంలో ప్రచురితానికి ఆస్కారం -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఫీజుల నియంత్రణకు చర్యలేవి?

ఎం. సోమేశ్వరరావు

నేడు పలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల, కాలేజీలు ఫీజులు చూస్తే కళ్లు తిరగాల్సిందే. చదువుకునే రోజులు పోయి చదువుకొనే రోజులు వచ్చాయి. బడి తలుపులు తెరిచినా వేళ తల్లిదండ్రుల్లో ఫీజుల టెన్షన్ మొదలైంది. ప్రైవేటు స్కూళ్ళు, కార్పొరేట్ విద్యాసంస్థలలో పుస్తకాలు, ఫీజులు చూస్తుంటే తల్లిదండ్రుల గుండెల్లో రైళ్ల పరుగెడుతున్నాయి. పిల్లల భవిష్యత్తే తమ భవిష్యత్తుగా భావించి అప్పులు చేసి మరీ పిల్లలను చదివిస్తున్నారు. ఎల్. కె.జి నుంచే ఫీజుల బాదుడు భారీగా ఉంటుండడంతో తల్లిదండ్రులు ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు. జూన్ నెల వచ్చిందంటే చాలు తల్లిదండ్రుల గుండెల్లో రైళ్ల పరిగెడుతున్నాయి. బడి తలుపులు తెరిచే సమయానికి పిల్లలు చదువు కోసం వేలల్లో, లక్షల్లో సొమ్ములు చూసుకోవాల్సి పరిస్థితి వచ్చింది. విజయవాడలో ఓ కార్పొరేట్ స్కూల్లో పదో తరగతి విద్యార్థికి స్కూల్, హాస్టల్ కలిపి మొత్తం లక్ష రూపాయలు ,కొన్ని స్కూళ్లలో ఎల్.కె.జి, యుకెజి ఫీజులే సుమారు రూ.50 వేల నుంచి రూ.1 లక్ష మధ్యలో వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ముసుగులో ఫీజుల మోత మోగిస్తున్నాయి. కొన్ని స్కూళ్లలో అయితే అప్పుడే అడ్మిషన్లు పూర్తయిపోయినట్లు చెబుతున్నారు. తమ పిల్లలకు ఇంగ్లిష్ మీడియంలో చదువు చెప్పించాలనే ఉద్దేశ్యంతో అడ్మిషన్ల కోసం ప్రైవేట్ స్కూళ్లకు వెళుతున్న తల్లిదండ్రులు అక్కడి ఫీజులు చూసి, వాటిని కట్టడం తమ వల్ల కాదని నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఎన్ని జీవోలు, నిబంధనలు రూపొందించినా తమ రూల్ తమదే అనేలా కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలు ప్రవర్తిస్తున్నాయి. కొన్ని స్కూళ్లు అయితే ఒకేసారి మొత్తం అడ్మిషన్ ఫీజు, పాఠశాల ఫీజు కట్టాలనే నిబంధనలను అమలు చేస్తున్నాయి. విద్యాహక్కు చట్టం సెక్షన్ 6 ప్రకారం ప్రభుత్వ నిబంధనల ప్రకారం అడ్మిషన్లు జరగాలి. సెక్షన్ 11లో సూచించిన విధంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు గవర్నింగ్ బాడీ నిర్ణయించిన ఫీజులను మాత్రమే వసూలు చేయాలి. వసూలు చేసే ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలి. సెక్షన్ 12 ప్రకారం విద్యార్థుల, ఉపాధ్యాయుల నిష్పత్తి 1:20కి మించరాదు. ప్రతి పాఠశాలలో 25శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మైనార్టీలకు కేటాయించాలి. ఇందులో వికలాంగులు, అనాథలు, హెచ్ఐవి బాధితులు, వీధి బాలలు 5 శాతం, ఎస్సీ బాలలకు 10 శాతం, ఎస్టీబాలలకు 4శాతం, వెనుకబడిన బలహీన వర్గాలు 6శాతం, కేటాయింపు జరిగింది. మొత్తం 25శాతం వీటి ప్రకారం ఎక్కడ కూడా పూర్తి స్థాయిలో అమలు జరగడం లేదు. సెక్షన్ 18 ప్రకారం ప్రభుత్వ నిర్ణీత గడువు తర్వాత కూడా గుర్తింపులేని పాఠశాలను నడిపితే ఒక లక్ష జరిమానా విధిస్తారు. ఒకవేళ జరిమానా తర్వాత కూడా గుర్తింపు లేకుండా మళ్లీ పాఠశాలను నిర్వహిస్తే రోజుకు 10 వేలు జరిమానా విధిస్తారు.



సెక్షన్ 13 ప్రకారం ప్రాథమిక స్థాయిలో ఏ (ప్రవేశ పరీక్ష ) నిర్వహించకూడదు. ఒకవేళ అలా నిర్వహిస్తే తొలిసారి తప్పుకు రూ.25వేల, పునరావృతం అయితే రూ.50 వేల జరిమానా విధిస్తారు. ఏ పాఠశాలలోనూ బోధనా రుసుం కాకుండా ఇతర రూపాల్లో ఎలాంటి ఫీజు (క్యాపిటేషన్ ఫీజు) వసూలు చేయరాదు. అలా వసూలు చేస్తే దానికి 10 రెట్లు జరిమానా విధిస్తారు. ప్రైవేటు విద్యాసంస్థలు అక్రమంగా విద్యాసామగ్రి విక్రయిస్తున్నాయి. విద్యాహక్క చట్టం ప్రకారం ఏ విద్యాసంస్థలలో కూడా పుస్తకాలు, యూనిఫామ్ అమ్మరాదు. అలా చేస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సి ఉన్న వారిపై చర్యలు తీసుకోవడం లేదు. తమ వద్దే యూనిఫామ్, పుస్తకాలు కొనుగోలు చేయాలంటూ అధిక ధరలు విద్యాసంస్థల యాజమాన్యాలు వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ పెద్దలకు చెందినవి కావడంతో చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. విద్యార్థులు తమకు నచ్చినచోట విద్యాసామగ్రిని తెచ్చుకునే సౌలభ్యం కల్పించాల్సి ఉంది. విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు స్కూల్స్‌పై అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. విద్యకు అత్యంత ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పాఠశాలల్లో ఆటస్థలం ఉండడం లేదు. ఆటస్థలం ఉన్నప్పటికీ పలు పాఠశాలల్లో పీ.ఈ.టీలు ఉండడం లేదు. అనుమతుల సమయంలో బీఈడీ, పీజీ సర్టిఫికేట్లు ఉన్న వారిని చూపించి, అర్హత లేని వారితో పాఠాలు చెప్పిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాల వివరాలు, రికగ్నైజేషన్, రెన్యూవల్ సర్టిఫికేట్లు అందజేయకపోయినప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో ప్రభుత్వ నిబంధనలు అమలు చేయడానికి సరైన ప్రణాళికలు రూపొందంచాలి. ఈస్కూల్ మనోళ్లది ఆస్కూల్ వావోళ్లది అనే తేడాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు, స్కూళ్లలో ఫీజుల నియంత్రణ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోంది. నేడు రాష్ట్రాల్లో కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు మండల స్థాయి వరకు విస్తరించి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తుంటే ప్రభుత్వం, అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల కష్టార్జితాన్ని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు జలగల్లా పట్టి వారి రక్తాన్ని పీలు స్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఫీజు నియంత్రణ కమిటీ వేస్తామని చెప్పినా ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకో లేదు. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొ రేట్ స్కూళ్లు మొత్తం సీట్లలో 25 శాతం పేద పిల్లలకు కేటాయించాలి. కానీ రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్‌స్కూళ్లు విద్యాహక్కు చట్టాన్ని పట్టించుకుంటున్న దాఖలా లేదు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ కనిపించడంలేదు. ప్రైవేట్ పాఠశాలల యాజమా న్యాలు యథేచ్ఛగా ఫీజుల దందా కొనసాగిస్తున్నా అధికారు లు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుని ఈ విద్యా సంవత్సరం నుంచే ఫీజు

# పద్మశాలి వైద్యుల నూతన కార్యవర్గం ఎన్నిక

గుంటూరు విద్య జూలై 5 ప్రభాతవార్త: పద్మశాలి వైద్యుల నూతన కార్యవర్గం ఎన్నిక విజయవాడ లోని పద్మశాలి కళ్యాణమండపం లో ఆదివారం జరిగింది.ఆంధ్రప్రదేష్ పద్మశాలి వైద్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి.ఈ ఎన్నికల్లో గుంటూరు నగరానికి



చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ అందె వెంకటేశ్వరరావు రాష్ట్ర అధ్యక్షులు గా ఎన్నికైయ్యారు.గౌరవ అధ్యక్షులు గా విజయవాడ కు చెందిన డాక్టర్ సింగరి ప్రభాకర్,ప్రధాన కార్యదర్శి గా ప్రొద్దటూరుకు చెందిన డాక్టర్ టి.మునిరామ ప్రసాద్,కోశాధికారిగా నగరానికి చెందిన డాక్టర్ కొల్లి జయకిషన్ లు ఎన్నికైయ్యారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

## ఏఎన్‌యు అధ్యాపకుల సీనియారిటీలో తకరారు..!

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై5, ప్రభాతవార్త: ఏఎన్‌యులో అంతా నా ఇష్టం పాలన సాగుతుందని, సీనియారిటీలో అధ్యాపకులకు అన్యాయం జరుగుతుందని పలువురు అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 2006, 2009లలో అధ్యాపకులు ఉద్యోగాల్లో చేరారు. అప్పటి నుంచి యూజిసి నిబంధనల ప్రకారం 15ఏళ్ళ సర్వీస్ ఉంటే ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందుతారు. ఇదంతా ఒకెత్తయితే కొందరు మేము చెప్పిందే వేదం.. మా మాటే నెగ్గాలి అనే ఆలోచనతో కొద్ది నెలల క్రితం



**- విశ్రాంత రిజిస్ట్రార్‌లతో ప్రత్యేక కమిటీ నియామకం**
**- వర్సిటీకి ఎదురుతిరిగిన పలువురు అధ్యాపకులు..?**
**- నివేదికను హోల్డ్ చేసిన వర్సిటీ**

సీనియారిటీ జాబితాను తెరపైకి తెచ్చారు. గతంలో ఈ వినతి వచ్చినా ఉన్నతవిద్యా మండలి చూసుకుంటుందిలే అనుకుని ఆ దస్త్రాలన్నీ అటువైపు మళ్ళించారు. ఇప్పుడు పాలకుల్లో ఉన్న ఒక అధికారి సర్వీస్ ఆధారంగా సీనియారిటీ ఇవ్వాలనే డిమాండ్ తెరమీదికి తెచ్చినట్లు తెలిసింది. కొందరు అధ్యాపకుల డిమాండ్‌లు, మరికొందరి వినతి మేరకు వర్సిటీ అధికారులు పలువురు మాజీ రిజిస్ట్రార్‌లతో కమిటీని నియిమించారు. ఆ కమిటీ అధ్యాపకుల సర్వీస్ నిబంధనలు, వారికి ఉన్న అనుభవం, ప్రభుత్వ జీఓలు పరిశీలించిన ఒక నివేదికను సిద్ధం చేశారు. నివేదికపై వర్సిటీ నిర్ణయం తీసుకోకముందే అది లీకైంది. నివవేదికలో అంశాలు అధ్యాపకుల్లో కొత్త చర్చకు దారితీశాయి. దీంతో ప్రస్తుతం వర్సిటీలో పనిచేస్తున్న రెగ్యులర్ అధ్యాపకుల సర్వీస్‌లలో కొంత తేడా వచ్చే అవకాశాలు కనిపించడంతో అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. కొందరు ఉన్నతాధికారులను కలిసి తమకు ఇబ్బంది కలిగితే మేము న్యాయస్థానాన్ని ఆశ్రయిండంతో పాటు విద్యాశాఖ మంత్రి, ప్రభుత్వానికి పిర్యాదు చేస్తామనే హెచ్చరికలు చేసినట్లు సమాచారం. ఒక ఉన్నతాధికారి తాను చేస్తున్న పదవి కోల్పోవాల్సి వస్తుందనే సంకేతాలతో ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యేందుకు రంగం సిద్ధం చేసుకున్నారనే విషయం వర్సిటీలో కలకలం రేపింది. ప్రస్తుతం సైన్స్, ఆర్ట్స్ కళాశాలల వైస్ ప్రిన్సిపాల్స్‌గా ఉన్నవారి సర్వీస్ పరిగణలోకి తీసుకోరని వారు వైస్ ప్రిన్సిపాల్స్‌గానే విధుల నుంచి రిలీవ్ కావాల్సివస్తుందనే అంశం తీవ్ర దుమారాన్నే రేపింది. త్వరలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మార్పు ఉంటుంది. ఈ మార్పును ఆ అధికారి తనకు అనుకూలంగా మార్చుకుంటున్నట్లు తెలిసింది. అయితే సీనియారిటీ ప్రకారం ఒక మహిళా అధ్యాపకురాలు ప్రిన్సిపాల్‌గా నియమితులు కానున్నారని సమాచారం. వైస్ ప్రిన్సిపాల్స్‌గా ఉన్నవారు నిబంధనల ప్రకారం తాము సీనియారిటీ ప్రకారమే వైస్ ప్రిన్సిపాల్స్‌గా ఉన్నామని ఏదైనా తేడా వస్తే యూనియన్, అసోసియేషన్‌లు, కమీషన్‌లను కలిసి పిర్యాదు చేస్తామని హెచ్చరించిన సంఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఈక్రమంలో మాజీ రిజిస్ట్రార్‌లతో నియమించిన కమిటీ నివేదికను వర్సిటీ హోల్డ్ చేసినట్లు వేగుల సమాచారం. ఒకసారి సీనియారిటీ ప్రకారం పదవులు పొందిన అధ్యాపకులు మధ్యలో మీ సీనియారిటీ చెల్లదని చెప్పడం ఎంతవరకు సమంజసం అంటూ 'కన్నారా నాగార్జున యూనివర్సిటీ లీలలు' అంటూ అధ్యాపకులు, ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు.

## అసలు సిసలైన పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు


గుంటూరు కల్చరల్,జూలై 05,ప్రభాతవార్త : మాతృదేశ విముక్తికోసం పోరాడి ప్రాణాలర్పించిన విప్లవయోధుడు అల్లూరి సీతారామరాజు అసలు సిసలైన పోరాట యోధుడని ప్రజలకోసం,ప్రజా ఉద్యమాల్లో పనిచేసే కార్యకర్తలందరికీ అల్లూరి సీతారామరాజు వ్యక్తిత్వం,ఉద్యమం ఆదర్శం కావాలని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు.స్థానిక నాజ్‌సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద అల్లూరి జయంతి కార్యక్రమాన్ని అవగాహన సంస్థ నిర్వహించింది. ఎమ్మెల్సీ లక్ష్మణరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ 1922-24 సంవత్సరాల మధ్య అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో సాగిన పోరు ఒక కెరటమై ఉప్పొంగిందన్నారు. అల్లూరిలో నరనరాన సామ్రాజ్యవాద వ్యతిరేకత



ఉందని బ్రిటిష్ సామ్రాజ్యవాదం ఈదేశాన్ని వదిలివెళ్లా అంటూ గర్జిస్తూ ఉద్యమాన్ని నిర్వహించాడన్నారు.అమాయక సామాన్య ప్రజలను పోరాటానికి సమీకరించి అసమాన పోరాట యోధులుగా తీర్చిదిద్ది విప్లవ శంఖం పూరించాడన్నారు.జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ విప్లవోద్యమ సూర్యుడిగా పేరొందిన అల్లూరి అతి చిన్న వయస్సులోనే దేశం కోసం ప్రాణాలర్పించి అమరుడయ్యాడన్నారు.కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ ప్రెసిడెంట్ పి.రామచంద్రరాజు,యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్,విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య తదితరులు నివాళులర్పించారు.

## కనుల పండువగా శ్రీ శివపార్వతుల శాంతి కళ్యాణం

గుంటూరు కల్చరల్,జూలై 05,ప్రభాతవార్త : స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి మరియు శ్రీవిద్యా సరస్వతి,శ్రీపర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయం పాలకమండలి చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి మరియు సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ పదకొండవ వార్షిక బ్రహ్మోత్సవాలు శ్రీ శివపార్వతుల శాంతి కళ్యాణంతో ముగిసాయి.ఆలయ ప్రధాన పూజారి చంద్రశేఖరశర్మ బృందం ఆధ్వర్యంలో ఉదయం గోపూజ,మండపదేవ తారాధన, హోమాలు,విశేష పూజలు నిర్వహించి శ్రీ అయ్యప్పస్వామి కి విశేషాభిషేకాలు,18మెట్ల పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.మూలమంత్ర హోమాలు మహా పూర్ణాహుతి అనంతరం మహదాశీర్వాదం జరిగింది.అనంతరం కనుల పండువగా శ్రీ శివపార్వతుల కళ్యాణం వేదమంత్రాల నడుమ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.విశేషంగా పాల్గొన్న భక్తులకు



అన్న సమారాధన జరిగింది.ఈ సందర్భంగా పాలకమండలి చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి మాట్లాడుతూ కార్యక్రమాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి,దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

## ఫిట్నెస్ లేని పడవ.. లైసెన్స్ లేని డ్రైవర్లతో ప్రమాదకర ప్రయాణం

### కోనూరు ప్రమాదం మరువకముందే కేవీ పాలెం-పొక్కునూరు పడవ సేవపై ప్రయాణికుల ఆందోళన

అచ్చంపేట, జులై 5 (ప్రభాత వార్త ): కృష్ణా నదిపై కేవీ పాలెం-పొక్కునూరు మధ్య నడుస్తున్న పడవ సేవ భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అచ్చంపేట మండలం కోనూరు వద్ద జరిగిన పడవ ప్రమాదంలో నలుగురు మృతి చెందిన ఘటన మరువకముందే, అదే తరహాలో ఓవర్‌లోడ్‌తో పడవ నడుస్తోందని వారు ఆరోపిస్తున్నారు.స్థానికుల కథనం ప్రకారం, పొక్కునూరు నుంచి కేవీ పాలెంకు ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే సామర్థ్యానికి మించి ప్రయాణికులు, ద్విచక్ర వాహనాలను ఎక్కించి పడవను నడుపుతున్నారని, పడవకు ఫిట్నెస్ సర్టిఫికేట్, భద్రతా ప్రమాణాలు



ఉన్నాయా అనే అంశంపై అధికారులు తనిఖీలు నిర్వహించాలని వారు కోరుతున్నారు.ప్రయాణికులకు తగినంత లైఫ్ జాకెట్లు, ఇతర భద్రతా పరికరాలు అందుబాటులో లేవని, దీంతో ప్రతి ప్రయాణం భయాందోళనల మధ్య సాగుతోందని స్థానికులు తెలిపారు. లోతైన నదీ ప్రాంతంలో ఓవర్‌లోడ్‌తో పడవ నడపడం ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు.స్థానికుల ఆరోపణల ప్రకారం, సంబంధిత శాఖల అధికారులు, పోలీసులు తరచూ తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే ఇటువంటి పరిస్థితులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. టెండర్ పొందినంత మాత్రాన భద్రతా నిబంధనలను విస్మరించరాదని, పడవ ఫిట్నెస్, డ్రైవర్ అర్హతలు, ప్రయాణికుల పరిమితి వంటి అంశాలను కచ్చితంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారుఈ విషయంపై స్పందించిన సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ, పడవ రేవుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి భద్రతా నిబంధనల అమలును పరిశీలిస్తామని తెలిపారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఫిట్నెస్ లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా పడవ నడిపితే సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు

గుంటూరు వార్త

## ది పింక్ స్టేట్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులకు ఘన సన్మానం

గుంటూరు మెడికల్ , జూలై 5:(ప్రభాత వార్త): వైద్య వృత్తి సమాజానికి చేస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ, ఖిది పింక్ స్టేట్ఖి ఆధ్వర్యంలో హోప్ విన్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ షమా సుల్తానా నిర్వహించిన డాక్టర్స్ డే సెలబ్రేషన్స్ ఆదివారం గుంటూరులోని బీహెచ్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సురేఖ జ్యువెలరీ (తిరుపతి) అధినేత మధుసూదన్, సత్య డిజైనర్స్ స్టూడియో (హైదరాబాద్) అధినేత సంయుక్త సహకారం అందించారు. కార్యక్రమానికి నగరానికి చెందిన పలువురు ప్రముఖ వైద్యులు, వైద్య సిబ్బంది, సామాజికవేత్తలు, ఆహ్వానితులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న డా. శ్రావని, డా. శిరీష, డా. ఆనందిని, డా. అనిత, డా. స్వప్న, డా. సింధు తదితర వైద్యులను ఘనంగా శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. వైద్యుల సేవలను కొనియాడుతూ పలువురు వక్తలు అభినందనలు తెలిపారు.



# వికసిత్ భారత్-2047 నిర్మాణంలో యువ ఇంజనీర్లు భాగస్వాములు కావాలి

### ఒడిశా గవర్నర్ డా.కంభంపాటి హరిబాబు

గుంటూరు విద్య జూలై 5 ప్రభాతవార్త : స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచ వేదికపై భారతదేశాన్ని అగ్రగామిగా నిలబెట్టే బాధ్యత యువ ఇంజనీర్లపై ఉందని, ఆ లక్ష్యయ సాధనలో యువత కీలక భాగస్వాములు కావాలని ఒడిశా రాష్ట్ర గవర్నర్ డా. కంభంపాటి హరిబాబు పిలుపునిచ్చారు. అకాడమిక్ ప్రతిభ, పరిశోధనలు, ఆవిష్కరణలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన విద్యాబోధనలో ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల దేశంలోని అత్యుత్తమ సాంకేతిక విద్యాసంస్థల్లో ఒకటిగా నిలవడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించిన కళాశాల 38వ అవుట్ గోయింగ్ బ్యాచ్ మరియు 11వ అటానమస్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు, ముఖ్య అతిధిగా ఒడిశా రాష్ట్ర గవర్నర్ డా.కంభంపాటి హరిబాబు, గౌరవ అతిధిగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధర రావు, మరియు విశిష్ట అతిధిగా కళాశాల పూర్వ విద్యార్థి సర్దార్ గౌతు లచ్చన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యార్లగడ్డ వెంకన్న చౌదరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అతిధులను కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్ మరియు కళాశాల సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కళాశాల యెన్.సి.సి.విభాగ విద్యార్థులు గౌరవ వందనం, కవాతుతో అథిధులు సభా స్థలికి చేరుకున్నారు.అతిధులు, కళాశాల పాలకమండలి సభ్యులు జ్యోతీ ప్రజ్వలన చేసి గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ డా. కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు , క్వాంటం కంప్యూటింగ్, మెషిన్ లెర్నింగ్, సెమీకండక్టర్ టెక్నాలజీ, ఇండస్ట్రీ 5.0 వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలే భవిష్యత్తును నిర్దేశిస్తున్నాయని, యువత ఈ రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. యువతలో ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ క్వాంటం మిషన్, ఇండియా సెమీకండక్టర్ మిషన్ వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. సెమీకండక్టర్ తయారీ రంగానికి కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వాలు 20 నుంచి 30 శాతం వరకు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని వివరించారు.విద్యార్థులు ఉద్యోగాలు కోరుకునే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, శాస్త్రసాంకేతిక రంగంలో జరుగుతున్న విప్లవాత్మక మార్పులతో ప్రపంచ రూపురేఖలు మారుతున్నాయని పేర్కొన్నారు. ఏఐ సాంకేతికత నూతన శకానికి నాంది పలికిందని, పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గిస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. తాను కూడా ఇంజనీరింగ్ విద్యార్థినే కావడం గర్వంగా ఉందని, నాణ్యమైన సాంకేతిక విద్యకు ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ, విద్యార్థులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఆధునిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పరిశోధనలు, ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలని సూచించారు.



## జైపూర్ లో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ కు ఘన సత్కారం

గుంటూరు విద్య జులై 5 ప్రభాతవార్త: జూలై 5 వ తారీఖున జరిగిన రెండవ రోజు ప్రోగ్రాము లో ఆంధ్రప్రదేశ్ సభ్యులను ఆల్ ఇండియా బ్రాహ్మణ్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్. డి శర్మ,సెక్రటరీ జనరల్ ద్రోణంరాజు రవి కుమార్,జాతీయ కోశాధికారి తిప్పావజ్జుల నారాయణ శర్మ లు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ ను ఘనంగా సన్మానించారు. ఈ



సందర్భంగా బ్రాహ్మణ ఐక్యతకు కోనూరు సతీష్ శర్మ చేస్తున్న సేవలను కొనియాడారు. సమావేశంలో 14 తీర్మానాలను ప్రతిపాదించి ఆమోదించారు.25 వేల కోట్ల రూపాయల మూల నిధితో జాతీయ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు.తీర్మానాలను రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ నేతృత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ కి అందచేయాలని నిర్ణయించారు.కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి వెలవర్తిపాటి పాండురంగ విఠల్,జాతీయ మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ సుహాసిని ఆనంద్,కరి నాగలక్ష్మి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ కె మనోహర రావు, హెచ్ కె రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు రూరల్, జూలై 5, ప్రభాతవార్త : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 16 వ డివిజన్ ఏటుకూరు గ్రామంలో గత కొన్నేళ్లుగా స్థానిక ప్రజలు తమ ఇంటి నివాస స్థలాలు రిజిస్ట్రేషన్ జరగక అనేక ఇబ్బందులు పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. ఏటుకూరు గ్రామంలో సర్వేనెంబర్ 74 లో య.5.93 సెంట్ల స్థలంలో 100 కుటుంబాలు నివాస గృహాలు ఏర్పరచుకొని గత కొన్నేళ్లుగా కుటుంబ సమేతంగా నివసిస్తున్నారు. గృహాలు ఏర్పరచుకున్నప్పటినుండి ఆ ప్రాంత ప్రజలు తమ గృహాలకు సంబంధించిన ఇంటి , నీటి పన్నులు, విద్యుత్ బిల్లులు, ఇతర



పన్నులన్ని సక్రమంగా ప్రతి ఏటా ప్రభుత్వానికి చెల్లిస్తున్నట్లు తెలిపారు. అయితే ఈ భూమి నిషేధిత భూమి 22, ఏ లో ఉన్నట్లు ప్రభుత్వ దస్త్రాల్లో చూపిస్తుందని చెప్పారు. అప్పటినుండి ఈ స్థలాలు రిజిస్ట్రేషన్ కాక అనేక ఇబ్బందులు పడినట్లు వివరిస్తున్నారు. ఈ విషయమై ఆ ప్రాంత ప్రజలు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ఎన్నో మారులు తీసుకొచ్చినా ఫలితం లేదని వాపోయారు. ఇదే సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అధికారులు తప్పిదాలతో గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని మా గృహాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే నానా ఇబ్బందులు పడుతున్నామని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత ఉగ్గిరాల సీతారామయ్య ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు, కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. త్వరలో మీ సమస్యను పరిష్కరించి న్యాయం చేస్తామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రెడ్ మార్క్ లో ఉన్న సర్వే నెంబర్ 74 పై ఉన్న ఆంక్షలను తొలగించి, ఆ స్థలాలపై పూర్తి హక్కులు అనుభవించే విధంగా చర్యలు తీసుకుని చిరకాల సమస్యలను పరిష్కరించినందుకు ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని, స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

## సెమిస్టర్ ఫలితాలలో జీసికేవిఎన్ డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు విద్య జూలై 4 ప్రభాతవార్త: గుంటూరు స్థానిక సంగడిగుంట లోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విడుదల చేసిన నాలుగవ సెమిస్టర్ ఫలితాలలో అత్యధిక మార్కులతో ప్రథమ శ్రేణిలో ఉన్నత ఫలితాలను కైవసం చేసుకున్న సందర్భముగా కళాశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమము జరిగినది. ఈ కార్యక్రమానికి కళాశాల జాయింట్ సెక్రటరీ మాజేటి ప్రసాద్ అధ్యక్షత వహించగా, బాపూజీ కమిటీ కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు



ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథి, బాపూజీ కమిటీ కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు నైతిక విలువలు కలిగి ఉండాలని, అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. నేడైతే అది ప్రపంచ స్థాయిలో కొరవడుతున్నదని, అధ్యాపకులు విలువలు పెంపొందించే దిశగా కృషి చేయాలని అన్నారు. ఇంత గొప్ప ఫలితాలను సాధించడంలో కృషిచేసిన అధ్యాపకులను రామకృష్ణ ప్రభు అభినందించారు. కళాశాల జాయింట్ సెక్రటరీ మాజేటి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు జీవితంలో స్థిరపడడానికై వివిధ రకాల కంప్యూటర్ కోర్సులను ఉచితంగా నేర్పిస్తున్నట్లు, విద్యార్థులు చక్కగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తద్వారా కళాశాలకు మంచిపేరు తేవాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాశాలలో ర్యాగింగ్ కు చోటులేకుండా విద్యార్థినీ విద్యార్థుల మధ్య స్నేహపూర్వకముగా ఉండేట్లుగాను, క్రమశిక్షణకు పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమ చివరలో అత్యున్నత మార్కులను సాధించిన విద్యార్థులకు విచ్చేసిన అతిధుల చేత శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. I II అధికారులు ఏ. శ్రీధర్ మరియు వై. చంద్రశేఖర్, అధ్యాపకులు రాజరాజేశ్వరి, ఇందిర, హరిలాల్, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించేలా విద్యాహక్కు చట్టాన్ని సవరించాలి - గుంటూరు జిల్లా ఫ్యాప్టో విజ్ఞప్తి..

గుంటూరు విద్య జూలై 5 ప్రభాతవార్త: ఫ్యాప్టో జిల్లా చైర్మన్ కె. నరసింహారావు ఆధ్వర్యంలో, ఫ్యాప్టో నాయకులు గుంటూరు నుండి రాజ్యసభకు ఎన్నికైన శ్రీ భాష్యం రామకృష్ణ ని కలిసి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ కె. నరసింహారావు మాట్లాడుతూ, విద్యాహక్కు చట్టం-2009 మరియు ఎన్‌సీటీఈ నోటిఫికేషన్



ప్రకారం ఉపాధ్యాయ నియామకాలకు టెట్‌ను తప్పనిసరి అర్హతగా నిర్ణయించారని తెలిపారు. అయితే, గౌరవ సుప్రీంకోర్టు 01092025 మరియు 29052026 తేదీల్లో వెలువరించిన తీర్పుల ప్రకారం, ఐదు సంవత్సరాలకు పైగా సేవలో ఉన్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు కూడా టెట్ ఉత్తీర్ణత సాధించాలని, అలాగే పదోన్నతులకు కూడా టెట్ అర్హత తప్పనిసరి అని, దీనికి 31 ఆగస్టు 2028 వరకు గడువు నిర్దేశించబడిందని పేర్కొన్నారు. సేవలో ఉన్న ఉపాధ్యాయులు విధి నిర్వహణతో పాటు టెట్ పరీక్షకు సిద్ధమయ్యేందుకు తగిన సమయం కేటాయించడం ఆచరణలో ఎంతో క్లిష్టమని, టెట్‌ను తప్పనిసరి చేయడం వల్ల ఉపాధ్యాయులు సెలవులు తీసుకుని పరీక్షలకు సిద్ధమయ్యే పరిస్థితి ఏర్పడి, పాఠశాలల విద్యా కార్యకలాపాలు మరియు విద్యార్థుల అభ్యాసంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన వివరించారు. కావున, విద్యాహక్కు చట్టం-2009లోని ....సెక్షన్ 23(1)....కు తగిన సవరణలు చేసి, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించేలా కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సిఫార్సు చేయాలని ఫ్యాప్టో తరఫున ఎంపీ ని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ యు. రాజశేఖర్, దాసు, ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ బాజీ,ఖలీద్, మేకల సుబ్బారావు తదితర ఫ్యాప్టో నాయకులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## కళా క్షేత్రంలో ప్రజా చైతన్య నాదం

-కళల పండుగలా ప్రజా నాట్యమండలి ద్వితీయ మహాసభ
-కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన ఆహ్వాన కమిటీ అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు
-చిలకలూరిపేటలో అంబరాన్నంటిన కళల సంబరం

చిలకలూరిపేట, జులై 5, ప్రభాతవార్త: కళ సమాజ శ్రేయస్సు కోసమేనని, ప్రజా సమస్యలపై గళమెత్తి జనజాగృతి చేయడమే కళాకారుల అంతిమ లక్ష్యమని ప్రజానాట్య మండలి మహాసభలు స్పష్టం చేశాయి. పల్నాడు జిల్లా ప్రజానాట్య మండలి ద్వితీయ మహాసభలు ఆదివారం చిలకలూరిపేట ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లోని చౌదర్యు కళ్యాణ మండపంలో అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి పల్నాడు విభజన జరిగిన తర్వాత నిర్వహిస్తున్న ఈ రెండో మహాసభలు కళాకారుల ఉత్సాహం, ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణాన్ని తలపించాయి.అమరులకు నివాళి.. పతాకావిష్కరణతో అంకురార్పణ ఉదయం ప్రజానాట్య మండలి అధికారిక పతాకాన్ని



ప్రజానాట్యమండలి భాధ్యులు సూరి ఆవిష్కరించడంతో మహాసభల కార్యక్రమాలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ప్రజాక్షేత్రంలో తమ కళల ద్వారా ప్రజలను చైతన్యపరచి అమరులైన నాటక, రంగస్థల కళాకారులకు ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రారంభమైన తొలిరోజు సభలో.. ప్రజానాట్య మండలి ఆవిర్భావం, నాటి నుండి నేటి వరకు ప్రజా సమస్యలను గీత, నృత్య రూపాల్లో మలిచి కళాకారులు చేసిన అలుపెరుగని అందించిన సేవలను వక్తలు కొనియాడారు. ఇదే వేదికపై సంస్థ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను ప్రతినిధులు వెల్లడించారు.ఏకగ్రీవంగా నూతన




కమిటీ ఎన్నిక మహాసభల ప్రధాన అజెండాలో భాగంగా ప్రజానాట్యమండలి నూతన జిల్లా కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారిలో పల్నాడు జిల్లా అ ధ్యక్షులు కొండా నాయక్, ప్రధాన కార్యదర్శిగా పి పెద్దిరాజు, కమిటీ సభ్యులు పొట్టి సూర్య ప్రకాశరావు, బి పీటర్, బి నాగమ్మబాయి, ముత్తవరపు పద్మారావు, షేక్ బాషా, కొమ్ముల సాంబశివరావు, చంద్రిక ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సభావేదికపైకి ఆహ్వానించి, ప్రతినిధులకు పరిచయం చేశారు. అనంతరం వారందరితో సంఘం ఆశయాలకు కట్టుబడి పనిచేస్తామని ప్రమాణ స్వీకారం




చేయించారు.సంస్క ృతి, సంప్రదాయాల కళా విన్యాసం.. అబ్బురపరిచిన స్కిట్లు మహాసభల వేదిక అభ్యుదయ గీతాల ఆలపనతో, విద్యార్థుల నృత్యాలతో సందడిగా మారింది. కనువిప్పు కలిగించే సామాజిక స్కిట్లు, సం స్క ృతిని ప్రతిబింబించే నృత్యాలు, సంప్రదాయ కోలాటాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. డప్పు కళాకారులు తమ వాయిద్యాలతో చేసిన విన్యాసాలు సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యడ్లపాడు నారాయణ స్కూల్, చిలకలూరిపేట చైతన్య ఎలైట్ స్కూల్, నరసరావుపేట ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల, ఒంగోలు చందు డాన్స్ అకాడమీలకు చెందిన విద్యార్థులు, కళాకారులు ప్రదర్శించిన సాంస్క ృతిక ప్రదర్శనలు సభికులను అబ్బురపరిచి, ఆలోచింపజేశాయి.కళా మతల్లి సేవకులకు ఘన సత్కారం కళారంగానికి అమూల్యమైన సేవలు అందించిన పలువురు ప్రముఖులను మహాసభల తొలిరోజున ఘనంగా సత్కరించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ కళారత్న గుమ్మడి గోపాలకష్ణ, ప్రముఖ చలనచిత్ర దర్శకులు వి. సముద్ర - విజయలక్ష్మి దంపతులు, ప్రముఖ నాటక విశ్లేషకులు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావులను నిర్వాహకులు శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.కళలతోనే సమాజ చైతన్యం సాధ్యం: గుమ్మడి గోపాలకృ ష్ణసత్కారానంతరం ముఖ్యఅతిథి గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. ప్రజానాట్యమండలి,'వేదిక్ష (తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన సంఘం) కలయికను గానం-సంగీతం వంటి అద్భుత కలయికగా అభివర్ణించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కళలను సరికొత్త పంథాలో నడిపేందుకు ఈ రెండు సంస్థలు చేతులు కలపడం శుభపరిణామన్నారు. ప్రజా సమస్యలను ఇతివృత్తంగా తీసుకుని చైతన్యపరిచేది'వేదిక్ష అయితే, ప్రజా గొంతుకను అభ్యుదయ గీతంగా మార్చేది'ప్రజానాట్యమండల్ని అని, ఇవి రెండు కళామతల్లికి రెండు కళ్లు లాంటివని అన్నారు. గతంలో గుంటూరులో అంతర్జాతీయ నాటకోత్స వాలు ఎంతో వైభవంగా నిర్వహించి తెలుగు నాటకరంగానికి ఎనలేని ఖ్యాతి తెచ్చిన ఘనత 'వేదిక్ష అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు దక్కుతుందన్నారు. అలాగే తెలుగు డ్రామాను రాష్ట్రానికి తీసుకువచ్చిన సురేష్‌బాబు కృషిని ఆయన అభినందించారు. అనంతరం సదస్యుల కోరిక మేరకు ఆయన పద్యగానం చేసి అలరించారు. నా ప్రతి సినిమా సమాజానికి సందేశమే: దర్శకుడు వి. సము ద్రమరో సన్మాన గ్రహీత, సినీ దర్శకుడు వి. సముద్ర మాట్లాడుతూ.. కళలంటే తనకు ప్రాణమని, ఎన్నో కష్టనష్టాలకోర్చి చిత్ర పరిశ్రమలో ఈ స్థాయికి చేరడానికి కళామతల్లి ఆశీస్సులే కారణమన్నారు. జన్మభూమిపై మమకారంతోనే ఈ ప్రాంత వాసిగా'టైగర్ హరిశ్చంద్రప్రసాద్ సినిమా తీశానని, అలాగే'సింహరాశి చిత్రం మనిషి సమాజంలో ఎలా జీవించాలో చెప్పే అద్భుత సందేశాత్మక కథనమని గుర్తుచేశారు. తన ప్రతి సినిమాలో సామాజిక స్పృహ ఉండేలా చూసుకుంటానని చెప్తూ.. చిలకలూరిపేటలో జరిగిన ఈ సత్కారం తన జీవితంలో ఒక తీపి జ్ఞాపకంగా నిలిచిపోతుందన్నారు.వర్ధమాన కళాకారుల కార్ఖానాగా ప్రజానాట్యమండలి: డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన 'వేదిక్ష అధినేత డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు మాట్లాడుతూ.. సంస్క ృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ, సమకాలీన సామాజిక అంశాలపై చైతన్య గీతాలతో జనజాగృతి చేస్తామన్నారు. రాష్ట్రానికి 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామ్షాను తీసుకురావడంలో తమ వంతు పాత్ర పోషించామని చెప్తూ.. భవిష్యత్తులో ప్రజానాట్యమండలిని ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో జోడించి వర్ధమాన కళాకారులను తీర్చిదిద్దే ఒక 'కార్ఖాన్హాగా మారుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్. అనిల్‌కుమార్, కౌలురైతు సంఘం రాష్ట్ర నాయకులు వై. రాధాకృష్ణ, ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు గుదె పాండురంగారావు, రోటరీ స్వీకారం కళాపరిషత్ అధ్యక్షులు జాస్తి మోహన్‌రావు, రంగస్థల నటులు, దర్శకులు నాయుడు గోపీ, ఆంధ్ర నాటక కళాపరిషత్ కార్యదర్శి అన్నమనేని ప్రసాద్, రిటైర్డ్ జేటీవో ఏ.వి. శివయ్య, టీడీపీ నాయకులు కంచర్ల శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు.ముగింపు వేడుకల్లో కళాకారులకు ప్రోత్సాహకాలు సభ అనంతరం ముఖ్య అతిథులు గుమ్మడి గోపాలకృష్ణ, సినీ దర్శకుడు వి. సముద్రల చేతుల మీదుగా.. కార్యక్రమానికి విచ్చేసిన ప్రజానాట్యమండలి ప్రతినిధులను, వివిధ పాఠశాలలు, కళాశాలల నుండి వచ్చి అద్భుత ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను, నాట్య అకాడమీ కళాకారులను సత్కరించారు. వారికి ప్రత్యేక జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు (సర్టిఫికెట్లు) అందించి ప్రోత్స హించారు. ప్రభుత్వం, ప్రజలకు వారధులుగా ఉంటూ సమాజసేవలో భాగస్వాములైన జర్నలిస్టులను కూడా ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించారు.

## ఘనంగా ప్రతిభాపురస్కారాల ప్రదానం



చిలకలూరిపేట, జూలై 5, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ రోడ్‌లో ఉన్న పెన్షనర్స్ హోమ్‌లో శ్రీ విద్యామిత్ర మండలి ఆధ్వర్యంలో గత 15 సంవత్స రాలుగా కొనసాగుతున్న ప్రతిభా పురస్కారాల కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.చిలకలూరిపేట నియోజకవర్గంలోని 35 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున మొత్తం రూ.1,75,000 నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. విద్యార్థులను ప్రోత్స హిస్తూ విద్యాభివృద్ధికి శ్రీ విద్యామిత్ర మండలి నిరంతరం కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ విద్యామిత్ర మండలి అధ్యక్షురాలు మర్రి లలిత , నాగలక్ష్మి , పూర్ణ కుమారి ,పెంటెల లక్ష్మీ తులసి ,పుష్ప , విజయ కుమారి ,నాగ కుమారి, తులసి , లక్ష్మీప్రసన్న, సుజాత తదితరులు పాల్గొన్నారు.ముఖ్య అతిథులుగా ప్రిన్సిపాల్ తోటకూర వెంకటనారాయణ గారు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు బూదాటి రామకోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు కృష్ణా నాయక్ , కె.వి. రామిరెడ్డి , ఏ.వి. రామిరెడ్డి ,ఏ. వెంకటాద్రి నాయుడు విద్యార్థులకు అభినందనలు తెలియజేసి భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు.

## సత్తెనపల్లిలో ఆర్టీసీ బస్సుబైక్ ఢీకొని రోడ్డు ప్రమాదం



సత్తెనపల్లి, జూలై 5, ప్రభాతవార్త: సత్తెనపల్లిలోని పెద్ద కాలువ సమీపంలో ఆదివారం ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడు అమరావతి మండలానికి చెందినవాడిగా, సత్తెనపల్లిలోని మెడికేర్ ఆస్పత్రి ఉద్యోగిగా స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యే డా. చదలవాడ

నరసరావుపేట, జులై 5 ప్రభాతవార్త : రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదివారం ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. మంత్రి వెంట నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, టిడిపి సీనియర్ నాయకులు కపలవాయి విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఆలయ



సూపరింటెండెంట్ చల్లా శ్రీను, ప్రధాన అర్చకులు మంత్రికి ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు మంత్రికి ఆశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ కోటప్పకొండ పుణ్యక్షేత్రంలో శ్రీ మేధా దక్షిణామూర్తి స్వరూపుడైన త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇక్కడి ప్రశాంతమైన వాతావరణంలో స్వామివారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను అని తెలిపారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ఆధ్వర్యంలో దేవాలయ అభివృద్ధి, సౌకర్యాలు అద్భుతంగా జరుగుతున్నాయన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా ఆలయ పరిసరాల్లో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.

## ఆలవాలలో తండ్రి, కుమార్తె ఆత్మహత్య

రొంపిచర్ల, జూలై 5 ప్రభాతవార్త : మనస్థాపంతో తండ్రి కుమార్తెల ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలో అలవాల గ్రామంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ప్రకారం ఆ గ్రామానికి చెందిన గోనుగుంట్ల పోతులూరయ్య (75) భార్య, కొడుకు కొన్ని ఏళ్ల క్రితం మృతి చెందారు. దీంతో ఆయన తన కుమార్తె రామాంజమ్మ (50)తో కలిసి జీవిస్తున్నారు. పోతులూరయ్య భార్య, కుమారుడు మృతి అనంతరం ఆయన తీవ్ర మనోవేదనకు గురై



మానసికంగా కుంగి పోయారు. దీనికి తోడు కుటుంబ కలహాల వల్ల ఆయనకు జీవితంపై విరక్తి కలిగింది. అదే విధంగా వయో భారంతో ఏమి చేయలేని స్థితిలో తనను ఎవరూ చూడరని నిర్ణయించుకుని ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తండ్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో తట్టుకోలేక కుమార్తె కూడా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాధ ఛాయలు నెలకొన్నాయి.

## బీసీల డిమాండ్ల సాధనే లక్ష్యం: కేసన శంకరరావు

నరసరావుపేట టౌన్, జూలై 5 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘాన్ని జిల్లాలో అన్ని నియోజకవర్గాలుమండలాలలో కమిటీలను వేసి,సంఘ పటిష్టతబీసీల హక్కుల సాధనా లక్ష్యంతో ఉద్యమించాలని, రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బిళ్ళ కంటి శ్రీనివాసరావు ని నూతనంగా పల్నాడు జిల్లా అధ్యక్షునిగా నియమించారు.అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



అన్నవరపునాగమల్లేశ్వరరావు హాజరైనారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో అన్ని బీసీ కులాలను ఐక్యం చేసి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, చట్టసభలలో,స్థానిక సంస్థల లో బీసీల రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో సమగ్ర కుల గణన జరిపి తరువాతే చట్టబద్ధంగా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని శంకరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు బిళ్ళ కంటిశ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బీసీ కులాల ప్రజలలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆదుకునేందుకు సంఘ నాయకులందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కేసన్న శంకర్ రావు, నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, యమ మురళి, కదం జ్యోతి, పోతర్లంక రవికుమార్, ఇంయం స్వామి మాస్టర్, కొల్లిపర బాలాజీ, గురు ఆంజనేయులు, సుతారాం విశ్వేశ్వరరావు, తిమ్మరాజు , సాంబశివరావు, దమ్మాటి మల్లికార్జున రావు, ప్రసన్నకుమార్, తన్నీరు వెంకట్, మడకా ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## జిల్లాలో జనసేన బలోపేతమే లక్ష్యం: బాలినేని శ్రీనివాస్ రెడ్డి

నరసరావుపేట టౌన్,జూలై 5 ప్రభాతవార్త : పల్నాడు జిల్లాలో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా నిర్మాణ జరుగుతున్నట్లు పార్లమెంటరీ పరిశీలకులు బాలినేని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వారం రోజులుగా జరుగుతున్న జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విలేకరులతో బాలినేని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. వారం రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు కమిటీ సభ్యులకు వారు అభినందనలు తెలిపారు. జిల్లావ్యాప్తంగా పార్లమెంట్, అసెంబ్లీ, మండలాలు, పట్టణ, పంచాయతీలకు సంబంధించి ఇంచార్జి పదవులకు మొత్తం 1500 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దేశంలో ఏ పార్టీ నిర్వహించిన విధంగా గ్రామస్థాయి నుండి కమిటీ నిర్మాణం వినూత్నంగా జరుగుతుందన్నారు. మెంబర్షిప్ టు లీడర్షిప్ అనే నినాదంతో పార్టీ అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్




రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు ఆదేశాలు ఇచ్చారని తెలియజేశారు. పదవులు రాని వారు ఎటువంటి నిరాశకు లోను కావాల్సిన అవసరం లేదన్నారు. పార్టీకి కష్టపడి సేవలు అందించే వారిని గుర్తుపెట్టుకుని వారికి నామినేటెడ్ పదవులను కేటాయించడం జరుగుతుందన్నారు. జిల్లాలో తమకు అందిన దరఖాస్తులను అధిష్టానం కు పంపించడం జరుగుతుందని, పార్టీ అధినేత ఆదేశాల మేరకు నియామక నిర్ణయం ఉంటుందని తెలియజేశారు. పార్టీ నిర్మాణ క్రమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి అభినందనలను పార్లమెంటరీ పరిశీలకులు బాలినేని శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో 7రోజులపాటు నిర్మాణ సారదులుగా, సమాచార సేకరణ కమిటీ సభ్యులుగా సేవలందించిన నాయకులకు మెమొంటో,శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు వీరవల్లి వంశీ, అద్దేపల్లి ఆనందు బెల్లంకొండ అనిల్,గుప్తా శ్రీకాంత్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, వీర మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

## ముగిసిన జిల్లా స్థాయి యోగాసన పోటీలు

నరసరావుపేట టౌన్, జూలై 5 ప్రభాతవార్త : స్థానిక సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఆధ్వర్యంలో పలనాడు జిల్లా స్థాయి యోగాసన పోటీలు ఆదివారం నిర్వహించారు.ఈ పోటీలకు



అబ్జర్వర్‌లు రమణా తో పాటు అసోసియేషన్ అధ్యక్ష,,కార్యదర్శులు కొల్లి బ్రహ్మయ్య, ఆనంద రాముడు, అడ్డగిరి సురేష్ హాజరై పోటీల నిర్వహణను పరిశీలించి అభినందనలు తెలిపారు.రాష్ట్ర స్థాయి అర్హత కలిగిన యోగాసన న్యాయనిర్ణేతలు పోటీలకు హాజరై పారదర్శకంగా విజేతలను ప్రకటించారు.జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ, పోటీల విజయవంతానికి సహకరించిన ముఖ్య అతిథులు, న్యాయనిర్ణేతలు, పాఠశాల యాజమాన్యం, కోచ్‌లు,విద్యార్థులు,తల్లిదండ్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా స్థాయిలో యోగాసన క్రీడలను మరింత విస్తృతంగా ప్రోత్స హిస్తూ, విద్యార్థుల్లో ఆరోగ్యం, క్రమశిక్షణ మరియు క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి పోటీలను నిరంతరం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## 79వ నేషనల్ వాటర్ పోలో ఛాంపియన్‌షిప్‌కు పల్నాడు స్విమ్మర్స్ ఎంపిక

నరసరావుపేట టౌన్,జూన్ 5 ప్రభాతవార్త : ప్రతిష్టాత్మక 79వ సీనియర్ నేషనల్ వాటర్ పోలో ఛాంపియన్‌షిప్‌కు పల్నాడు జిల్లా నుండి నలుగురు సిమ్మర్స్ ఎంపికయ్యారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించడానికి మన జిల్లా నుండి నలుగురు అత్యుత్తమ ఈతగాళ్ల (స్విమ్మర్స్) ఎంపిక కావటం విశేషం. జాతీయ స్థాయి టోర్నమెంట్ చెన్నైలోని ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సి టీలో 2026 జూలై 7 నుండి జూలై 12 వరకు జరగనుంది.కఠినమైన ఎంపిక పోటీల (సెలక్షన్ ట్రయల్స్) అనంతరం, పల్నాడు జిల్లాకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర జట్టులో తమ స్థానాలను ఖాయం



చేసుకున్నారు.పురుషుల విభాగంలో ఎస్. జగదీష్, ఆర్. హర్షవర్ధన్ రాజు, మహిళల విభాగంలో జి.ఎస్.ఎస్. నిత్య, ఎ. సిరి నందన లు ఉన్నారు.ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎస్ ఎస్ అండ్ ఎన్ కాలేజీ ప్రెసిడెంట్ కపలవాయి విజయ్ కుమార్ , సెక్రటరీ సుబ్బరాయ గుప్తా , పిడిఎస్ఎ ప్రెసిడెంట్ ఎ.ఎ.వి. రామలింగారెడ్డి , సెక్రటరీ వై.వి. సుబ్బారెడ్డి , ట్రెజరర్ వై.వి. శ్రీనివాస రెడ్డి, కోచ్ జి సురేష్ అభినందించారు.

## దేవాలయ నిర్మాణానికి రూ. 51,116 విరాళం

నరసరావుపేట టౌన్, జులై 5 ప్రభాతవార్త : పట్టణంలోని పులుపులవారి వీధిలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయ సహిత శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవాలయ రాతి నిర్మాణానికి ఆదివారం భక్తులు విరాళం అందజేశారు. పట్టణానికి చెందిన కాకుమాను వెంకట పిచ్చేశ్వరరావు, ప్రభావతి దంపతులు, కుమారుడు కిరణ్ కుమార్, హిమబిందు దంపతులు రూ. 51,116 లను విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని దేవస్థాన కమిటీ సభ్యులైన వనమా కృష్ణ, వనమా సాంబశివరావు, కొవ్వూరి శివ శ్రీను బాబు, గజవల్లి మురళిలకు అందజేశారు.

## భారత రాజకీయాల్లో చెరగని ముద్ర .... రామ్ విలాస్ పాశ్వాన్

సత్తెనపల్లి, జూలై 5, ప్రభాతవార్త: పద్మభూషణ్ రామ్ విలాస్ పాశ్వాన్ అంటే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పరిచయం అక్కరలేని వ్యక్తిని భారత రాజకీయాల్లో ఐదు దశాబ్దాలు గా చెరగని ముద్ర వేసుకున్నారని లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్.. పేర్కొన్నారు. పద్మభూషణ్ రామ్ విలాస్ పాశ్వాన్ 80 వ జయంతి సందర్భంగా ఆదివారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేరుకు బీహార్ రాష్ట్రమైనా దేశమంతా నా వాళ్ల అనుకునేవాళ్లో మొదటి వ్యక్తి పాశ్వాన్ అని కొనియాడారు.. న్యాయ శాస్త్రం చదివిన ఈయన



విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో వచ్చి ఎనిమిది సార్లు లోక్ సభకు ఒకసారి రాజ్యసభ కు ఎంపికైయ్యారని తెలిపారు. అంతేకాకుండా వి.పి.సింగ్, దేవెగౌడ, ఐకె గుజ్రాల్, వాజ్ పాయ్, మన్మోహన్ సింగ్, మోదీ ఇలా ఆరుగురు ప్రధాన మంత్రుల వద్ద పలు శాఖల మంత్రిగా పనిచేసి ఆ శాఖలకే వన్నె తెచ్చారని కొనియాడారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలతో పాటు అగ్రవర్ణాల్లో పేదలు సామాజిక, రాజకీయ, ఆర్థికాభివృద్ధికి ఆయన ఎంతగానో పాటుపడ్డాడని తెలిపారు. పాశ్వాన్ ఆశయాల సాధన కోసం ఆయన కుమారుడు, ప్రస్తుత కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చందోలు సత్యనారాయణ లు పాటు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ పార్టీ మీది.. మనది.. మన అందరిదనీ రాష్ట్రం, దేశంలో పార్టీ ని ఆదరించి అండగా నిలవాలి అయన పిలుపునిచ్చారు. అనంతరం పరివర్తన మానసిక ఆశ్రమ పాఠశాల్లో అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ కాసిం పీరా, మహంకాళి బ్రహ్మానంద చారి, వెంకట్రావ్, షేక్ ఖాదర్, కొరబండి రాబర్ట్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బత్తుల ఆదినారాయణ 64 వ జన్మదిన వేడుకలు

సత్తెనపల్లి, జూలై 5, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణానికి చెందిన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బత్తుల ఆదినారాయణ 64వ పుట్టినరోజు వేడుకలు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.ఎం.సుభానీ మాట్లాడుతూ ఆదినారాయణ విద్యార్థి దశ నుంచి సేవాభావంతో ఉన్నారని, అనంతరం 36 సంవత్స రాలు న్యాయవాదిగా పేదవర్గాలకు సేవలు అందిస్తూ ఇటీవల ప్రభుత్వం వారిచే అసిస్టెంట్



గవర్నమెంట్ ప్లీడర్ గా నియమితులయ్యారని, ఈ పదవిలో కూడా అందరికీ న్యాయం చేయాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభా కాంక్షలు తెలియచేశారు.ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు కంబాల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, శాలువా పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా కో ఆర్డినేటర్ కంబాల వెంకటేశ్వరరావు, ఎస్టీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కటారి సురేష్, కార్యదర్శి తురకా రాజు , సీపీఎస్ కన్వీనర్ జెల్ది విజయప్రసాద్, ఎస్టీయూ సత్తెనపల్లి శాఖ గౌరవ అధ్యక్షులు మోదుగుల అప్పారావు, అధ్యక్షులు పాగళ్ళ వెంకయ్య, నాయకులు ఆవుల సురేష్, కలపాల ప్రేమ కుమార్, తోట రామ తిరుపతిరావు, తిరుమలశెట్టి అయ్యప్ప, దాసరి తిరుపతిరావు, అమ్మిశెట్టి కోటేశ్వరరావు, బత్తుల వీరాంజనేయులు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, కంబాల భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నబోయిన రాఘవయాదవ్‌కు ఘననివాళి

రాజుపాలెం, జూలై 5, ప్రభాతవార్త: సత్తెనపల్లి నియోజకవర్గం మాజీ తెలుగు యువత అధ్యక్షుడు చిన్నబోయిన రాఘవ యాదవ్‌కు పలువురు ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మన్నెం శివ నాగ మల్లేశ్వరరావు (మల్లి బాబు ) తదితరులు యాదవ్ పార్థివదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ జెండా కప్పి ఆయన మట్టి కార్యక్రమంలో పాల్గొని పాడే మోశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు



## రామాలయ స్లాబ్ నిర్మాణానికి ఏపీ ఎరుకల సేవా సంఘం ఆర్థిక సాయం : ఏకలవ్య మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు హామీ

రాజుపాలెం, జూలై 5, ప్రభాతవార్త: రాజుపాలెం మండలం స్థానిక చౌట పాపాయిపాలెం ఎరుకల కాలనీలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్మిస్తున్న రామాలయ స్లాబ్ నిర్మాణం కోసం ఏపీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేడా గోపి రూ. 30,000/ (ముప్పై వేల రూపాయల) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సంఘం ముఖ్య నాయకుల సమక్షంలో ఈ విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు.ఈ సందర్భంగా మేడా గోపి మాట్లాడుతూ, కాలనీలో



ఆలయ నిర్మాణానికి తమ వంతు సహాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. అంతేకాకుండా, రాబోయే రోజుల్లో ఎరుకుల జాతి మూలపురుషుడైన ఏకలవ్య మహారాజ్ విగ్రహాన్ని ఏపీ ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలోనే ఇక్కడ ఘనంగా ఏర్పాటు చేస్తామని కాలనీ ప్రజలకు బహిరంగంగా హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కమిటీ చైర్మన్ పాలపర్తి శ్రీనివాస్ చక్రవర్తి , రాష్ట్ర ఉపాధ్యక్షులు తోకల నరసింహారావు , గుంటూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండి రాజారావు తో పాటు స్థానిక కాలనీ పెద్దలు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్‌కు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి

రాజుపాలెం, జూలై 5, ప్రభాతవార్త: ప్రాంతీయ పశు వైద్యశాల రాజుపాలెం నందు అసిస్టెంట్ డైరెక్టర్ గా గత నాలుగు సంవత్స రాలు పని చేసినానని, డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నత పొంది ఉన్నందున డ్యూటీ నుండి రిలీవ్ అయ్యారు. ఈ నాలుగు సంవత్స రాలు ప్రభుత్వ కార్యక్రమాలన్నిటిని, మరియు సాంకేతిక సమాచారాన్ని రైతులకు మీడియా ద్వారా తెలియపరిచి మాకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

బాపట్ల జిల్లా వార్త



## చట్టాన్ని ధిక్కరిస్తే చర్యలు: రేపల్లె డిఎస్పీ అబ్దుల్ అజీజ్

రేపల్లె, జూలై 5, ప్రభాతవార్త:సమాజంలో ఎవరైనా చట్ట నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని రేపల్లె డిఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ హెచ్చరించారు.ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యా లక్ష్యాలను సాధించాలని చెప్పారు.మహిళలను వేధించడం,ర్యాగింగ్ చేయడం వంటి వాటిని ఉపేక్షించేది లేదన్నారు.విద్యను నిర్లక్ష్యం చేసి పోకిరీ సంస్కృతిని కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.సోషల్ మీడియా ఆధారంగా ఇబ్బందులకు గురిచేస్తే సహించేదిలేదన్నారు.18 సంవత్సరాల లోపు పిల్లలను లైంగిక వేధింపులు,లైంగిక దాడులు,అశ్లీల చిత్రాల నుండి రక్షించడానికి పోక్సో చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేస్తామని ఆయన వెల్లడించారు.పిల్లలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడమే తమ లక్ష్యమన్నారు.పోక్సో కేసుల్లో ఇప్పటికే నిందితులకు న్యాయస్థానాలు జైలు శిక్షలు,జరిమానాలు విధించాయని ఆయన గుర్తుచేశారు.ఒక చిన్న పొరపాటు జీవితాంతం చెరగని మచ్చగా మారే ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని యువత క్షణికావేశాలకు గురికాకుండా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని ఆయన సూచించారు.



## వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

రేపల్లె, జూలై 5, ప్రభాతవార్త:సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రేపల్లె బ్రాంచ్ కార్యదర్శి డాక్టర్ వసంతం వీరరాఘవయ్య చెప్పారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.వాతావరణ మార్పుల వలన జలుబు,జ్వరం,గొంతు నొప్పి,దగ్గు,వైరల్ ఇన్ఫెక్షన్లు, విరోచనాలు వంటి సమస్యలు చోటుచేసుకుంటాయన్నారు.కాచి చల్లార్చిన నీటిని మాత్రమే సేవించాలని,ఇంటి ఆహారానికే పరిమితం కావాలని చెప్పారు.పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు.చేతులను సబ్బుతో శుభ్రపర్చుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని తెలిపారు.ఇలా చేయడం వలన అంటువ్యాధులను నివారించవచ్చని చెప్పారు.ఎటువంటి అనారోగ్య సమస్యలు కనిపించినా స్వయంగా మందులను వాడకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.చిన్నారుల టీకాలు సకాలంలో వేయిస్తూ ఎదుగుదల,ఆరోగ్య పరిస్థితిని తల్లిదండ్రులు గమనిస్తుండాలని డాక్టర్ వసంతం వీరరాఘవయ్య చెప్పారు.



## ఉచిత వైద్యశిబిరాలతో ప్రయోజనం

రేపల్లె, జూలై 5, ప్రభాతవార్త:గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య ప్రమాణాలను పరిరక్షించేందుకు రమేష్ హాస్పిటల్స్ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వలన ప్రయోజనం చేకూరటం అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు.ఆదివారం రేపల్లె మండలంలోని పిరాట్లంకలో రమేష్ హాస్పిటల్స్ ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ రేపల్లె నియోజకవర్గంలోని గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాల ద్వారా వైద్య సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో కెడబ్ల్యూఎస్ ఛైర్మన్ పంతాని మురళీధరరావు,దండుప్రోలు పిచ్చయ్య,మత్తె భాస్కరరావు,యర్రగళ్ళ ధర్మతేజ,పంతాని సాయికుమార్,తుమ్మల సురేష్,రమేష్ హాస్పిటల్స్ వైద్యులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రేపల్లెలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలి

రేపల్లె, జూలై 5, ప్రభాతవార్త:రెవెన్యూ డివిజన్ కేంద్రమైన రేపల్లెలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రేపల్లె పట్టణ ఆదర్శవేదిక కనీ ్వనర్ యడ్లపల్లి కిషోర్‌బాబు కోరారు.ఆదివారం పురపాలక సంఘంలోని 7వ వార్డులో ఏర్పాటు చేసిన పట్టణ ఆదర్శ వేదిక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ డివిజనల్ స్థాయి కార్యాలయాలను పూర్తిస్థాయిలో ప్రారంభిస్తేనే ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు .పట్టణంలోని ప్రధాన రహదారులలో సెంటర్ డివైడర్‌లతో పాటు రహదారులను విస్తరించాలని ఆయన కోరారు.అంకమ్మచెట్టు నుండి పెనుమూడి హైవే వరకు రహదారి విస్తరణతో పాటు సెంటర్ లైటింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేయాలన్నారు.రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అవసరమైన నిధులను సాధించి రేపల్లె పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో బి.వి.మోహనరావు,కె.సుబ్బారావు,ఎ.సి.హెచ్.దుర్గారావు,కొడాలి ఆనందరావు,గుంటి సాంబశివరావు,ఎస్.సాయికృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



## నిజాయితీ నిబద్ధతతో పనిచేసిన వ్యక్తి కామినేని

వేమూరు, జూలై 5 (ప్రభాతవార్త): దేవాదాయ శాఖలో నిజాయితీ నిబద్ధతతో పని చేసిన వ్యక్తి కామినేని శ్రీనివాస్ పని చేశారని వక్తలు పేర్కొన్నారు. దేవాదాయ శాఖలో తిరుపతి విభాగం రీజనల్ జాయింట్ కమీషనర్‌గా పని చేసి పదవీ విరమణ చేసిన కామినేని బసవేశ్వర శ్రీనివాస్ దంపతులకు ఆయన స్వగ్రామమైన మండలంలోని జంపని గ్రామంలో ఆదివారం పౌర సన్మానం నిర్వహించారు. శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ సీతారామాంజనేయ కళ్యాణ మండపంలో నిర్వహించిన సభా కార్యక్రమానికి వైభవాన సేవా సంఘం అధ్యక్షులు డాక్టర్ మేడూరి శ్రీనివాసమూర్తి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా విచ్చేసిన విజయబాబు, వి.ఎస్.కె.ప్రసాద్‌లు మాట్లాడుతూ దేవుని సొమ్ము దేవుడికే చెందాలన్న సూత్రాన్ని తూచా తప్పకుండా పాటించిన అధికారిగా శ్రీనివాస్ అవినీతికి తావు లేకుండా నిబద్ధతతో పని చేశారన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన దేవాదాయ శాఖ ఆగమ సలహాదారు ఆగమ పరీక్షల అధికారి మామిళ్ళపల్లి మృత్యుంజయ ప్రసాద్ మాట్లాడుతూ దేవాలయాల పునరుద్ధరణ భక్తులకు సౌకర్యాలు భూముల పరిరక్షణ ఆదాయం పెంపు సత్రాలను అనుసరిస్తూ పారదర్శకంగా పెద్ద పీట వేసిన వ్యక్తి శ్రీనివాస్ అని కొనియాడారు. అధ్యక్షులు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ 2014 నుండి 2019వరకు టిడిపి ప్రభుత్వ హయాంలో అమరావతి నిర్మాణంలో భాగంగా అర్చకులకు ఏర్పడిన సమస్యల పరిష్కారం విషయంలో కీలకపాత్ర పోషించిన వ్యక్తి శ్రీనివాస్ అని కొనియాడారు. సన్మాన గ్రహీత శ్రీనివాస్ మాట్లాడుతూ దైవానుగ్రహంతో తమకు లభించిన ఉద్యోగ బాధ్యతలను దైవచింతనతో నిర్వహించడం జరిగిందన్నారు. ఆలయాలు అర్చకుల పరిరక్షణ కోసంగా ఎంతో కృషి చేశారని వివరించారు. పౌర సన్మానం తనకు జరగడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు. సభలో పండిత దీవి లక్ష్మీనరసింహాచార్యులు, వల్లూరు వరప్రసాద్, వైభవాన సేవా సంఘం ఉపాధ్యక్షులు తుమరిశ హరిబాబు, అర్చకులు అగ్నిహోత్రం చంద్రశేఖర్, జంపని పాల్‌ప్రసాద్, వడ్డమూడి చంద్రశేఖర్, జర్నలిస్ట్ ప్రతాప్, శ్రీనివాస్ గుమ్మడి రంగయ్య, అర్చక సేవా సంఘం డివిజన్ కన్వీనర్ వంశీకృష్ణ అధ్యక్షులు బృందావనం చక్రపాణి తదితరులు తమ ప్రసంగాల ద్వారా శ్రీనివాస్ సేవలను కొనియాడారు. డాక్టర్ శ్రీనివాసమూర్తి, గ్రామస్తులు, బంధుమిత్రులు శ్రీనివాస్ దంపతులను ఘనంగా సత్కరించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు.



## హెల్మెట్ ధరించు..క్షేమంగా గమ్యం చేరు-ఎస్ఐ ప్రసాద్

కొల్లిపర, జూలై 5 (ప్రభాతవార్త): వాహనదారులు హెల్మెట్ ధరించి క్షేమంగా గమ్యం చేరాలని కొల్లిపర ఎస్ఐ ఎస్ ప్రసాద్ అన్నారు.ఆదివారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి,కొల్లిపర,దివలూరు తదితర గ్రామాల్లో ఎస్ఐ తన సిబ్బందితో కలసి వాహనాలను తనిఖీ చేశారు.



ఈ సందర్భంగా ఎస్ ఐ ప్రసాద్ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని..హెల్మెట్ ధరించకపోవటం వలన రోడ్డు ప్రమాదాలకు గురైనప్పుడు తలకు బలమైన గాయం తగలటం వలన చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన అన్నారు.వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ఉంటే తలకు ఒక రక్షణ కవచంలా ఉపయోగ పడుతుందని ఆయన తెలియజేశారు.రోడ్డు ప్రమాదాల వలన మరణించే వారిలో ఎక్కువగా తలకు గాయాలై మరణించటం జరుగుతుందని ఆయన అన్నారు.దానిని నివారించాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని వారు తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడపరాదని,అదేవిధంగా త్రిబుల్‌రైడింగ్,డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా..మైనర్లు వాహనాలు నడిపినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## నేడు జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

బాపట్ల,జులై 5,ప్రభాతవార్త,ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి సోమవారంబాపట్ల జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ నందు ఉదయం9గంటల నుండి



10గంటలవరకు గతం లో పిజిఆర్ఎస్ కు వచ్చిన అర్జీల పరిష్కరం పై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు.అనంతరం ఉదయం10గంటలనుండి మధ్యాహ్నం1 గంట వరకు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తప్ప కుండా హాజరు కావాలన్నారు.అర్జీదారులు అందజేసినతమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా,లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు.అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలన్నారు.

## ఓటరు జాబితా వెరిఫికేషన్ ను పటిష్టంగా చేపట్టాలి

కర్లపాలెం,జులై5,ప్రభాతవార్త,ప్రతినిధి: బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం సెగ్మెంట్ లోని నల్లమోతువారిపాలెం గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఎంపీటీసీ సభ్యులు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావుపరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన గ్రామంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని చేపడుతున్న విధానం గురించి బూత్ స్థాయి అధికారిలనువివరాలుఅడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా చేపట్టడం వలన భవిష్యత్తులో కూడా ప్రతి భారతీయునికి రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు సఫలీకృతం అవుతాయన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగాతన ఓటరు నమోదు పత్రాన్ని కూడా స్థానిక బూత్ లెవెల్ ఆఫీసర్ పల్లపాటి వంశీ కి అందజేశారు.అంతిమంగాభారతీయులబంగారు భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.



## బాపట్ల జిల్లా జూనియర్ మెన్ హాకీ జట్టు ఎంపిక

బాపట్ల,జులై5,ప్రభాతవార్త,ప్రతినిధి:బాపట్ల జిల్లా హాకీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హై స్కూల్ చెరువు జమ్ములపాలెంపాఠశాల ఆవరణలోబాపట్ల జిల్లా జూనియర్ మెన్ హాకీ జట్టు ఎంపికలు అదివారం విజయవంతంగా జరిగాయి.ఈఎంపికల్లో క్రింది క్రీడాకారులు జిల్లా జట్టుకుఎంపికైన క్రీడాకారులను



హాకీ జిల్లా కార్యదర్శి బోయిన వీరచంద్ర తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం.శరత్ చంద్ర,శ్రీనిఖిల్,సాగర్ బాబు,మణికంఠ, నిఖిల్,పార్థు వవన్,సుదర్శన్,సంతోష్ కుమార్, శరత్,సిసింద్రీ,మహేష్, విక్టర్‌పాల్, యశ్వంత్, జస్వంత్,విజయ్, బాలసుబ్రమణ్యం,భాష, చంటిబాబు, ఎంపికైయ్యారన్నారు.ఎంపికైన క్రీడాకారులు ఈ నెల11నుండి 14వతేదీవరకు గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్న 16వ జూనియర్ మెన్ హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పోటీలలో బాపట్ల జిల్లా తరఫున పాల్గొంటారన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పువ్వాడ బసవకుమార్,శ్రీనివాసరావు,వ్యాయామ ఉపాధ్యాయులు రాంబాబు,అంకమ్మ చౌదరి,పాల్గొని క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

## పలు పోలింగ్ కేంద్రాల మార్పునకు ప్రతిపాదనలు

**-సర్‌కు అన్నీ పార్టీల నాయకులు సహకరించాలి**

**-ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఇడుపులపాటి పద్మావతి**

పొన్నూరు, జూలై 5,ప్రభాతవార్త: నియోజకవర్గంలో పలు పోలింగ్ కేంద్రాల మార్పుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఎన్నికల ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు సర్వశిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, నియోజకవర్గ ఓటు నమోదు అధికారి ఇడుపులపాటి పద్మావతి చెప్పారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గస్థాయి అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల, ఓటర్ల విజ్ఞప్తుల మేరకు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఇచ్చిన లేఖ, నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల మార్పుకు సంబంధించి వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తెలిపిన అభ్యంతరాల లేఖలకు సంబంధించి పూర్తిస్థాయిలో పరిశీలన చేసి పోలింగ్ కేంద్రాల మార్పుకు ప్రతిపాదనలు తయారు చేయడం జరిగిందన్నారు. తాను నియోజకవర్గంలోని మూడు మండలాల్లో పలు గ్రామాల్లో పర్యటించి పోలింగ్ స్టేషన్ల నైసర్గిక స్వరూపాన్ని, అక్కడ ఉన్న ఏర్పాట్లు, అక్కడి ఓటర్ల సలహాలు, సూచనలు తీసుకున్న మీదట ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు.



ఈ ప్రతిపాదనలకు సంబంధించిన విషయాలను సమావేశంలో వివరించి చర్చించారు. పెదకాకాని మండలం, వెనిగండ్లలో మండల పరిషత్ పడమర పాఠశాలలో 5,6,7పోలింగ్ స్టేషన్లు ఉండడం వల్ల, ఇరుకుగా ఉండడం, ఒకటే ద్వారం ఉండడం వల్ల, 707మంది ఓటర్లు ఉండడం వల్ల ఇబ్బందిగా ఉన్నందున ముస్లీం పాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మార్పు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అదే మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో 66వ పోలింగ్ కేంద్రాన్ని ప్రస్తుతం ఉన్న ఎంపిపి స్కూల్ నుంచి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గ్రామ పంచాయితీ ఉప్పలపాడుకు మార్పు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అనుమర్లపూడిలో ప్రస్తుతం ఎంపిపి స్కూల్‌లో ఉన్న 73వ పోలింగ్ కేంద్రాన్ని గ్రామ సచివాలయానికి మార్పు చేస్తున్నట్లు చెప్పారు. వెల్లలూరు గ్రామంలోని 152,153పోలింగ్ కేంద్రాలను జడ్పీ పాఠశాల నుంచి గ్రామ నడిబొడ్డున ఉన్న ఎంపిపి స్కూల్‌కు మార్పు చేస్తున్నట్లు చెప్పారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో ఎంపిపి స్కూల్‌లో ఉన్న 105వ నెంబరు పోలింగ్ కేంద్రాన్ని కమ్యూనిటీ హాలుకు మార్పుచేస్తున్నట్లు చెప్పారు. అదేగ్రామంలోని ఎంపిపి స్కూల్‌లో ఉన్న 106వ నెంబర్ పోలింగ్ కేంద్రాన్ని కమ్యూనిటీ హాలుకు మార్పు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఈ ప్రతిపాదనలను ఆదివారం జరిగిన అన్ని పార్టీ నాయకుల సమావేశంలో ఆమోదిస్తూ తీర్మానించారు. ఈ ప్రతిపాదనలను అంగీకరిస్తూ అన్ని పార్టీలకు చెందిన నాయకులు ఆమోదం తెలుపుతూ సంతకాలు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని వేగవంతంగా ముందుకు తీసుకెళ్ళేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. సర్‌కు సంబంధించిన గడువు దగ్గరపడుతున్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతం చేయాలని పద్మావతి కోరారు. సమావేశంలో పొన్నూరు, చేబ్రోలు మండలాల తహశీల్దార్‌లు మహమ్మద్ జియావుల్ హక్, కళ్ళెం శ్రీనివాసశర్మ, పొన్నూరు, పెదకాకాని తహశీల్దార్ కార్యాలయాల సూపరింటెండెంట్‌లు షేక్ కరీముల్లా, కాకుమాను ప్రసాద్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ నల్లపు మౌనిక, కంప్యూటర్ ఆపరేటర్లు సయ్యద్‌లాల్, షేక్ సిరాజుద్దీన్, నాయకులు మాదల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబూరావు, టి.లక్ష్మీనారాయణచౌదరి, గణిపిశెట్టి రామకృష్ణ, నిమ్మకూరి రమేష్‌బాబు, గోపిశెట్టి వాసు, చందోలు ఇమ్మానియేలు, చింతలపూడి మురళీకృష్ణ, కొల్లి శేషిరెడ్డి, అందె దిలీప్ తదితరులున్నారు.

## సర్ డిజిటైజేషన్‌ను బిఎల్వోలు వేగవంతం చేయాలి

పొన్నూరు, జూలై 5,ప్రభాతవార్త: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఇంటింటి సర్వే కార్యక్రమానికి గడువు దగ్గరపడుతున్న నేపథ్యంలో బిఎల్వోలు ఓటర్ల నుంచి పూర్తి చేసిన ఫారాలను తీసుకొని డిజిటైజేషన్ వేగవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ బిఎల్వోలను కోరారు. అంబటి మురళీకృష్ణ తాను పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫారాన్ని బిఎల్వోకి అందజేశారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ దూర ప్రాంతాల్లో ఉన్నటువంటి ఓటర్ల గ్రామ సచివాలయానికి వచ్చి ఫారాలను తీసుకొని సంబంధిత పత్రాలతో పూర్తి చేసి అందజేయాలని సూచించారు. బిఎల్వోలు కూడా కొంత శ్రమించైనా కార్యక్రమాన్ని నూరుశాతం విజయవంతం అయ్యేవిధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి లంకపోతు పిచ్చిరెడ్డి, చిర్రా అక్కిరెడ్డి తదితరులున్నారు.



## బాపట్ల దాహార్తి తీర్చటానికి అమృత్ మోక్షం

**రూ.23.38 కోట్లతో తాగునీటి వ్యవస్థ ఆధునీకరణ**

**నేడు బైపాస్ రోడ్డులో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ చేతుల మీదుగా శంకుస్థాపన**

**రాబోయే 30 ఏళ్ల జనాభా అవసరాలకు తగ్గట్టుగా ప్రణాళికలు**

**ప్రతి ఇంటికీ రక్షిత తాగునీటి కుళాయి కనెక్షన్**



బాపట్ల,జులై5,ప్రభాతవార్త,ప్రతినిధి: బాపట్ల పురపాలక సంఘ పరిధిలో దశాబ్దాలుగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంలభించనుంది.పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమృత్ 2.0 పథకం కింద మంజూరైన రూ.23.38 కోట్ల భారీ నిధుల పనులకు సోమవారంఉదయం 9 గంటలకు శ్రీకారం చుట్టబోతున్నారు.బాపట్ల బైపాస్ రోడ్డులోని ప్యాడ్సన్ పేట హౌసింగ్ కాలనీ వద్ద స్థానిక శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆధ్వర్యంలో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగనుంది. ఈ కార్యక్రమానికి కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.

**మూడు దశాబ్దాల భవిష్యత్తుకు భరోసా**

బాపట్ల పట్టణంలో రాబోయే 30 ఏళ్ల జనాభా అవసరాలు,విస్తరణను దృష్టిలోఉంచుకునిఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.ప్రధానంగా పట్టణ శివారు ప్రాంతాలు,ఎన్టీఆర్ కాలనీలకు పైపులైన్ల ద్వారా రక్షిత మంచినీటిని అందించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి గృహానికి రక్షిత తాగునీటి కుళాయి కనెక్షన్‌ను అనుసంధానించేలా చర్యలు తీసుకుంటున్నారు.ఎన్టీఆర్ టౌన్ షిప్ లలో కూడా మంచినీటి సరఫరా వ్యవస్థ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ చేతుల మీదుగా భూమిపూజ జరగనుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారంబాపట్ల మున్సిపాలిటీ పరిధిలో మంచినీటి కొరతను శాశ్వతంగా అధిగమించేందుకు ప్రభుత్వం ఈ భారీ నిధులను మంజూరు చేసిందన్నారు.దశాబ్దాల కాలంనాటి పాత పైపులైన్ల స్థానంలో లీకేజీలు లేని కొత్త అంతర్గత పైపులైన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఈ ప్రణాళిక సత్ఫలితాలను ఇచ్చి, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు అందుతుందన్నారు.వేసవికాలంలో నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుతో పాటు కీలక నీటి వనరులను ఆధునీకరిస్తామన్నారు.కృష్ణా పశ్చిమ డెల్టా నుంచి వచ్చే నీటిని సక్రమంగా నిల్వ చేసుకుని,పూర్తిగా శుద్ధి చేసిన తర్వాతే ప్రజలకు సరఫరా చేసేలా ప్లాంట్ల సామర్థ్యాన్ని పెంచడం జరుగుతుందన్నారు.శివారు కాలనీలకు సైతం నీరందేలా అధునాతన ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నామన్నారు. బాపట్ల ఉప్పరపాలెంలో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకును త్వరలోనే ప్రారంభించటం జరుగుతుందని దీని ద్వారా తక్షణమే 10 వార్డుల ప్రజలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయని ఆయన తెలిపారు.

## అర్హులందరికీ ఓటు నమోదు లక్ష్యం

బాపట్ల,జులై 5,ప్రభాతవార్త,ప్రతినిధి: అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తహాశీల్దార్ సలీమా తెలిపారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు బాపట్ల మండలం జమ్ములపాలెం,ఇతేరు గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను మండల తహసీల్దార్ సలీమా ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులు చేపడుతున్న పనితీరును ఆమె స్వయంగా పరిశీలించారు. ఓటరు వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.సర్వే ప్రక్రియను పారదర్శకంగా,నిబంధనలకు అనుగుణంగా,నిర్ణీత గడువులో పూర్తి చేయాలని బిఎల్ఓ లకు తహసీల్దార్ పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఆమె ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## రేషన్ దుకాణంలో అదనపు బియ్యం గుట్టురట్టు

**ప్యాడిసన్ పేటలో పౌరసరఫరాల అధికారుల ఆకస్మిక తనిఖీ**

**లెక్క తేలిన 3 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం: డీలర్‌పై కేసు నమోదు**

బాపట్ల,జులై5,ప్రభాతవార్త,ప్రతినిధి: పేద ప్రజల పొట్ట కొడుతూ,నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన ఒక రేషన్ దుకాణం గుట్టును బాపట్ల పౌరసరఫరాల శాఖ అధికారులు రట్టు చేశారు.బాపట్ల పట్టణంలోని ప్యాడిసన్ పేటలో గల షాప్ నెంబర్ 0789027 లో ఆదివారంఅధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.బాపట్ల పౌరసరఫరాల శాఖ అధికారి,మరియు సి ఎస్ డి టి బృందం సంయుక్తంగా ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుకాణంలోని స్టాక్ రిజిస్టర్లను, అక్కడ ఉన్న అసలు నిల్వలను పరిశీలించగా తీవ్ర వ్యత్యాసం కనిపించింది. ఈపోస్ యంత్రం ప్రకారం ఉండాల్సిన నిల్వల కంటే ఏకంగా ఆరు బస్తాల (సుమారు 3 క్వింటాళ్లు) బియ్యం అదనంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.రాజీవ్ మహిళా పొదుపు సంఘం తరఫున డీలర్‌గా వ్యవహరిస్తున్న కె.రూతమ్మ ఈ షాపును నిర్వహిస్తున్నారు.కార్డుదారులకు బియ్యం తక్కువగా కొలిచి,ఇలా అక్రమంగా నిల్వ చేశారా.లేక దీని వెనుక మరేదైనా కారణం ఉందా.అనే కోణంలో అధికారులు విచారణ జరుపుతున్నారు.నిబంధనలను ఉల్లంఘించి అదనపు నిల్వలు ఉంచినందుకు గానూ సదరు డీలర్‌పై పౌరసరఫరాల చట్టం కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.స్వాధీనం చేసుకున్న3 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని సివిల్ సప్లై అధికారి ఫణికుమార్ తెలిపారు.



## పార్లమెంట్ సమావేశంలోనే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి

**-ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి**

పొన్నూరు, జూలై 5,ప్రభాతవార్త: పార్లమెంట్ సమావేశంలోనే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని, మహిళలకు రాజకీయ ప్రాతినిథ్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి




రెంటాల కుమారి డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో 33శాతం రిజర్వేషన్లు ఎలాంటి షరతులు లేకుండా తక్షణమే అమలు చేయాలన్నారు. 2023లో పార్లమెంట్ ఆమోదించిన నారి శక్తి బంధన్ జన గణ(డిలిమిటేషన్) ప్రక్రియలతో ముడిపెట్టడం వల్ల మహిళలకు రాజ్యాంగ బద్ధంగా లభించాల్సిన రాజకీయ రిజర్వేషన్లను నిరవధిక వాయిదా పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశంలో చట్టానికి అవసరమైన సవరణలు చేపట్టి ఎలాంటి షరతులు లేకుండా మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగలకుదురు దుర్గా భవాని, విజయలక్ష్మి, రావూరి సుగుణ, పద్మ, స్వప్న, గుండెబోయిన విజయలక్ష్మి, చుక్కా చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించిన అంబటి

పొన్నూరు, జూలై 5,ప్రభాతవార్త: మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన మిరియాల చంద్రయ్య కుటుంబంలోని సభ్యురాలు ఇటీవల అకాల మరణం చెందారు విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మామిళ్ళపల్లి వచ్చి చంద్రయ్యను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. అంబటి వెంట మాజీ సర్పంచి లంకపోతు పిచ్చిరెడ్డి, చిర్రా అక్కిరెడ్డి,గ్రామస్తులు ఉన్నారు.



## బిఎల్వోపై సస్పెన్షన్ వేటు

పొన్నూరు, జూలై 5,ప్రభాతవార్త: సెప్షల్ ఇంటెన్సివ్ రివిజన్, ఇంటింటి సర్వే కార్యక్రమానికి గైర్హాజరైన పి.సన్ని ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ సిఎం సాయికాంత్ వర్మ ఉత్తర్వులు జారీ చేశారని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలోని సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సన్ని ప్రసాద్ సర్ కార్యక్రమం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, విధులకు హాజరుకాకపోవడం వంటి విషయాలపై జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ జరిపి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తహశీల్దార్ చెప్పారు.

## పలు దేవాలయాలకు శంకుస్థాపన, సేవా కార్యక్రమాల అభివృద్ధి పనులకు అంకురార్పణ

చిలకలూరిపేట, జూలై 5, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం, గామాలపాడు గ్రామంలో నాయకురాలు నాగమ్మ ప్రాంగణమునందు శ్రీ మహా శైవక్షేత్రం, పలు దేవాలయాలకు శంకుస్థాపన మరియు సేవా కార్యక్రమాల అభివృద్ధి పనులకు అంకురార్పణ ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు టిటిడి బోర్డు మెంబర్ శ్రీ మహా శైవక్షేత్ర ట్రస్ట్ ట్రస్టీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ 11వ శతాబ్దంలో జిట్ట గ్రామాలపాడు గ్రామంలో



నాగులేరు తీరాన నాయకురాలు నాగమ్మ చిన్న మల్లికార్జున స్వామి దేవాలయం పలు ఉపాలయాలు నిర్మించారని, శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాల పునరుద్ధరణ లో భాగంగా గత ఏడాది మరకత లింగంతో పునప్రతిష్ట చేసి నిత్య పూజా కైంకర్యాలు ప్రారంభించడం జరిగింది. ప్రతిరోజు ఉషోదయాన సూర్యకిరణాలు శివలింగంపై ప్రసరించడం ఇక్కడ విశిష్టత అని అన్నారు. ఈ ప్రాంగణం నందు మహా శైవక్షేత్రముగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఉదయం పలు దేవాలయాలకు శంకుస్థాపన, దేవతామూర్తుల ప్రతిష్ట వేద పండితుల మంత్రోచ్చారణలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. శ్రీ పార్వతీ సమేత చెన్న మల్లికార్జున స్వామి ఆలయ జీవద్వాజ ప్రతిష్టాపన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు నరసరావుపేట పార్లమెంటు సభ్యులు పార్లమెంటరీ పార్టీ నాయకులు లావు శ్రీకృష్ణదేవరాయలు , శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్,గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మారెడ్డి ,నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ,జీడీసీసీ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావు ,మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ ,రేపల్లె మాజీ శాసనసభ్యులు దేవినేని మల్లిఖార్జునరావు ,బాచిన చెంచు గరటయ్య , జంగా కృష్ణమూర్తిని అభినందించారు.

## కుమారస్వామి అయ్యప్ప భజనల ఆడియో ఆవిష్కరణ మహోత్సవం

నరసరావుపేట, జూలై 5 ప్రభాతవార్త : కుమారస్వామి అయ్యప్ప భజనలు వాల్యూమ్ 18 ఆడియో ఆవిష్కరణ మహోత్సవ కార్యక్రమం ఆదివారం నరసరావుపేట లోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా లు ముఖ్యఅతిథిలు గా హాజరై ఆడియో సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి భక్తి భజనలు సమాజంలో ఆధ్యాత్మిక



చైతన్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. నిర్వహకులు కుమారస్వామి బృందం రూపొందించిన భజనలు భక్తులను అలరించడంతో పాటు భక్తిభావాన్ని మరింత బలపరుస్తాయని అభిప్రాయపడ్డారు. సనాతన ధర్మాన్ని, భక్తి సంస్క ృతిని భావితరాలకు అందించడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని కొనియాడారు. కుమారస్వామి అయ్యప్ప భజన మండలి సభ్యులు గత కొన్నేళ్లుగా శబరిమల యాత్ర సందర్భంగా, స్థానికంగా అయ్యప్ప దీక్షా సమయాల్లో భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తుల మన్ననలు పొందుతున్నారు. భక్తుల కోరిక మేరకు మొదటిసారిగా ప్రత్యేక అయ్యప్ప భజన గీతాలతో ఆడియోను రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఆడియోలో స్వామి మహిమ, దీక్షా నియమాలు, శబరి యాత్ర వైభవాన్ని ప్రతిబింబించేలా గీతాలను స్వరపరిచారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, స్థానిక అయ్యప్ప భక్తులు, బీజేపీ నాయకులు, కళాశాల ప్రతినిధులు పాల్గొని భజన గీతాలను ఆలకించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్క ృతమైన ఆడియో సీడీలను భక్తులకు అందజేశారు. సాంస్క ృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## అధికారుల పర్యవేక్షణ లోపం..అనుమతులు లేకుండానే వ్యాపారం

యడ్లపాడు, జులై 5, ప్రభాతవార్త : వ్యాపార సంస్థ ఏర్పాటు చేయాలంటే దానికి సంబంధించిన ప్రభుత్వ పరంగా అన్ని అనుమతులు తీసుకున్న తరువాతనే పనులు చేపట్టవల్సి ఉంటుంది. అయితే నేడు అలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన మండల పరిధిలోని బోయపాలెం మరియు సంగంగోపాల పురం గ్రామాల మధ్య గుంటూరుకు చెందిన గ్యాస్ ఏజెన్సీ సంస్థ తన వ్యాపార కార్యకలాపాలలో భాగంగా ఈ



ప్రాంతములో గ్యాస్ సిలిండర్ల నిల్వ ఉంచుకొనేందుకు ఒక గోడౌన్ ఏర్పాటు చేసుకున్నారు. అయితే దాని నిర్మాణం మరియు నిర్వహణకు పెట్రోలియం అండ్ ఎక్స్ప్లోజివ్స్ ఆర్గనైజేషన్ మరియు పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలి. ఇది పిఇఎసో లైసెన్స్ ద్వారా గ్యాస్ సిలిండర్ల నిల్వ కోసం ఫారం సి, ఫారం ఇ మరియు ఎఫ్ లైసెన్స్ పొందాలి. పిఎన్జిఆర్బి ఆమోదం ప్రకారం సైట్ లేఅవుట్ ఆమోదం అవసరం, వీటితోపాటు స్థానిక అనుమతులు అగ్నిమాపక శాఖ, స్థానిక పంచాయితీల నుండి విధిగా ఎన్ఓసీలు పొందవల్సి ఉంటుంది. అయితే నేడు స్థానిక రెవెన్యూ, పంచాయితీ అధికారుల వివరాల ప్రకారం తమ వద్ద లేఅవుట్ మార్పిడి ఫైల్ లేదని రెవెన్యూ, పంచాయితీ అనుమతులు లేవని పంచాయితీ తెలుపుతుంది. ఈ గోడౌన్ 2002లో నిర్మాణం గావించి అప్పటి నుండి కాలీగా ఉంచి తదుపరి 2025నుండి విధులలోకి తీసుకు వచ్చారు. దీనిపై స్థానిక తహశీల్దారును వివరణ కోరగా ఇప్పటి వరకు ఎటువంటి అనుమతులు ఉన్నాయన్న విషయము తమ దృష్టికి రాలేదని, పూర్తిస్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు. అనుమతులు లేకుండా వ్యాపార లావాదేవీలు నిర్వహించుతున్న వారిని ఏవిధంగా అధికారులు కట్టడి చేస్తారో వేచిచూడవల్సి ఉంది.

## ఉచిత మెగా వైద్య శిబిరంకు భారీగా విచ్చేసిన గ్రామస్తులు

యడ్లపాడు, జులై 5, ప్రభాతవార్త : యడ్లపాడు గ్రామంలో కాటూరి మెడికల్ కాలేజ్ మరియు హాస్పిటల్ ఆధ్వర్యంలో కాటూరి హాస్పిటల్ చైర్మన్ కాటూరి సుబ్బారావు మరియు చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లరావు ఆశీస్సులతో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్ లో ఉచితంగా బిపి, షుగర్ టెస్ట్,ఈ సి జి, ఎక్స్ రే, బిపి టెస్టులు మరియు అన్ని విభాగాలకు సంబంధించిన వైద్య సేవలు అందించడం జరిగింది. యాభై మంది వైద్యులు మరియు హాస్పిటల్ సిబ్బంది



పాల్గొని ఒక రెండు వందల మందికి పైగా వైద్య సేవలు అందించి వారికి ఉచితముగా మందులు కూడా ఇవ్వటం జరిగింది. ఒక యాభై మందికి మెరుగైన వైద్యం కొరకు హాస్పిటల్ కు రావాలని చెప్పటం జరిగింది. అందులో కంటి శుక్లములకు సంబంధించిన వారు మరియు గుండె సమస్య ఉన్నవారు, నెమ్ముకి సమస్య ఉన్నవారు ఉన్నారు. వారికి హాస్పిటల్ నందు యన్ టి ఆర్ వైద్య సేవ క్రింద ఉచితముగా వైద్యము చేయటం జరుతుందని ఆ హాస్పిటల్ డాక్టర్లు చేపటం జరిగింది.


## ప్రతి ఇంటినీ సందర్శించండి..ఎన్యూమరేషన్ ఫారాలను అందించండి

కొల్లిపర,జులై 5 ప్రభాతవార్త: ప్రతి ఇంటినీ సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయటంతో పాటు పాత ఓటర్ల జాబితాలో నమోదైన వివరాలను ఓటు లేదాలో వారి కొత్త చిరునామా వివరాలను సేకరించి నమోదు చేయాలని ఆర్డీవో శ్రీమణి బీఎల్ఓలకు చెప్పారు. ఆదివారం మండల పరిధిలోని మున్నంగి,కొల్లిపర గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి రమణ్య,తహశీల్దార్ గుమ్మడి సిద్ధార్థ,ఎంపీడీవో విజయలక్ష్మితో కలిసి సర్ సవరణ ప్రక్రియను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీమణి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని చెబుతూ ఓటర్ల జాబితా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. సర్ ప్రక్రియ తగిన సమయంలో పూర్తి చేస్తూ ఓటరు నమోదు జరగాలన్నారు. కార్యక్రమంలో సర్ ప్రక్రియ సూపర్వైజర్ మనోహరరెడ్డి,డిప్యూటి ఎంపీడీవోలు భార్గవ్,దానయ్య,ఆర్ఐ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రత్యేక ఓటరు శిబిరాన్ని పరిశీలించిన మున్సిపల్ అధికారులు:

తెనాలి జులై5(ప్రభాతవార్త): జిల్లా విద్యాశాఖ అధికారి, తెనాలి అర్బన్ ప్రత్యేక అధికారి.ఎస్ కే సలీం భాష, మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, ఆదివారం పట్టణం లోని సుల్తానాబాద్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ శిబిరాలను సందర్శించి సిబ్బంది పలు సూచనలు చేశారు. బిఎల్వోలు సచివాలయ సిబ్బంది ప్రత్యేక ప్రజలతో



మాట్లాడి ఓటర్ జాబితా సవరణ పై వారికున్న సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా అర్బన్ ప్రత్యేక అధికారి సలీం భాషా మాట్లాడుతూ,ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ విషయంలో ఉన్నతాధికారుల నుండి ఒత్తిడి ఉందని, ఈ విషయాన్ని బిఎల్వోలు గ్రహించి సకాలంలో ఓటర్ జాబితా సవరణను పూర్తి చేయాలని కోరారు. ఓటర్ల నుండి సమగ్ర సమాచారాన్ని సేకరించి ఖచ్చితమైన ఓటరు జాబితా తయారు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు మాట్లాడుతూ,ఓటర్ జాబితా సవరణ కోసం పట్టణంలో పలుచోట్ల ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. బిఎల్వోలు, సచివాలయ సిబ్బంది అడిగే సమాచారాన్ని ప్రజలు వారికి అందించి సహకరించాలని కోరారు. ప్రత్యేక ఓటర్ జాబితా సవరణకు సంబంధించి బిఎల్వోలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. ప్రజల నుండి సేకరించిన సమాచారంతో ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో పొందుపరచాలని తెలిపారు. ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ సకాలంలో పూర్తి చేసేందుకు సచివాలయ సిబ్బంది అంగన్వాడీలు, నగర దీపికలు ,ఆశా కార్యకర్తలు వంటి వారి సహకారం తీసుకోవాలని సూచించారు. బిఎల్వోలు ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణి ,బిఎల్వోలు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, నగర దీపికలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ లో,ఈసి నిబంధనలకు విరుద్ధంగా బిఎల్ఓల పనితీరు:

తెనాలి మున్సిపాలిటీ జులై5(ప్రభాతవార్త): ఓటరు జాబితా సవరణలో భాగంగా ఇంటింటి గణన చేపడుతున్న బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్ఓ) ఆధార్ కార్డు కంపల్సరీ అంటూ దరఖాస్తుదారులను ఇబ్బంది పెడుతున్నారని తెనాలి పట్టణంలో ప్రజలు ఆరోపిస్తున్నారు.ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసిఐ) జారీ చేసిన గణన ఫారం కోసం సమాచార పత్రం ప్రకారం, పుట్టిన తేదీ ఆధారంగా 12 రకాల గుర్తింపు పత్రాలలో ఏదో ఒక్కటి స్వయం ధృవీకరణ చేసి ఇస్తే సరిపోతుంది. ఆ జాబితాలో పాస్పోర్ట్, 10వ తరగతి సర్టిఫికెట్, జనన ధృవీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్ వంటివి ఉన్నాయి.



అయితే తెనాలి పట్టణంలో పలువురు బిఎల్ఓ లు “అప్లికేషన్లో ఏది రాసినా ఆధార్ ఇస్తేనే తీసుకుంటాం“ అని మొండికేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. “నా దగ్గర పాత మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్ ఉంది. ఈసిఐ లిస్టులో అది ఉంది. కానీ బిఎల్ఓ ఆధార్ లేకపోతే అప్లికేషన్ తీసుకోను అంటున్నాడు“ అని స్థానికులు వాపోతున్నారు.

**నిబంధనలు ఏం చెబుతున్నాయి?**

1. ఆధార్ ఐచ్ఛికం: ఫారం 6బి ద్వారా ఆధార్ అనుసంధానం స్వచ్ఛందం మాత్రమే. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఆధార్ లేదనే కారణంతో ఓటరు దరఖాస్తును తిరస్కరించకూడదు.
2. ఒక్క ప్రూఫ్ చాలు..:ఈసిఐ విడుదల చేసిన పత్రంలోని 12 డాక్యుమెంట్లలో ఏదో ఒకటి ఇస్తే చాలు. బిఎల్ఓ లు అదనపు డాక్యుమెంట్లు అడిగి ప్రజలను వేధించకూడదు.

**అధికారులు ఏమంటున్నారు?** ఈ విషయమై అధికారులను సంప్రదించగా, “ఆధార్ తప్పనిసరి కాదు. ఒకవేళ ఏ బిఎల్ఓ అయినా బలవంతం చేస్తే 1950 టోల్ ఫ్రీ నంబర్కు లేదా https://voters.eci.gov.in/ పోర్టల్లో ఫిర్యాదు చేయవచ్చు“ అని జిల్లా ఎన్నికల విభాగం అధికారి స్పష్టం చేశారు. ప్రజలు తమ వద్ద ఉన్న 12 రకాల గుర్తింపు పత్రాలలో ఏదో ఒకటి చూపించి, ఈసిఐ గైడ్లైన్స్ ప్రకారం నమోదు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## రూ.53 లక్షలు కాలువలో పోసినట్టేనా..?

### విద్యుత్తు సదుపాయం లేక జల్దావన్ పథకం నిరుపయోగమా

కాకుమాను జూన్ 5 (ప్రభాత వార్త ) మండల పరిధి బోడిపాలెం గ్రామంలో చెరువు నీరు పెట్టా లంటే భగీరథ ప్రయత్నం చేయాలి. అంతటి ఇబ్బందులు పడి నీరు పెట్టినా... తీరా గ్రామానికి చేరుకునే సమయంలో మురుగు కాలువ నుంచి చెరువుకు నీరు సరఫరా చేయాల్సి న దుస్థితి. దీంతో ఆ చెరువులో నీరు కలుషితమవుతోంది. గ్రామస్థులు ఎన్నో ఏళ్లుగా ఈ సమస్యతో అవస్థలు పడుతున్నారు. పలుమార్లు అధికా రులు, ప్రజాప్రతినిధులకు స్థానికులు తమ గోడు చెప్పుకోగా ఎట్టకేలకు జల్ జీవన్ పథకం నుంచి రూ.53 లక్షలు మంజూరు అయ్యారు. ఆ నిధులతోగత రెండేళ్ల క్రితం గ్రామానికి 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న కొమ్మ మూరు కాలువపై పంప్ హౌస్ నిర్మించారు. అక్కడ నుంచి గ్రామం లోని చెరువు వరకు పైపు లైను వేశారు. కానీ నీరు సరఫరా చేయా లంటే విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. విద్యుత్తు కనెక్షన్ ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. పైపు, లైను ఉన్నప్పటికీ చెరువుకు మురుగు నీటినే పెట్టుకోవాల్సి వస్తుందని గ్రామ స్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బిల్లులు రాక.. పనులు సాగక.. ఇది ఇలా ఉండగా జల్ జీవన్ పను లకు సంబంధించి గుత్తేదారుడికి కూడా ఒయూాయూగకయూగ బిల్లు మాత్రమే చెల్లింపుచేశారు. పంప్ హౌస్ వద్ద నిర్మించిన షెడ్కు ప్లాస్టింగ్ చేసి, 7.5 హెచ్పి రెండు మోటార్లు కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది. మిగిలిన బిల్లులు రాకపోవడంతో వాటిని ఏర్పాటు చేసేందుకు ఆలస్యం అవుతుంది.



## ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి కుటుంబం వారానికి ఒక రోజు ప్లాస్టిక్కు దూరంగా ఉండాలి - ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జులై 5,ప్రభాతవార్త :ప్రతి కుటుంబం వారానికి కనీసం ఒక రోజు ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వస్తువులకు పూర్తి దూరంగా ఉండాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.ఆదివారం గుంటూరు 38వ డివిజన్ గుజ్జనగుండ్ల పార్క్ సమీపంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన “లెస్ ప్లాస్టిక్ - మోర్ గ్రీన్” కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ



ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, సామాజిక బాధ్యత పై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ శ్యామల నగర్ రైల్వే వద్ద ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం సాధారణ పౌరుడిగా ప్రభాకర్ చేస్తున్న సేవలను ప్రత్యేకంగా అభినందించారు. రాంగ్ రూట్లో వాహనాలు రాకుండా స్వయంగా గంటల తరబడి నిలబడి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఆయన చేస్తున్న కృషి ఆదర్శనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఆమె హామీ ఇచ్చారు.

## ఎదనందిపాడు సొసైటీ లో సి ఎస్ సి పై రైతులకు అవగాహన

పెదనందిపాడు జులై 5(ప్రభాతవార్త) సహకార వారోత్స వాలు లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం పెదనందిపాడు సొసైటీలో రైతులకు కామన్ సర్వీస్ సెంటర్ (దిళీది)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల ఇన్చార్జ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ . డి వాసుబాబు సీనియర్ ఇన్స్పెక్టర్ .కె శ్రీనివాసరావు లు పాల్గొని రైతులకు కామన్ సర్వీస్ సెంటర్ పై పలు సందే హాలకు సమాధానాలు అందజేసి రైతుల మన్ననలను పొందారు, ఈ కార్యక్రమానికి సొసైటీ సీఈవో కె భాస్కరరావు అధ్యక్షత వహించగా కార్యక్రమంలో పలువురు రైతులు సొసైటీ సిబ్బంది. పాల్గొన్నారు.

## పదిమంది పేకాట రాయళ్లు అరెస్ట్

అమరావతి,జులై 5(ప్రభాతవార్త): మండల పరిధిలోని మండే పూడి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న పదిమందినీ సీఐ అచ్చయ్య ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 58,610 రూపాయలను సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు . మండల పరిధిలో పేకాట, కోడిపందాలు,గంజాయి ఇతర అ సాంఘిక కార్యకలాపాలు చేపట్టిన యెడల చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు అన్నారు.

## మన ఓటు హక్కును కాపాడుకుందాం: సీఐటీయూ పిలుపు

తెనాలి మున్సిపాలిటీ జులై5(ప్రభాతవార్త): మన ఓటుమన హక్కు, ఓటు ను కాపాడుకుంటేనే జీవితాన్ని కాపాడుకునేందుకు అవకాశమని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఓవర్ బ్రిడ్జి వద్ద విధులకు హాజరు అవుతున్న మున్సిపల్ కార్మికుల ను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కే.బాబూప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ ఆలస్యానికి వైసీపీయే కారణం: ఎంపీ, ఎమ్మెల్యే

మాచర్ల, జులై 5 ప్రభాతవార్త: వైసీపీలో అంతర్గతంగా రగులుతున్న అసంతృప్తే సర్ ప్రక్రియ ఆలస్యానికి కారణమని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆరోపించారు. ఆదివారం కేసీపీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడారు. ప్యాలెస్లోని ఏసీ గదుల్లో కూర్చొని సర్ ప్రోగ్రాంపై కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. వైసీపీలో ఉన్న అంతర్గత అసంతృప్తుల కారణంగానే ఆ పార్టీ క్యాడర్ సర్ ప్రోగ్రామ్కు దూరంగా ఉంటున్నారని, అందుకే మందకొడిగా కార్యక్రమం సాగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. దొంగే తన దొంగతనాన్ని కప్పి పుచ్చుకోవడానికి ఫిర్యాదు చేసినట్లుగా సజ్జల రాజకీయం ఉందని విమర్శించారు. ప్రజాస్వామ్య భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే సర్ కార్యక్రమంపై వైసీపీ చేస్తున్న నిర్లక్ష్య వైఖరి క్షమించరానిది అని మండిపడ్డారు. కూటమి పార్టీల శ్రేణులు ఎంతో నిబద్ధతగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో చురుగ్గా పాల్గొంటున్నారన్నారు. అధికారులకు, బీఎల్ఓలకు కూటమి పార్టీల శ్రేణులు పూర్తిస్థాయిలో సహకరిస్తూ ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు దారునాయక్, మాచర్ల మార్కెట్ యార్డు ఛైర్మన్ మధుసూదన్ యాదవ్, కళ్లం రామాంజిరెడ్డి, టీడీపీ నాయకులు కజ్జం సైదయ్య, గోగుల సీతారెడ్డి, గుండాల శ్రీనివాసయాదవ్, వజ్రంనాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

కారంపూడి, జులై 5 ప్రభాతవార్త: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ వేణుగోపాల్ అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ బ్రిటిష్ వాళ్లతో అల్లూరి పోరాటాన్ని వివరించారు. మన్యం వీరుడిగా ప్రసిద్ధికెక్కారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జాన్బెనియన్, డిప్యూటీ వార్డెన్ చెన్నకృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూలై 6,ప్రభాతవార్త :కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమానికి అతి తక్కువ సమయం ఉన్నందున ప్రజలందరూ స్వయంగా సహకరించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్టీసీ కాలనీ లోని బుర్ర నాగేశ్వరరావు గవర్నమెంట్ స్కూల్, సెయింట్ లారెన్స్ స్కూల్ లో సర్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చిన ఓటర్లతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఓటర్లందరూ ఎన్నికల జాబితాలో తమ ఓటు ఉందో లేదో



పరిశీలించుకోవాలని సూచించారు. అదే విధంగా అప్పటి జాబితాలో తమ కుటుంబ సభ్యుల పేర్లను చూసుకోవాలన్నారు. బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ తిరిగి అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాలను గతంలో ఎక్కడ ఓటు హక్కు వినియోగించుకున్నారో గుర్తించి నమోదు చేయాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా పూర్తి చేయాలో తెలియకపోతే బూత్ లెవెల్ అధికారులు, బీఎల్ఏల సహకారం తీసుకోవాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంతో జాగ్రత్త వహంచాలని చెప్పారు. బంధువులు ఎవరైనా ఇక్కడే నివాసముంటూ ఏదైనా ఊర్లకు వెళితే వారికి సమాచారం ఇవ్వాలన్నారు. ఇప్పటికే సర్ కార్యక్రమంపై గుంటూరు కార్పొరేషన్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని, ప్రత్యేక క్యాంపుల ద్వారా ఓటరు మ్యాపింగ్ అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు. సర్ కార్యక్రమంపై ప్రజలకు ఎలాంటి అపోహలు అవసరం లేదని, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టిందని చెప్పారు. సర్ పై ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా బీఎల్ ఏలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

తెనాలి మున్సిపాలిటీ జులై5(ప్రభాతవార్త): అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన గుర్తుతెలియని మృతదేహాన్ని, తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించిన తెనాలి రూరల్ పోలీసులు. శనివారం రాత్రి రూరల్ మండల గ్రామం కఠెవరం గ్రామం, బీసీ కాలనీ నందు రోడ్డు పక్కన ఒక మగ వ్యక్తి చనిపోయి ఉన్నాడని, వయసు సుమారు 40 సంవత్సరాలు టీ షర్టు మరియు ప్యాంటు ధరించి ఉన్నాడు అని వచ్చిన సమాచారం మీదకు,కఠెవరం గ్రామ వీఆర్వో రుద్రపాటి అనీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని,సదరు మృతదేహం తెనాలి గవర్నమెంట్ హాస్పటల్ నందు. మార్చురీ రూమ్ నందు భద్రపరచడం జరిగిందని,చనిపోయిన వ్యక్తి యొక్క వివరాలు తెలియలేదని,పై ఫోటోలోని చనిపోయిన వ్యక్తిని గుర్తించిన ఎడల తెనాలి రూరల్ పోలీసు వారిని సంప్రదించవలసిందిగా తెనాలి రూరల్ పోలీసులు తెలిపారు.సంప్రదించవలసిన నెంబర్లు : సీఐ . తెనాలి రూరల్ . 9440796219. తెనాలి రూరల్ ఎస్సై 9440796170.నెంబర్లకు తగు సమాచారం ఇవ్వాలసిందిగా,తెనాలి రూరల్ పోలీసులు సూచించారు.

## రోటరీక్లబ్ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకారం

తెనాలి మున్సిపాలిటీ జులై5(ప్రభాతవార్త): రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం,నూతన కార్యవర్గం ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేట్ ఎదురుగా గల ఈ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ నందు ఆదివారం నిర్వహించిన రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సభకు మాజీ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ ముళ్ళపూడి హరిహర ప్రసాద్ ఆధ్వర్యంలో నూతన అధ్యక్షులుగా గుమ్మడి స్వరాజ్ బాబు కార్యదర్శిగా కొల్లి రాజేంద్రప్రసాద్



కోశాధికారిగా జాస్తి నరేంద్ర ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నూతన కమిటీ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సేవలను మరింతగా విస్తృత పరచాలని ప్రజాసేవలో రోటరీ క్లబ్ కు విశిష్ట స్థానం ఉందని సామాజిక సేవను బాధ్యతగా తీసుకొని రోటరీ క్లబ్ సభ్యులు మరింతగా ప్రజలకు చేరువ కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## నేడు జొన్నలగడ్డలో సహకార్ సే సమృద్ధి వారోత్సవాలు

ప్రత్తిపాడు, జూలై 5, ప్రభాతవార్త : ప్రత్తిపాడు నియోజకవర్గం గుంటూరు రూరల్ మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో సోమవారం ఉదయం గం.10లకు సహకారంతో సమృద్ధి కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రతినిధి మాట్లాడుతూ..సహకార్ సే సమృద్ధి అనేది భారత ప్రభుత్వం ప్రారంభించిన ఒక ప్రతిష్టాత్మక కార్యక్రమం అన్నారు. సహకార సంఘాలను ముఖ్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను (పిఏసిఎస్) పటిష్టం చేయడం ద్వారా రైతుల ఆర్థిక అభివృద్ధికి మరియు గ్రామీణ స్వయం సమృద్ధికి కృషి చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.

## నేడు పెంపుడు జంతువులకు ఉచిత యాంటీ రేబీస్ టీకాలు

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూలై 5, ప్రభాతవార్త : నేడు వరల్డ్ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రాబీస్ టీకాలు వేయనున్నట్లు వట్టిచెరుకూరు, ముట్లూరు, కాట్రపాడు పశు వైద్యాధికారులు డాక్టర్ కోటేశ్వరమ్మ, డాక్టర్ శివశంకర్, డాక్టర్ భవ్యశాంతి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారులు మాట్లాడుతూ.. జంతువుల నుండి మనుషులకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించేందుకు నిర్వహించే ప్రత్యేకరోజు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం ప్రతి ఏడాది జూలై ఆరవ తేదీన నిర్వహిస్తారని తెలియజేశారు. జంతువుల ద్వారా మనుషులకు, మనుషుల ద్వారా జంతువులకు వచ్చే వ్యాధులను జూనోసిస్ అంటారని వెల్లడించారు. జూనోసిస్ వ్యాధులకు బ్యాక్టీరియా, వైరస్, పరాన్న జీవులు కారకాలుగా



నిలుస్తాయన్నారు. జంతువులను ప్రత్యక్షంగా తాకడం, జంతువుల వల్ల కలుషితమైన ఆహారం, నీరు మొదలగు వాటిని మానవుడు వినియోగిస్తే జూనోసిస్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని వివరించారు.

**..జూనోసిస్ డే చరిత్ర..** 1885 జులై 6వ తేదీన మొదటిసారిగా ఫ్రెంచ్ రసాయన శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్, రేబిస్ వ్యాధికి వ్యాక్సిన్ ను కనుగొన్నారని చెప్పారు. కుక్కల కారణంగా వచ్చే రేబిస్ వ్యాధికి మొదటిసారిగా వ్యాక్సిన్ కనుగొనడంతో ఆరోజును గుర్తుంచుకునేందుకు జూనోసిస్ డే జరుపుకుంటారని తెలియజేశారు. జంతువులను పెంచుకునే వారికి జూనోసిస్ వ్యాధులపై అవగాహన ఉండాలని, వాటికి సరైన సమయాల్లో వ్యాక్సిన్లు వేయించాలని, దానివల్ల మానవాళికి ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. జూనోసిస్ వ్యాధిపై ప్రజలు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నేటి ఉదయం గం.9ల నుండి సాయంత్రం గం.4ల వరకు పెంపుడు కుక్కలకు ఉచిత టీకాలు అందించనున్నట్లు చెప్పారు. మండలానికి 600 టీకాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యుత్ వైర్లను తాకుతున్న చెట్టు కొమ్మలు: కన్నెత్తి చూడని విద్యుత్ సిబ్బంది.



తెనాలి మున్సిపాలిటీ జులై5(ప్రభాతవార్త): తెనాలి పట్టణం నాజర్పేట, మల్లాది వారి వీధిలో విద్యుత్ వైర్లకు చెట్టు కొమ్మలు తగులుతుండటంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫోటోలో కనిపిస్తున్నట్లుగా భారీగా పెరిగిన చెట్టు కొమ్మలు నేరుగా విద్యుత్ తీగలను తాకుతున్నాయి. వర్షాలు కురుస్తున్న సమయంలో ఇవి షార్ట్ సర్క్యూట్కు, విద్యుత్ ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలి, వర్షం వచ్చినప్పుడు కొమ్మలు వైర్లపై పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే ప్రమాదం ఉందని, అంతేకాకుండా ఇళ్లపైకి కరెంట్ లీక్ అయ్యే అవకాశం కూడా ఉందని నివాసితులు తెలిపారు. ఈ విషయంలో సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి చెట్టు కొమ్మలను కత్తిరించి ప్రమాదాన్ని నివారించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదం జరిగే వరకు వేచి ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి: తహశీల్దారు వెంకటేశ్వర్లు నాయక్

కారంపూడి, జులై 5 ప్రభాతవార్త: ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తహశీల్దారు ఆర్.వెంకటేశ్వర్లునాయక్ బీఎల్ఓలను ఆదేశించారు. పట్టణంలోని పోలింగ్ బూత్లను పరిశీలించారు. ప్రతి బీఎల్ఓ ఓటరు దగ్గరకు వెళ్లి వారికి పత్రాలు అందించి వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. ఇప్పటికే నిర్లక్ష్యం వహించిన అయిదుగురు బీఎల్ఓలకు మెమోలు జారీ చేశామన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టరు కృతికాశుక్లా సర్పై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఈ నెల 10 నాటికి సర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

11న ఇస్లామాబాద్ వేదికగా
## అమెరికా-ఇరాన్ చర్చలు

**ఇస్లామాబాద్, జులై 5:** పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదిక ఈ నెల 11న అమెరికా – ఇరాన్ మధ్య చర్చలు జరుగనున్నాయి. దౌత్య వర్గాల కథనం ప్రకారం, వేదికపై తుది నిర్ణయం ఇంకా ప్రకటించాల్సి ఉంది, స్విట్జర్లాండ్‌లోని బర్గెన్ స్టాక్ రిసార్ట్‌ను కూడా పరిశీలిస్తున్నారు. పశ్చిమ ఆసియాలో శాంతిని పునరుద్ధరించే లక్ష్యంతో జూన్ 18న అమెరికా, ఇరాన్‌లు ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసిన తర్వాత, దౌత్య ప్రక్రియను సజావుగా కొనసాగించే ప్రయత్నాలలో భాగంగా ఈ చర్చలు జరుగుతున్నాయి. పాకిస్తాన్, ఖతార్‌ల మధ్యవర్తులుగా జూన్ 21న స్విట్జర్లాండ్‌లో సాంకేతిక స్థాయి చర్చలు జరిగాయి. తదుపరి సమావేశంలో ఇరాన్ అణు కార్యక్రమం, ఆంక్షల సడలింపు, విదేశాలలో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులు, ప్రాంతీయ భద్రతా సమస్యలపై దృష్టి



## ఇక్కడ బాస్ ఎవరో నెతన్యాహుకు బాగా తెలుసు..
### ఇజ్రాయెల్ ప్రధానిపై ట్రంప్ సెటైర్లు

**వాషింగ్టన్,జులై 5:** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఇక్కడ బాస్ ఎవరో బాగా తెలుసంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్, పశ్చిమాసియా దేశాల వ్యూహాలపై ఇరు దేశాల మధ్య విభేదాలు పొడసూపిన నేపథ్యంలో బంధాన్ని పునర్నిర్మించుకునేందుకు నెతన్యాహు వచ్చే వారమే వైట్ హౌస్‌ను సందర్శించే అవకాశం ఉందని ట్రంప్ వెల్లడించారు. యాక్సియోస్ వార్తాసంస్థకు ఇచ్చిన సంక్షిప్త టెలిఫోన్ ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ తమ మధ్య సంబంధాలు బాగున్నాయని, అయితే అసలు బాస్ ఎవరో నెతన్యాహుకు స్పష్టంగా తెలుసని వ్యాఖ్యానించారు. శ్వేతసౌధంలో సమావేశం కావాలని నెతన్యాహు స్వయంగా కోరారని, నాటో సదస్సు ముగించుకుని తాను తిరిగి వచ్చిన తర్వాత ఈ భేటీ ఉండవచ్చని ట్రంప్ పేర్కొన్నారు. ఫిబ్రవరిలో ఇరాన్‌పై ఉమ్మడి యుద్ధాన్ని ప్రకటించే ప్రణాళికను నెతన్యాహు ప్రవేశపెట్టిన తర్వాత వీరి మధ్య జరగనున్న మొదటి అధికారిక సమావేశం ఇదేకానుంది. అయితే ట్రంప్ పర్యటనల షెడ్యూల్ దృష్ట్యా వచ్చే వారం చాలా తర్వాత కానీ, లేదంటే ఆ తర్వాతి వారంలో కానీ భేటీ ఉండొచ్చని ఇజ్రాయెల్ అధికారి ఒకరు తెలిపారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపేందుకు నెతన్యాహు శుక్రవారం ట్రంప్‌కు ఫోన్ చేశారని, ఈ సందర్భంగా త్వరలోనే అమెరికాలో భేటీ కావాలని ఇరునేతలు అంగీకరించారని ఇజ్రాయెల్ ప్రధాని



## అయోధ్య విరాళాల చోరీపై దోషులకు కఠిన శిక్షలు వేయాలి: మోహన్ భగవత్

**నాగ్‌పూర్, జులై 5:** అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విరాళాల గోల్మాల్ వ్యవహారంపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోట్లాది మంది భక్తుల సెంటిమెంట్లతో ముడిపడి ఉన్న ఈ అంశంలో దోషులకు కఠిన శిక్ష పడాల్సిందేనని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ అన్నారు. నాగ్‌పూర్‌లో జరిగిన సన్మార్గ్ మైండ్ వెల్నెస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన మోహన్ భాగవత్ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే నిన్ననే దీనిపై స్పష్టమైన ప్రకటన విడుదల చేశారని, తాము ఆ ప్రకటనకే కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఈ వ్యవహారాన్ని ఒక సాధారణ ఘటనగా తీసుకోకుండా, అసాధారణమైనదిగా పరిగణించాలని ఆర్ఎస్ఎస్ సూచించింది. ఈ దురదృష్టకర ఘటనను ఆసరాగా చేసుకుని హిందూ ధర్మాన్ని, సమాజాన్ని అపకీర్తి పాలు చేయడానికి ప్రయత్నించే వ్యతిరేక, విద్రోహ శక్తుల కుట్రలను భక్తులు తిప్పికొట్టాలని సంఘ్ పిలుపునిచ్చింది. ఇదే కార్యక్రమంలో మోహన్ భాగవత్ మానసిక ఆరోగ్యం ప్రాధాన్యతను కూడా ప్రస్తావించారు. శారీరక అనారోగ్యం మనిషిని బలహీనపరిచినప్పుడు, అది మానసిక స్థితిపై కూడా ప్రభావం చూపుతుందని, అందుకే సంపూర్ణ ఆరోగ్యానికి ప్రశాంతమైన మనస్సు ఎంతో అవసరమని చెప్పారు.

## అవినాష్ బ్యాంక్ ఖాతానుంచి రూ.15 లక్షల లావాదేవీలు..

**అయోధ్య,జులై 5:** అయోధ్య రామజన్మభూమి ఆలయంలో విరాళాల దుర్వినియోగం కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు అవినాశ్ శుక్లా బ్యాంక్ అకౌంట్ నుంచి రూ. 15 లక్షలకు పైగా ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ డబ్బును పలువురికి ఆన్‌లైన్ ద్వారా ఇవ్వడంతో పాటు.. ఇంకొందరికి నగదు రూపంలో కూడా ఇచ్చినట్లు దర్యాప్తులో తేలింది. అవినాశ్ శుక్లా తన గర్ల్‌ఫ్రెండ్‌కి సుమారు రూ. 2 లక్షల నగదుతో పాటు ఖరీదైన ఫోన్ బహుమతిగా ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నిధులు అన్నీ ఆలయ విరాళాల నుంచి మళ్లించినవేనా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

# జాతిసేవలో సాటిలేని శ్యామాప్రసాద్ ముఖర్జీ

**న్యూఢిల్లీ, జులై 5:** ఇవాళ తేదీ జూలై 6.. జాతీయవాదం, నిస్వార్థ సేవ వంటి ఆదర్శాలకు ప్రాణమిచ్చే అసంఖ్యాక ప్రజానీకానికి ఇదొక ప్రత్యేక దినం. అంతులేని సాహసానికి, భరతమాతపై అత్యంత ఆరాధన భావనకు కాలాతీత నిదర్శనంగా నిలిచిన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి ఈరోజే. ఆధునిక భారతంలో మేధస్సు, ప్రజాసేవ, నైతిక విశ్వాసమనే లక్షణాల అద్భుత సమ్మేళనం ఇంతగా మూర్తీభవించిన ఆయన వంటి నాయకులు దేశంలో చాలా అరుదు.

సురక్షిత, సుఖవంతమైన జీవితానికి లోటు లేని బాల్యం ఆయనది. శ్యామా ప్రసాద్ తండ్రి, సర్ అశుతోష్ ముఖర్జీ సమకాలీన అగ్రశ్రేణి విద్యా వేత్తలలో మేధావులలో ఒకరు. అలాంటి సంపన్న కుటుంబంలో పుట్టినప్పటికీ సకల సౌఖ్యాలనూ వదులుకుని త్యాగం, జాతి సేవ దిశగా ఆయన అంతరాత్మ నడిపించింది. వలసవాదం, మత తత్వం, మానవతా సమస్యలు వంటివి కమ్ముకున్న నాటి కల్లోల కాలంలో ఒక మూగ ప్రేక్షకుని గా మిగిలిపోవడం తగదని ఆయన దృఢంగా విశ్వసించారు. ఈ ప్రస్థానంలో ఆయన తొలుత పసికందుగా ఉన్న బిడ్డను, ఆ తర్వాత భార్యను కోల్పోయారు. అంతటి తీవ్ర వ్యక్తిగత విషాదాలను చవిచూసినప్పటికీ దేశ సేవపై ఆయన సంకల్పం మరింత బలపడి, తిరుగులేని నిబద్ధతతో ముందుకే నడిపింది.

డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రజా జీవనాన్ని అన్నింటికన్నా ఎక్కువగా నిర్వచించిన ఆదర్శం ఏదైనా ఉందంటే అవిభాజ్య భారత్ దిశగా ఆయన దీక్ష. దేశ విభజన సంక్షోభ సమయాన పశ్చిమ బెంగాల్ భారత్‌లో అంతర్భాగంగా ఉండాలని ఆయన ప్రగాఢంగా ఆకాంక్షించారు. ఆనాడు దృఢంగా నిలబడిన ఆయన విశ్వాసమే కొన్నేళ్ల తర్వాత ఆయనను జమ్మూకాశ్మీర్ వైపు నడిపింది. ఆ క్రమంలో జైలుపాలైనా ఆ జీవితం ఆయన ఉత్సాహాన్ని నీరుగార్చలేక పోయింది. కారాగార ఏకాంతం ఆయనను ఎంతమాత్రం కుంగదీయ లేదు. ఏ ప్రజల ఆశయాన్ని తనదిగా చేసుకున్నారో వారికి అత్యంత దూరంగా, నిర్బంధంలోనే ఆయన జీవితం హఠాత్తుగా ముగిసింది. చరిత్రలో కొన్ని క్షణాలుంటాయి.. అంతిమ శ్వాసలోనూ ఒక వ్యక్తి త్యాగం రాజకీయాలకు అతీతంగా జాతీయ స్మృతిలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. అటువంటి క్షణాల్లో డాక్టర్ ముఖర్జీ జీవన ప్రస్థానం ఒకటిగా మిగిలింది. ఆచార్య వినోబా భావే చెప్పినట్లు తాను విశ్వసించిన ఆదర్శం కోసం డాక్టర్ ముఖర్జీ ఆత్మార్పణకు వెనుదీయలేదు. అటుపైన ఎన్నో ఏళ్ల తర్వాత 2019లో ఆర్టికల్ 370, 35(ఎ)ల రద్దు ఆయన అమరత్వానికి అత్యంత సముచిత నివాళి అనడంలో సందేహం లేదు.

డాక్టర్ ముఖర్జీ సదా దేశానికే ప్రథమ స్థానమిచ్చారు. భారతీయ విలువలకే పెద్ద పీట వేశారు. తదనుగుణంగా ఆనాటి సంప్రదాయ ఆలోచనలకు సవాలు విసురుతూ సంస్థల, వ్యవస్థలకు రూపమివ్వడం ద్వారా ఆయన ఈ లక్ష్యం సాధించారు. అత్యంత పిన్న వయసులోనే కోల్‌కత్తా విశ్వవిద్యాలయానికి ఉప కులపతి అయ్యారు. తనదైన శైలిలో, దేశభక్తి, భవిష్యత్ దృక్పథంతో



శ్యామా ప్రసాద్ ముఖర్జీ(ఫైల్)

కూడిన అనేక సానుకూల మార్పులు తెచ్చారు. ఓసారి విద్యావేత్తల సదస్సులో ప్రసంగించిన సందర్భంగా భవిష్యత్ గుమాస్తాలను, తక్కువ జీతాలు పొందేసిబ్బందిని ఉత్పత్తిచేసే కర్మాగారాలుగా విద్యా సంస్థలను చిన్న చూపు చూడటం తగదు. స్థానిక సంస్థలు, పురపాలక, రాష్ట్ర, కేంద్ర చట్టసభలను నడిపించగల ఉద్దండులుగా విద్యార్థులను మనం తీర్చిదిద్దాలి. అదే తరహాలో ఆర్థిక, వాణిజ్య,పారిశ్రామిక తదితర జనజీవన ప్రాధాన్య రంగాల వ్యవహారాలను నడిపించగల సమర్థులుగా తయారు చేయాలని కుండబద్దలు కొట్టారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ సారథ్యంలో కలకత్తా విశ్వవిద్యాలయం అనేకవిధాలుగా ముందంజ వేసింది. ఆయన హయాంలో గ్రంథాలయ మౌలిక సదుపాయాల మెరుగుదల, విజ్ఞానశాస్త్ర పరిశోధనలకు ప్రోత్సాహం, పురావస్తు అధ్యయనం, వ్యవసాయంలో కొత్త కోర్సులకు శ్రీకారం వంటి విశిష్ట కృషి కొనసాగింది. క్రీడలు, ఉపాధ్యాయ శిక్షణ, విద్యార్థుల సంక్షేమం తదితరాలపైనా ఆయన ఏక కాలంలో దృష్టి సారించారు. ప్రస్తుతపూర్వ విద్యార్థులలో తమ విశ్వవిద్యాలయంపై సగర్వ భావనను ప్రోదిచేస్తూ, ఏటా జనవరి 24న విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించే సంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు. విశ్వవిద్యాలయంపై ఒకపాట రాయాల్సిందిగా గురుదేవులు రవీంద్రనాథ్ టాగోర్‌ను ఆయన అభ్యర్థించారు.

## ప్రధాని నరేంద్ర మోడీ



ఈ స్ఫూర్తికి మరో ఉదాహరణ ఆయన జీవిత చరమాంకంలో కనిపిస్తుంది. అప్పట్లో భారతీయ జనసంఘ్‌ను రూపుదిద్దాలని నిర్ణయించుకున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రాభవం ఉచ్ఛస్థాయిలో ఉన్న సమయాన మనవైన సాంస్కృతిక మూలాలకు కట్టుబడుతూనే దేశ ప్రగతి కోసం గళం విప్పే ప్రత్యామ్నాయ స్వరం ఒకటి అవసరమని ఆయన భావించారు. అది ఓ చిన్న దివ్వెలాంటిదైనా పరవాలేదని భావించారేమో అన్నట్లుగా దాని చిహ్నంగా మట్టి దీపం గుర్తును డాక్టర్ శ్యామా ప్రసాద్ ఎంచుకోవడం గమనార్హం. ప్రమిద ఎంత చిన్నదైనా, దాని వెలుగు స్వల్పమే అయినా తన పరిధికి మించి చీకటిని పారదోలగల శక్తి దానికి ఉంటుందని భావించారు. తదనంతర క్రియాశీల మనుగడలోనూ జనసంఘ్ ఇదేవిధంగా ముందడుగు వేసింది. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీకి దేశ ప్రగతిపై గల అవగాహన ఎంతటిదో భారత తొలి పరిశ్రమలు పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఆయన పదవీకాలం వెల్లడిస్తుంది. ఒక రాజనీతిజ్ఞుడిగా, అసాధారణ నిజాయితీ, మానవతా దృక్పథం కలగలసిన నాయకుడుగా ఆయన సామర్థ్యం స్పష్టమవుతుంది.

ఈ సందర్భంగా నేనొక వ్యక్తిగత అనుభవాన్ని పంచుకోవాలని భావిస్తున్నాను. స్వావలంబనపై విస్పష్ట దార్శనికతతో డాక్టర్ ముఖర్జీ స్థాపించిన సింద్రీ కర్మాగారాన్ని అనేక దశాబ్దాల పాటు దేశాన్నేలిన పాలకులు నిర్లక్ష్యం చేశారు. ఈ నేపథ్యంలో దాని పునరుద్ధరణలో తోడ్పడే అవకాశం మా ప్రభుత్వానికి లభించడం నాకు దక్కిన గౌరవంగా నేనుభావిస్తున్నాను. ఆ కార్యక్రమంలో పాల్గొనడం నా జీవితంలోని అత్యంత ప్రత్యేక క్షణాలలో ఒకటిగా నిలిచిపోయిందంటే అతిశయోక్తి కాబోదు. పండిట్ నెహ్రూ 75 ఏళ్ల కిందటే భావ ప్రకటనా స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడితో సమానమైన తొలి రాజ్యాంగ సవరణను తెచ్చారు. దాన్ని డాక్టర్ ముఖర్జీ నిర్ద్వంద్వంగా వ్యతిరేకించారు. కాంగ్రెస్ మనోభావన ఏమిటో ఆయన పూర్తిగా అవగతం చేసుకున్నారు. అదే పూర్తిగా సరైనదని కూడా నిరూపితమైంది. అలనాడు.. 75 ఏళ్ల కిందట తొలి సవరణ తెచ్చిన వారే 1975లో ఎమర్జన్సీకి కూడా కారకులయ్యారు. అటుపైన 50 ఏళ్ల కిందట ఉదార ప్రజాస్వామ్య విలువల మూలాలపై మరోసారి దెబ్బకొడుతూ 42వ సవరణ చట్టం తెచ్చారు. మానవతా వాదాన్ని సమున్నతంగా నిలపడం లోనూ డాక్టర్ ముఖర్జీ ప్రత్యేక గుర్తింపు పొందారు. బెంగాల్లో 1943నాటి అత్యంత ఘోరమైన కరువు విజృంభించినపుడు ఆయన బాధితుల సేవలో పూర్తిగా నిమగ్నమయ్యారు. ప్రజలకు ఆహారం సమకూర్చడం కోసం అనేక స్వచ్ఛంద వంటశాలలు, సహాయ శిబిరాలు ఏర్పాటు చేసేలా అవిరళ కృషి చేశారు. ప్రజల దుస్థితి చూసి నిలు వెల్లా చలించిపోయిన ఆయన, వలస పాలకుల నిర్దాక్షిణ్య వైఖరిని తీవ్రంగా నిరసించారు. పంచషేర్ మన్వంతర్ పేరిట తాను రాసిన పుస్తకంలో తన ఆవేదనను వ్యక్తం చేశారు. అంతకుముందు 1942లో మేదినీపూర్‌ను ఒక మహా తుఫాను వణికించినపుడు పరిస్థితుల పునరుద్ధరణ దిశగా ఆయన కృషికి విస్తృత ప్రశంసలు లభించాయి. ఆరోజుల్లో కలకత్తాలోని ఓ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో యువతను ఉద్దేశించి మాట్లాడుతూ మీరు ఏ పని చేపట్టినా శ్రద్ధగా, క్షుణ్ణంగా, అర్థవంతంగా చేయండి. ఏ పనినీ అర్థాంతరంగా వదిలేయకండి అరకొర ఫలితంతో సంతృప్తి చెందకండి.. మీ అత్యుత్తమ కృషితో సత్ఫలితం సిద్ధించే దాకా పట్టువీడకండి” అనిడాక్టర్ ముఖర్జీ పిలుపునిచ్చారు.

దేశం ఇవాళ వికసిత భారత్ స్వప్న సాకారం దిశగా పురోగమిస్తున్న తరుణాన ఆయన ప్రగాఢంగా విశ్వసించిన శక్తి యుత, సమైక్య, ఆత్మవిశ్వాసపూరిత, కరుణార్ద్ర దేశ నిర్మాణానికి నిత్యం కృషి చేయడమే ఆయనకు మనం అర్పించగల అత్యుత్తమ నివాళి. ఈ నేపథ్యంలో నేటి యువత దృక్పథం గురించి నాకు బాగా తెలుసు కాబట్టి, నేటి సందర్భానికి తగినట్లు వారంతా డాక్టర్ ముఖర్జీ ఆశయాలకు న్యాయం చేసేందుకు అహరహం శ్రమిస్తారని నేను ప్రగాఢంగా



## బంగారు రామచరిత మానస్ అదశ్యంపై ఫిర్యాదు

**అయోధ్య,జులై 5:** అయోధ్య రామమందిరంలో విరాళాల దుర్వినియోగంపై దర్యాప్తు కొనసాగుతున్న తరుణంలోనే మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. తాను, తన కుటుంబం అత్యంత భక్తిశ్రద్ధలతో బహూకరించిన కోట్లాది రూపాయల విలువైన బంగారు పూత రామ చరితమానస్ గ్రంథం అదృశ్యం కావడంపై కేంద్ర మాజీ హోంశాఖ కార్యదర్శి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ వ్యవహారంపై ఆయన స్పష్టత కోరుతున్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్. లక్ష్మీనారాయణన్, ఆయన భార్య సరస్వతి కలిసి 2024 ఏప్రిల్‌లో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు ఒక అమూల్యమైన బహుమతిని సమర్పించారు. తులసీదాస్ రచించిన రామచరితమానస్‌లోని 10,902 శ్లోకాలతో కూడిన 522 పేజీలకు బంగారు పూత పూయించి, ఒక గ్రంథంగా రూపొందించారు.

సుమారు 147 కిలోల బరువున్న ఈ గ్రంథం విలువ దాదాపు రూ.4.5 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ గ్రంథాన్ని ఆలయంలో కొన్ని నెలల పాటు భక్తుల దర్శనార్థం ఉంచారని, ఆ తర్వాత ఎలాంటి సమాచారం లేకుండా దానిని అక్కడి నుంచి తొలగించారని లక్ష్మీనారాయణన్ ఆవేదన వ్యక్తం చేశారు. రామజన్మభూమి ఉద్యమంతో మా కుటుంబానికి ఆధ్యాత్మిక అనుబంధం ఉంది. నా దివంగత తల్లిఏళ్ల తరబడి రామనామాన్ని రాశారు. నా పదవీ విరమణ తర్వాత వచ్చిన సంపాదనతో శ్రీరాముడికి సేవగా ఈ కానుకను సమర్పించాను. దీని ద్వారా గుర్తింపు కోరుకోవడం లేదు, కేవలం పారదర్శకత మాత్రమే కావాలి. ప్రతిరోజూ దానికి పూజలు జరిగేవి, భక్తులు దర్శించుకునేవారు. అప్పుడు నేను చాలా సంతోషించాను. కానీ అకస్మాత్తుగా దాన్ని అక్కడి నుంచి తీసేశారని ఆయన వాపోయారు.

## హర్మ్మజ్ మీదుగా వచ్చే నౌకలకు సేవా రుసుం
### మిత్రదేశాలకు ప్రత్యేక రాయితీలు ఇరాన్‌ప్రతినిధి వెల్లడి

**బీజింగ్,జులై 5:** ప్రపంచ ఇంధన వాణిజ్యంలో అత్యంత కీలకమైన హర్మ్మజ్ జలసంధిలో ప్రయాణించే వాణిజ్య నౌకలపై సేవా రుసుములు వసూలు చేయనున్నట్లు ఇరాన్ ప్రకటించింది. అమెరికాతో కుదుర్చుకున్న 60 రోజుల ఉచిత ప్రయాణ ఒప్పందం ముగిసిన తర్వాత ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. కష్టకాలంలో తమకు మద్దతుగా నిలిచిన స్నేహపూర్వక దేశాలకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తామని తెలిపింది. చైనాలోని ఇరాన్ రాయబారి అబ్దొల్‌రెజా రహ్మానీ ఫజ్లీ బీజింగ్‌లో జరిగిన వరల్డ్ పీస్ ఫోరంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈ రుసుములను టోల్ ఫీజుగా పరిగణించరాదని, నౌకల భద్రత, ట్రాఫిక్ పర్యవేక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి సేవలు అందించినందుకు మాత్రమే వసూలు చేస్తున్నామని ఆయన వివరించారు.

## సిఎం విజయ్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు రూ.180 కోట్లు ఖర్చు!
### మాజీ మంత్రి సెంథిల్ బాలాజీపై పోలీసులు లుకౌట్ నోటీసులు



**చెన్నై,జులై 5:** తమిళనాడులో కొత్తగా ఏర్పాటైన సీఎం జోసెఫ్ విజయ్ (టీవీకే) ప్రభుత్వాన్ని పడదోసేందుకు కుట్ర జరుగుతోందన్న ఆరోపణలపై చెన్నై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసులో డీఎంకే మాజీ మంత్రి వి.సెంథిల్ బాలాజీ, ఆయన సోదరుడు ఆర్ వి.అశోక్ కుమార్‌లపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ప్రవేశపెట్టబోయే అవిశ్వాస తీర్మానంలో స్పీకర్‌కు వ్యతిరేకంగా ఓటు వేసేందుకు ఒక టీవీకే ఎమ్మెల్యేకు రూ. 35 కోట్లు ఆఫర్ చేసినట్లు వస్తున్న ఆరోపణలపై పోలీసులు వేట సాగిస్తున్నారు. ఈ కేసులో గతనెల 29న ఉత్తంగరై టీవీకే ఎమ్మెల్యే ఎన్. ఇళయరాజా ఫిర్యాదు చేశారు. ఒక ఒపీనియన్ పోలింగ్ సంస్థ అధినేతనని చెప్పుకుంటూ ఒక వ్యక్తి ఒక ప్రధాన రాజకీయ పార్టీ తరఫున తనకు కోట్ల రూపాయల లంచం ఆఫర్ చేశాడని, దాన్ని తిరస్కరించడంతో తన కుటుంబానికి ప్రాణహాని కలిగించేలా బెదిరింపులకు పాల్పడ్డాడని ఆయన ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ట్రిప్లికేన్ పోలీసులు ప్రధాన నిందితుడు తిరునావుక్కరసుతో పాటు ఆయన అనుచరులు నరేష్, త్యాగరాజన్ సహా ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వీరి విచారణలో ఈ కుట్ర అంతా సెంథిల్ బాలాజీ, అశోక్ కుమార్ల ప్రత్యక్ష ఆదేశాల మేరకే జరిగినట్లు తేలిందని పోలీసులు వెల్లడించారు. సెంథిల్ బాలాజీని సోమవారం విచారణకు హాజరుకావాలని కరూర్ జిల్లా రామేశ్వరపట్టిలోని సెంథిల్ బాలాజీ పూర్వీకుల నివాసంలో సమన్లు కూడా జారీ చేశారు. శాసనసభ్యులను ప్రలోభపెట్టేందుకు ఏకంగా రూ. 180 కోట్లు కేటాయించారని దర్యాప్తులో తేలడంతోపరారీలో ఉన్న నిందితుల కోసం కరూర్, తిరుచిరాపల్లి, కోయంబత్తూర్, బెంగళూరులలో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఎలాంటి స్వతంత్ర ఆధారాలు లేకుండా కేవలం కాల్ డేటా ఆధారంగానే తనను ఇరికిస్తున్నారంటూ అశోక్ కుమార్ ముందస్తు బెయిల్ కోసం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు.

# ఒక్క దెబ్బతో అందర్నీ లేపేయొచ్చు..
### ఖమేనీ అంత్యక్రియలపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



**టెహ్రాన్, జులై 5:** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీఖమేనీ అంత్యక్రియలతో ఆ దేశం శోక సంద్రంలో మునిగిపోయింది. అమెరికా-ఇరాన్ యుద్ధం మొదలైన సమయంలోనే ఖమేనీని అమెరికా బలగాలు హతమార్చాయి. అయితే, ఈ అంత్యక్రియలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఖమేనీ అంత్యక్రియలకు ఇరాన్ అగ్రనేతలంతా ఒకేచోట చేరారని, తలచుకుంటే ఒక్క దాడితో వారందరినీ హతమార్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం దౌత్య చర్చలు కొనసాగుతున్నందున అలాంటి చర్య తీసుకోవడం లేదని చెప్పడం చర్చనీయాంశమైంది. అమెరికా మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ 'అందరూ ఒకేచోట ఉన్నారు. ఒక్క దాడి చేస్తే అందర్నీ అంతం చేయొచ్చు. కానీ అలా చేయం. ఎందుకంటే అలా చేస్తే చర్చలు జరిపేందుకు ఎవరూ మిగలరు' అని వ్యాఖ్యానించారు. ఖమేనీ అంత్యక్రియల్లో వేలాది మంది ప్రజలు పాల్గొని నివాళులర్పించడంపై కూడా ట్రంప్ వ్యాఖ్యానించారు. ఖమేనీని ఇరాన్ ప్రజల్లో చాలా మంది వ్యతిరేకిస్తారని తాను భావించానని, అయితే భారీ సంఖ్యలో ప్రజలు దుఃఖించడం తనను ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. 'అవి నిజమైన కన్నీళ్లు కాకపోవచ్చు.. నకిలీ కన్నీళ్లు కూడా కావచ్చు' అని ట్రంప్ వ్యాఖ్యానించినట్లు అక్సియోస్ పేర్కొంది. ఇరాన్ అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తోందని కూడా ట్రంప్ అన్నారు. వాళ్లు ఒప్పందం కోసం వేడుకుంటున్నారు అని పేర్కొన్న ఆయన, అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ఇరు దేశాలు వారం రోజుల పాటు చర్చలు, సైనిక చర్యలను తాత్కాలికంగా నిలిపివేయాలని అంగీకరించాయని తెలిపారు. అయితే, ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఆర్మేనియాలోని ఇరాన్ రాయబార కార్యాలయం ఎక్స్ వేదికగా స్పందిస్తూ 'మీకు నాగరికత లేదు.. చరిత్ర లేదు.. గౌరవం లేదు. అందుకే ఇలాంటి విషయాలు మీకు అర్థం కావు' అంటూ ట్రంప్‌పై తీవ్రవిమర్శలు చేసింది. టెహ్రాన్‌లో నిర్వహించిన ఖమేనీ అంత్యక్రియలకు వేలాది మంది ప్రజలు హాజరయ్యారు. ఇరాన్ జెండాలు ఊపుతూ, ఖమేనీ చిత్రపటాలతో ప్రజలు నివాళులర్పించారు. ఖమేనీతోపాటు ఆయన కుటుంబసభ్యుల శవపేటికలను కూడా ప్రజల సందర్శనార్థం ఉంచారు.

ఖమేనీ మరణం తర్వాత ఆయన వారసుడిగా బాధ్యతలు చేపట్టిన కుమారుడు మోజ్తాబా ఖమేనీ ఇప్పటివరకు ప్రజల ముందుకు రాలేదు. ఇటీవల జరిగిన దాడిలో ఆయన కూడా గాయపడినట్లు సమాచారం ఉన్నప్పటికీ, దీనిపై ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.




## మెటాకు కేంద్ర ఐటిశాఖ నోటీసులు

**న్యూఢిల్లీ,జులై 5:** సోషల్ మీడియా దిగ్గజం మెటాకు చెందిన ఇన్‌స్టాగ్రామ్‌లో బాలల లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన కంటెంట్ (సీఎస్ఈఏఎం) చెల్లింపు ప్రకటనల రూపంలో ప్రత్యక్షం కావడంపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారంపై మెటాకు శనివారం నోటీసులు జారీ చేసిన కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ వారం రోజుల్లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని ఆదేశించింది. నిర్దేశిత గడువులోగాస్పందించకుంటే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్టం, పోక్సో చట్టం2012 కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ ఆరోపణలపై మెటా ప్రతినిధి స్పందిస్తూ, సీఎస్ఈఏఎం విషయంలో తమ సంస్థ జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తుందని తెలిపారు. ఇలాంటి కంటెంట్‌ను, దానిని వ్యాప్తి చేసే నేరగాళ్లను గుర్తించడానికి మేము అధునాతన ఏఐ టెక్నాలజీని ఉపయోగిస్తున్నాము. అయినప్పటికీ, 350 కోట్లకు పైగా ఉన్న మా వినియోగదారులలో దాగి ఉన్న నేరగాళ్లతో మా పోరాటం నిరంతరం కొనసాగుతూనే ఉంది. మా నిపుణుల బృందాలు రక్షణ వ్యవస్థలను ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తూనే ఉన్నాయని ఈమెయిల్ సమాధానంలో పేర్కొన్నారు.

## 3వేలకు పెరిగిన వెనెజులా మృతులు

**కారకాస్, జులై 5:** వెనుజులా భూకంపం ఆ దేశానికి తీరని విషాదాన్ని మిగిల్చింది. గత నెలలో సంభవించిన రెండు వరుస భూకంపాల వల్ల దాదాపు మూడు వేల మంది మరణించినట్లు అంచనా. ఇప్పటికే 2,954 మందికిపైగా మృతదేహాల్ని సహాయక బృందాలు వెలికితీశాయి. మరోవైపు సహాయక చర్యలు కూడా ముగింపు దశకు చేరుకున్నాయి. ముఖ్యంగా విదేశీ సహాయక బృందాలు వెనుజులాను వీడుతున్నాయి. గత జూన్ 24న వెనుజులాలో వరుసగా రెండు భూకంపాలు సంభవించాయి. దక్షిణ కారకాస్ ప్రాంతంలో 7.2 తీవ్రతతో ఒక భూకంపం, 7.5 తీవ్రతతో మరో భూకంపం సంభవించాయి. దీంతో అనేక బిల్డింగులు సహా నిర్మాణాలు నేలకూలాయి. 72 గంటల్లో ఎక్కువ మందిని బతికించడానికి రెస్క్యూ బృందాలు ప్రయత్నిస్తాయి. అయితే, భూకంపం సంభవించి దాదాపు 9రోజులు కావడంతో సహాయక చర్యల్నినెమ్మదిగా కొనసాగిస్తున్నారు. ఎందుకంటే ఈ సమయంలో బాధితులు బతికి ఉండే అవకాశాలు చాలా తక్కువ.

# సంక్షిప్త వార్తలు

## బంకిపూర్ నుంచే ప్రశాంత్ కిశోర్ పోటీ..




**పాట్నా,జులై 5:** ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నారు. బీహార్‌లోని బంకిపుర్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికలో ఆయన పోటీ చేయనున్నట్లు జన్ సురాజ్ పార్టీ (జేఎస్‌పి) చీఫ్ మనోజ్ భారతి ఆదివారం ప్రకటించారు. దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానం నుంచి కిశోర్ బరిలో దిగుతుండటంతో ఆయన రాజకీయ అరంగేట్రంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లడంతో ఈ ఉపఎన్నిక అనివార్యమైంది.

## కోల్‌కతాలో అదానీ 2వేల పడకల ఆసుపత్రి




**కోల్‌కతా, జులై 5:** పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ ఆరోగ్యరంగంలో మరో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా సమీపంలోని న్యూటౌన్ ప్రాంతంలో 2,000 పడకల సామర్థ్యంతో ఒక అత్యాధునిక ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు. ఇందులో సగంపడకలను అంటే 1,000 బెడ్లను పేదరోగులకు పూర్తిగాఉచితంగా కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. తన నియోజకవర్గం భవానీపూర్‌లో పౌరసమాజ ప్రతినిధులతో జరిగిన ఒక సమావేశంలో సీఎం మాట్లాడారు.

## పాండవానీ జానపద కళాకారిణి తీజన్‌బాయి కన్నుమూత



**రాయ్‌పూర్,జులై 5:** ప్రఖ్యాత పాండవానీ జానపద కళాకారిణి, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత తీజన్ బాయి (70) కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోభారంతో తలెత్తిన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, రాయ్‌పూర్‌లోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె మరణంతో భారతీయ జానపద కళారంగంలో ఒక సువర్ణ అధ్యాయం ముగిసినట్లయింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన తీజన్ బాయి, మహాభారత గాథలను తనదైన శైలిలో గాత్రం, అభినయంతో ఆవిష్కరించి అంతర్జాతీయ గుర్తింపు పొందారు.

## టిఎంసి మాజీ ఎమ్మెల్యేపై లైంగిక దాడి ఫిర్యాదులు



**కోల్‌కతా,జులై 5:** పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే షౌకత్ మొల్లాపై కొత్తగా లైంగికదాడి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇప్పటికే ఓ బాంబు పేలుడు కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఆయనపై ఇద్దరు మహిళలు ముందుకు వచ్చి సంచలన ఆరోపణలు చేశారు. షౌకత్, అతడి అనుచరులు తమపై అత్యాచారం, చిత్రహింసలకు పాల్పడ్డారని వారు మీడియా ముందు వాపోయారు. 2019లో షౌకత్ మొల్లా తన కొడుకును కిడ్నాప్ చేసి, ఏడాది పాటు నిర్బంధంలో ఉంచారని బాధిత మహిళ ఆరోపించారు.

## ట్రంప్‌కు ప్రధాని మోడీ స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ,జులై 5:** అమెరికా సంయుక్త రాష్ట్రాల 250వ స్వాతంత్ర్య దినోత్సవ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, ఆ దేశ ప్రజలకు మరియు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు భారత ప్రధాని నరేంద్ర మోడీ శుభాకాంక్షలు తెలిపారు. 140 కోట్ల మంది భారతీయుల తరఫున ఈ అపూర్వ మైలురాయిని పురస్కరించుకుని అభినందనలు తెలియజేస్తున్నట్లు ఆయన సోషల్‌మీడియా వేదికగా పేర్కొన్నారు. రాబోయే 250 ఏళ్లలో అమెరికా మరింత ప్రగతిని సాధించాలని ఆకాంక్షిస్తూ, రెండు దేశాల మధ్య భాగస్వామ్యం నూతన శిఖరాలకు చేరుకోవాలని

## ఎల్ఎన్జీ సరఫరా పునరుద్ధరణతో ఆంక్షలు ఎత్తివేసిన కేంద్రం

**న్యూఢిల్లీ, జులై 5:** అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు తగ్గి, పశ్చిమ ఆసియాలో కాల్పుల విరమణ అమల్లోకి రావడంతో భారత్‌కు లిక్విడ్ నేచురల్‌గ్యాస్ సరఫరా మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం గతంలో అమలు చేసిన అత్యవసర సహజ వాయువు సరఫరా నియంత్రణ ఉత్తర్వులను అధికారికంగా ఉపసంహరించుకుంది. ఈ నిర్ణయంతో ఎల్ఎన్జీపై ఆధారపడిన పరిశ్రమలకు పెద్ద ఊరటలభించింది. కాల్పుల విరమణ అమల్లోకి రావడంతో నౌకలరవాణా తిరిగి సాధారణ స్థితికి చేరుకుంది. ఈ నేపథ్యంలో పెట్రోలియం అండ్ సహజ వాయువుల మంత్రిత్వశాఖ తాజా నోటిఫికేషన్ జారీ చేస్తూ అత్యవసర ఆంక్షలను ఎత్తివేసింది.

6-7Pg6exHMNWJQE_6-7Pg6exHMNWJQE.qxd 05/Jul/26 10:59 PM Page 1



## ఆదర్శనీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్

**● బంజారా ఏక్త సంకల్ప్ యాత్రను ప్రారంభించిన మంత్రి**



**గుత్తి, జులై 5 ప్రభాతవార్త:** బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ ఆదర్శనీయులని ఆయన ప్రబోధనలు ప్రజలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని సేవాలాల్ జన్మస్థలమైన సేవాఘడ్‌లో ఆదివారం సేవాలాల్ మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన భారత్ బంజారా ఏక్త సంకల్ప్ యాత్రను ఆయన ప్రారంభించారు. అంతకుముందు రాష్ట్ర మాజీ మంత్రి రఘువీరారెడ్డి, స్థానిక మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్తాలు ఆలయంలో ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం మాత జగదాంబ ఆలయం, సేవాలాల్ మహారాజ్ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 18వ శతాబ్దంలో సేవా లాల్ మహారాజ్ బంజారాల్లో మార్పు తెచ్చేందుకు చేసిన కృషిని కొని యాడారు. ఒక సంఘసంస్కర్తగా, ఆధ్యాత్మికవేత్తగా ప్రజలకు విద్య క్రమశిక్షణ ఆర్థిక స్వావలంబన, మద్యపాన నిషేధం పట్ల అవగాహన కల్పించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. నైతిక సేవాతత్పరత సేవాలాల్‌కే దక్కుతుం దన్నారు. సేవాఘడ్‌లో ప్రారంభమైన ఈ యాత్ర 14 రాష్ట్రాల మీదుగా ఏడు వేల కిలోమీటర్ల మేర 21 రోజులపాటు కొనసాగి ఢిల్లీ చేరుకుంది. బంజారా భాషను అధికారికంగా 8వ షెడ్యూల్లో చేర్చాలని, బంజారా యూనివర్సిటీ సేవాఘడ్‌లో ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో ఈ యాత్ర కొనసాగ నుంది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు జగన్నాథరావు, మహారాజ్ ధర్మాధికారి, బాబుసింగ్, కిషన్ రాథోడ్, ఉమేష్ జాదవ్, రవీందర్, శేఖర నాయక్, బాలా నాయక్, శ్రీరాములు నాయక్, తిప్పయ్య నాయక్, చక్రి నాయక్, ఆంజనేయులు, నరేంద్ర రాథోడ్, శివకుమార్ నాయక్, మల్లికార్జున నాయక్, అశ్వర్థ నాయక్, భారతిప్రసాద్, పురుషోత్తమాచార్యులు, బిజెపి నాయకులు, బంజారా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో పోటీ చేసి తప్పు చేసా

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** తాజా రాజకీయాలపై జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేసారు. తాను జీవితంలో చేసిన పెద్ద తప్పు ఏదైనా ఉందంటే.. అది ఈ దఫా ఎన్నికల్లో ఎమ్మెల్యే గా పోటీ చేయటం అంటూ వ్యాఖ్యానించారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌లో ఆ తరువాత టిడిపిలో పనిచేసిన బుద్ధప్రసాద్ 2024 ఎన్నికల్లో జనసేన నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2014-19 కాలంలో డిప్యూటీ స్పీకర్‌గానూ పని చేసారు. వివాద రహితుడుగా పేరు ఉన్న బుద్ధప్రసాద్ ప్రస్తుత రాజకీయాలపైన చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్య మాల్లో విస్తృతంగా ప్రసారమవుతున్నాయి. విజయ వాడలో శనివారం రోశయ్య విగ్రహావిష్కరణ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేసారు. రోశయ్య వంటి మహానుభావుల సరసన నిలబడి రాజకీయాలు చేసామని, ఈ రోజు ఎలాంటి రాజకీయాల్లోకి వెళ్తున్నామో అర్థం కావటం లేదని వ్యాఖ్యానించారు.

రాజకీయాల్లో ఎందుకు ఉన్నామా అని నిత్యం బాధ పడాల్సి వస్తుందన్నారు. రోశయ్యకు ఇతరులను ఎలా గౌరవించాలో తెలుసని, ఇప్పటి నాయకుల భాష వాడలేదని చెప్పుకొచ్చారు. సిద్ధాంత పరంగా వ్యతిరేకించారే కానీ, వ్యక్తిగత విమర్శ లు చేయలేదని చెప్పారు. రాజకీయాలు కలుషి తమైన తరుణంలో రోశయ్య విగ్రహం ద్వారా స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. సభా వేదిక పైన ఉన్న బిజెపి ఎమ్మెల్యే సుజనా చౌదరి సైతం ఇలాగే బాధ పడుతున్నారని బుద్ధప్రసాద్ తెలిపారు. దివంగత ఎన్టీ రామారావుతో అసెంబ్లీలో తీవ్రంగా విభేదించినప్పటికీ, వారి మధ్య వ్యక్తిగత అనుబంధం గొప్పగా ఉండేదని ఓ సంఘటనను వివరించారు. తన వివాహానికి హాజరైన ఎన్టీఆర్, రోశయ్యను తన పక్కనే కూర్చోబెట్టుకుని ఆప్యాయంగా ముచ్చటించారని చెబుతూ బుద్ధప్రసాద్ భావోద్వేగానికి గురయ్యారు. ప్రస్తుత రాజకీయాల తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

"రోశయ్య వంటి మహానుభావులతో కలిసి మేం గౌరవప్రదమైన రాజకీయాలు చేశాం. కానీ ఇప్పుడు ఎలాంటి వికృత రాజకీయాల్లోకి వెళ్తున్నామో అర్థం కావడం లేదు. అసలు ఈ రాజకీయాల్లో ఎందుకు కొనసాగుతున్నామా అని రోజూ బాధపడాల్సి వస్తోంది" అని ఆవేదన వెళ్లగక్కారు. వేదికపై ఉన్న బిజెపి ఎమ్మెల్యే సుజనా చౌదరిని ఉద్దేశిస్తూ, ప్రస్తుత పరిస్థితులను చూసి ఆయన కూడా తనలాగే లోలోపల మదనపడుతున్నారని వ్యాఖ్యానించారు. కలుషితమైన ఈ తరుణంలో రోశయ్య విగ్రహం సమాజానికి స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు.



**● జనసేన శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్**

గత వైసిపి ప్రభుత్వంపై కూడా బుద్ధప్రసాద్ విమర్శలు చేశారు. అవనిగడ్డలో రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం అనుమతులు ఇవ్వకుండా అడ్డుపడిందని ఆరోపించారు. "ఆనాడు నేను ఒక శపథం చేశాను. మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచి, అవనిగడ్డలో రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన తర్వాతే ఇతర పనులు చేపడతానని మాటిచ్చాను. ఈ రోజు వాసవీ ఫౌండేషన్ చొరవతో విజయవాడలో ఈ విగ్రహావిష్కరణ జరగడం, నా సంకల్పం నెరవేరడం ఎంతో సంతోషాన్నిస్తోంది" అని వివరించారు. రాజకీయాల్లో హుందాతనం లేని పరిస్థితులు ఇప్పుడు ఏర్పడ్డాయని బుద్ధప్రసాద్ వ్యాఖ్యానించారు.



# సాహితీ సవ్యసాచి డాక్టర్ శాంతి నారాయణ

**● 80 వసంతాల అక్షర హాలికుడి జీవిత, సాహిత్య సదస్సులో వక్తలు**

ఉద్యమకారుడిగా బహుముఖ సేవలు అందిస్తున్న డాక్టర్ శాంతినారాయణ నిరంతర స్ఫూర్తిదాత అని పేర్కొన్నారు. అనంత సాహిత్యకారులు, సాహిత్య మిత్రుల ఆధ్వర్యంలో ఆదివారం "80 వసంతాల అక్షర హాలికుడు డా.శాంతి నారాయణ జీవిత, సాహిత్య సదస్సు" ఆర్డిటి ఎకాలజీ సెంటర్‌లో ఘనంగా సాగింది. ప్రముఖ కవి, కథా రచయిత, సాహిత్య విశ్లేషకుడు జి.వెంకటకృష్ణ సదస్సుకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎకాలజీ డైరెక్టర్ వై.వి. మల్లారెడ్డి, కవి, కథా, నవలా రచయిత సడ్లపల్లి చిదంబర రెడ్డి హాజరై మాట్లాడారు. శాంతి నారాయణ సాహిత్యంలోని వివిధ అంశాలపై పలువురు వక్తలు ప్రసంగించారు. ప్రముఖ సాహిత్య విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, ప్రముఖ కథా, నవలా రచయిత మారుతి పౌరోహితం, ప్రముఖ సాహిత్య విమర్శకులు డాక్టర్ కె.నాగేశ్వరాచారి, ప్రముఖ కథా రచయిత ఉప్పరపాటి వెంకటేశులు, ప్రముఖ సాహిత్య విమర్శకులు డా. యమునారాణి మాట్లాడారు.

వైవి మల్లారెడ్డి ఆర్‌ఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వై.వి మల్లారెడ్డి మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా సామాజిక, వ్యవసాయ సమస్యల పట్ల రచయిత ప్రజాగొంతుకగా నిలిచారని చెప్పారు. సడ్లపల్లి చిదంబర రెడ్డి మాట్లాడుతూ, కథా రచనలో ప్రాంతీయ యాసకు పట్టం గట్టారని గుర్తుచేశారు. ఆచార్య రాచపాలెం మాట్లాడుతూ కల్తీ లేని, రాజీలేని భౌతికవాద రచయిత శాంతి నారాయణ అని చెప్పారు. ఆత్మగౌరవ దృక్పథంతో ప్రశ్నించే ధైర్యమున్న విశ్వసనీయ రచయిత శాంతి నారాయణ అన్నారు. ఉప్పరపాటి వెంకటేశులు మాట్లాడుతూ కష్టాలు కన్నీళ్ల మధ్య గడిచిన బాల్యం నుంచి, నిరంతర కృషి, పట్టుదలతో ఎదిగిన చైతన్యశీలి శాంతి నారాయణ అన్నారు. పౌరోహితం మారుతి మాట్లాడుతూ, రాయలసీమ మండలికానికి పెద్దపీట వేసిన రచయిత శాంతి నారాయణ అన్నారు. ఆయన జీవితంలోని, అన్ని సామాజిక దశలు తన రచనల్లో ప్రతిబింబిస్తాయని చెప్పారు. డాక్టర్ నాగేశ్వరాచారి మాట్లాడుతూ.. తనను తాను సంస్కరించుకున్న రచయిత శాంతి నారాయణ అన్నారు. ఆయన కథలు, నవలల్లో సామాజిక పరిణామ క్రమం కనిపిస్తుందన్నారు. యమునారాణి మాట్లాడుతూ.. స్త్రీ పాత్రలను సమున్నతంగా చిత్రీకరించిన రచయిత శాంతి నారాయణ అన్నారు. చైతన్యం, ఆత్మగౌరవం గల పాత్రలతో మహిళా పక్షపాతిగా నిలబడ్డారని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ మాజీ విసి ప్రొఫెసర్ కుసుమ కుమారి, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కొండ్ర సుధాకర్ బాబు, ప్రొ. ఏవీ రమణ, సోషియాలజీ విభాగాధిపతి ప్రొ.జి.వి.రమణ, కదలిక ఇమామ్, సెరా కుళ్లాయిస్వామి, సీనియర్ రచయిత్రి షహనాజ్, అరసం రాష్ట్ర కార్యవర్గసభ్యులు, ఏపీ గ్రంథాలయ పరిషత్ పూర్వ సభ్యులు, కవి గుత్తా హరి సర్వోత్తమ నాయుడు, బి.ఈశ్వర రెడ్డి, జింకా సుబ్రహ్మణ్యం, ఎస్.ఎం.భాష, తరిమెల అమరనాథ్ రెడ్డి, జెట్టి జైరామ్, గోసల నారాయణ స్వామి, వన్నప్ప, అమరేంద్ర, డా.పూజారి ఈరన్న, చెట్ల ఈరన్న, ద్విభాషా కవి డా. జూటూరి షరీఫ్, రియాజుద్దీన్, వన్నప్ప, టివి రెడ్డి పాల్గొన్నారు.

# కాణిపాకంలో భక్తుల రద్దీ... దర్శనానికి 4 గంటల సమయం

**కాణిపాకం, జులై 5 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కాణిపాకం కిటకిటలాడింది. సాధారణంగా ఆలయంలో వారాంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. గత నాలుగు రోజులుగా ఆలయంలో రద్దీ కొనసాగుతోంది. ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి



నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అలాగే ఆలయ క్యూలైన్లు వద్ద భక్తులకు దేవస్థానం తరపున ఉచితంగా మజ్జిగ, త్రాగునీరు, సాంబారు

# ఎస్‌సి బాలికల హాస్టల్స్‌ను సందర్శించిన మంత్రి డిబివి స్వామి

**కావలి (నెల్లూరు), జులై 5 ప్రభాతవార్త:** కావలి ఆర్డీఓ కార్యాలయం వద్ద ఉన్న సాంఘీక సంక్షేమశాఖ బాలికల వసతి గృహాన్ని ఆదివారం రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ నందు బాలికలకు వసతులు, భోజన సందుపాయాలు, పరిశుభ్రతపై విద్యార్థులను విచారించి అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వం నుంచి యూనిఫామ్స్, బుక్స్, బెడ్‌షీట్లు, రగ్గులు, పెట్టెలు, ఇతర అవసరమైన సామాగ్రిపై అవసరమైన వాటిపై గురించి తెలిపి ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు ఫోన్ మంత్రితో మాట్లాడుతూ సిఎస్‌ఆర్ పండ్‌చే హాస్టల్ పిల్లలకు బంకర్ బెడ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు ఏ రోజు పాఠ్యాంశాలు ఆరోజే చదివించాలని పిల్లలందరూ పరిశుభ్రంగా ఉంటేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని వార్డన్లను ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద గౌరవంగా మెలగాలని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రీడాస్ఫూర్తిని కలిగి



ఉండాలన్నారు. ఆదివారం వినోదం కోసం టీవిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సోషల్ వేల్ఫేర్ డిడి శోభారాణి, హాస్టల్ వార్డెన్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# సెల్‌ఫోన్ చార్జర్ పేలి భారీ అగ్నిప్రమాదం

**తవణంపల్లె, జులై 5 ప్రభాతవార్త:** సెల్‌ఫోన్ చార్జర్ పేలి ఇంట్లో భారీ అగ్ని ప్రమాదం సంభవించిన సంఘటన చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలంలోని ఎగువ వెంకటాపురం గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి వివరాలిలా వున్నాయి. మండలంలోని ఎగువ వెంటాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మునిరత్నంశెట్టి కుమారుడు సేతు రామన్ అనే వ్యక్తి తన ఇంట్లో సెల్‌ఫోన్ శనివారం రాత్రి చార్జర్ పెట్టాడు. ఈనేపథ్యంలో ఆదివారం తెల్లవారు జామున సుమారు 5 గంటలకు సెల్‌ఫోన్ చార్జర్ తీసుకుని చార్జర్ స్విచ్ ఆఫ్ చేయకుండా ఇంటికి తాళాలు వేసి కాణిపాకం వెళ్ళినట్లు గ్రామస్థులు తెలిపారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో చార్జర్ ఒక్కసారిగా పేలిపోవడంతో ఇంట్లో మంటలు చెలరేగి ఇల్లంతా వ్యాపించాయి. దీనితో ఇంట్లో వున్న వస్తువులు, గృహోపకరణాలు, నగదు బట్టలు, పట్టుచీరలు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈమేరకు ఇంట్లో దాచి వుంచిన 90 వేల రూపాయల నగదు, పట్టుచీరలు, కొత్త ఇంటి నిర్మాణం కోసం కొనుగోలు చేసి భద్రపరచిన ఎలక్ట్రికల్ సామాగ్రి, ట్రంకు పెట్టెలో దాచి వుంచిన నగదు, పట్టు చీరలు వంటివి పూర్తిగా కాలిపోయాయి. ఈవిషయాన్ని గమనించిన చుట్టుపక్కల ఇళ్ళవారు ఇంటి తాళాలు పగులగొట్టి మంట లను అదుపుచేశారు. ఈప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

## నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి

**తిరుపతి, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుండి 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమాన్ని ఎస్‌పిడిసిఎల్ నిర్వహించనుంది. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు.

# ప్రకాశం జిల్లాలో ఫ్యాన్.. డీలా..!

**● సైకిల్ జోరు... రెండేళ్ల పాలనలో టిడిపికి పెరిగిన ఆదరణ**

**ఒంగోలు, జులై 5 ప్రభాతవార్త:** ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వైసిపి పరిస్థితి ఆశించిన స్థాయిలో లేదని ఆ పార్టీ అంతర్గత సర్వేలు స్పష్టం చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగు తుంది. 2024 ఎన్నికల్లో ఎదరైన పరాజయం తరువాత పార్టీ బలోపేతానికి ప్రయత్నాలు చేస్తున్నప్పటికి జిల్లాలోని ఎక్కువ నియోజకవర్గాల్లో ఫ్యాన్ వేగం మరింత మందగించినట్లు సమాచారం. అధికార కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతున్నా దానిని వైసీపీ నియోజక వర్గాల్లో తమకు అనుకూలంగా మలుచుకోవ డం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దర్శి, యర్రగొండపాలెం, మార్కాపురం, కందుకూరు మినహా మిగిలిన నియోజక వర్గాల్లో పార్టీ ప్రభావం ఊపందుకోలేదని సర్వే నివేదికలు పేర్కొన్నట్లు సమాచారం. మరో వైపు అధికార తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులపై ప్రజల్లో ఆదరణ తగ్గలేదని తెలుస్తోంది. ముఖ్యంగా ఒంగోలు, సంతనూతలపాడు, అద్దంకి, కొండపి, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లో టిడిపి బలపడగా వైసిపి క్యాడర్‌లో నిరుత్సాహం పెరిగినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉమ్మడి ప్రకాశం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. 2029 ఎన్నికల నాటికి పార్టీని మళ్లీ కంచుకోట స్థాయికి తీసు కెళ్లేందుకు అధిష్టానం కార్యచరణ రూపొంది స్తున్నట్లు తెలుస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టంగా తయారైందని 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పదికి పది స్థానాలు గెలుచుకుని వైసిపి సత్తా చాటుకుంటామని ఆ పార్టీ పెద్దలు గడిచిన రెండేళ్లుగా పదే పదే చెప్తూ వస్తున్నారు. అయితే వాస్తవానికి జిల్లాలో భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల సమయం కంటే ప్రస్తుతం ఫ్యాన్ మరింత డీలా పడినట్లు కనిపిస్తుంది. వైసిపి ఎన్నికల సమయంలో కంటే ప్రస్తుతం మరింత బలహీన పడినట్లు ఆ పార్టీ సొంత సర్వేల్లోనే బయటపడినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో, నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితి గతులపై స్థానిక నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల పని తీరుపై వైసిపి అధిష్టానం రహస్య సర్వేను నిర్వహించింది. ఆ సర్వే నివేదికలు వైసిపి పెద్దలను మరింత ఆందోళనకు గురి చేస్తు న్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రభుత్వంపై ఖచ్చితంగా వ్యతిరేకత ఉంటుంది. స్థానికంగా ప్రధాన ప్రతిపక్ష నేతల పాత్రలను బట్టి ఆ నియోజక వర్గాల ప్రతిపక్ష పార్టీ బలం పెంచుకోవడంతో పాటు అధికార పక్షంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుంది. అయితే జిల్లాలో మాత్రం అందుకు పూర్తిగా భిన్నంగా ఫ్యాన్ వేగం పూర్తిగా తగ్గినట్లు సర్వే నివేదికల్లో బయట పడినట్లు సమాచారం. పది నియోజకవర్గాల్లో కేవలం దర్శి నియోజకవర్గంలో మాత్రం ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పుంజుకున్నట్లు సర్వేలో తేలింది. యర్రగొండపాలెం సిట్టింగ్ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పరిస్థితి కూడా భాగానే ఉందని సర్వేలో తేలింది. మార్కాపురం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు దూకుడు పెంచడంతో ప్రతి కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఆయన సఫలీకృతులయ్యారు. ఆయన అధికార పార్టీకి ధీటుగా సమాధానం చెప్తున్నారు. కందుకూరు వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌రావు కూడా ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నడుపుతుండడంతో పాటు అధికార పక్షాన్ని ఇరకాటంలో పెట్టడంలో తన సాయశక్తుల కృషి చేస్తున్నారు. మిగిలిన ఆరు నియోజక వర్గాల్లో వైఎస్సార్‌సిపి పరిస్థితి ఆశాజనకంగా లేదు. గిద్దలూరులో అయితే అధికార పార్టీపై వ్యతిరేకత భావం ఉన్నప్పటికి వైఎస్సార్‌సిపి ఇన్‌చార్జి తూతూ మంత్రంగా వచ్చిపోతున్నారే తప్ప అక్కడ కార్యకర్తలకు అందుబాటులో ఉండడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2024లో సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు ఉంటే 10 అసెంబ్లీస్థానాలను ఒంగోలు లోక్‌సభ స్థానాన్ని కూటమి సొంతం చేసుకుంది. వైసిపి నుంచి బరిలో దిగిన సిట్టింగ్ ఎమ్మెల్యే లు, మాజీ ఎమ్మెల్యేలు ఓటమి చవిచూశారు. గడిచిన 24 నెలల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లి వైసీపీని మరింత బలోపేతం చేయడంతో పాటు స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు తీసుకునే ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ఎప్పటికప్పుడు ఆందోళనలు చేస్తూ ఫ్యాన్ వేగాన్ని పెంచా ల్సిన ఆ పార్టీ ముఖ్య నాయకులు కొన్ని నియోజకవర్గాల్లో తమ కార్యకలాపాలను తగ్గించేశారు. ఫలితంగా జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అధికార టిడిపికి మరింత ఆదరణ పెరిగింది.

ఒంగోలు నగరం నుంచి దామచర్ల జనార్ధన్‌రావు, ఎన్నికల సమయం కంటే ప్రస్తుతం మరింత బలంగా కనిపిస్తున్నారని సర్వే నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో వైసిపికి బలమైన నాయకుడు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వైసిపికి రాజీనామా చేసి జనసేనలో చేరడం కూడా వైసిపికి తీవ్ర నష్టమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయన వైసిపిలో ఉంటే పార్టీకి ఎంతో బలమని సర్వే నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

వైసిపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న దర్శి నియోజకవర్గంలో టిడిపి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ మధ్య గడిచిన రెండేళ్లుగా ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. ఆయన నిరంతరం పోరాటం చేస్తూనే ఉన్నారు. వీరిద్దరి విమర్శల బాణాలు విసురుకుంటూనే ఉన్నారు.


అలాగే యర్రగొండపాలెం నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, టిడిపి ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుల మధ్య తీవ్ర స్థాయిలో విమర్శలు ప్రతివిమర్శలు చేసు కుంటున్నారు. మార్కాపురం వైసిపి ఇన్‌చార్జి అన్నా రాంబాబు, సిట్టింగ్ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. కందుకూరు వైసిపి ఇన్‌చార్జి బుర్రా మధు సూదన్ యాదవ్, సిట్టింగ్ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మధ్య నువ్వంటే నవ్వని తలపడుతున్నారు. ఫలితంగానే వైకాపా ఎన్నికల సమయం కంటే కొంత బెటర్‌గా కనిపిస్తుందని ఆ పార్టీ సొంత సర్వే నివేదిక లో తేలినట్లు విశ్వసనీయ సమాచారం. వైకాపాకు ఉమ్మడి ప్రకాశం జిల్లా గతంలో కంచుకోటగా ఉండేది.

2019 ఎన్నికల్లో 12కి 9 స్థానాల్లో గెలిచినా వైసీపీ 2024 ఎన్నికల్లో రెండు స్థానాలకే పరిమితం అయింది. ఖచ్చితంగా గెలుస్తారనుకున్న బలమైన నాయకులు కూడా ఓడిపోయారు. దీంతో 2029 ఎన్నికల్లోపు పార్టీని పూర్తి స్థాయిలో బలోపేతం చేసి తెలుగుదేశంపై ప్రతీకారం తీర్చుకోవాలని ఆ పార్టీ అధిష్టానం, స్థానిక జిల్లా నేతలు గడిచిన రెండేళ్లుగా పోరాటం చేస్తున్నారు. అయితే కూటమి రెండేళ్ల పాలనపై ఎంత పోరాటం చేస్తున్నా కొంత మంది వైసిపి నేతలు కేసులు పెడతారేమోనన్న భయంతో వెనుకంజ వేస్తున్నారు. అంతే కాకుండా వైసిపి నేతల పనితీరు కూడా సరిగ్గా లేదని సొంత సర్వేలో తేలడంతో పాటు ఎన్నికల సమయంలో కంటే ప్రస్తుతం జిల్లాలో ఫ్యాన్ మరింత డీలా పడిపోయిందని నివేదికలు తేల్చిచెప్పడంతో ఆ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం. ఏదీ ఏమైనా వైఎస్ జగన్ పాదయాత్ర చేపట్టేలోపు కొన్ని నియోజక వర్గాల ఇన్‌చార్జిల మార్పు తథ్యమని విశ్లేషకులు అంటున్నారు.

# ఒంగోలులో దొంగలు పడ్డారు!

**● వరుస చోరీలతో హడలెత్తిపోతున్న నగరవాసులు**

**● గస్తీ లేదు నిఘా లేదు దొంగలకు భయం లేదు!**



**ఒంగోలు(క్రైమ్), జులై 5 ప్రభాతవార్త:** ఒంగోలు నగరంలో వరుసగా జరుగుతున్న చోరీలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లిన కుటుంబాలు తిరిగి వచ్చేలోపు దొంగలు చోరీలకు పాల్పడు తున్న ఘటనలు పెరుగుతుండటంతో నగరంలో పోలీసింగ్ తీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని దొంగలు వరుస చోరీలకు పాల్పడు తుండగా, రాత్రి వేళల్లో పోలీసు గస్తీ కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల నగరంలోని పలు ప్రాంతాల్లో చోటు చేసుకున్న చోరీలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దొంగలు పథకం ప్రకారం తాళాలు పగులగొట్టి నగదు, బంగారం, విలువైన వస్తువులు అపహరిస్తున్నప్పటికీ నేరాలను అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నేరం జరిగిన తర్వాత మాత్రమే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపడుతున్నారని, ముందస్తు నిఘా, రాత్రి పెట్రోలింగ్, బీట్ వ్యవస్థ ఆశించిన స్థాయిలో కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉండడం కూడా నగర పోలీసింగ్‌పై ప్రభావం చూపుతోందనే అభిప్రాయాలు వ్యక్తమ వుతున్నాయి. పూర్తి స్థాయి అధికారి లేకపోవడం తో పర్యవేక్షణలో లోపాలు ఏర్పడుతున్నాయని, గతంలో వీఆర్‌కు పంపిన తాలూకా సీఐని తిరిగి అదే స్టేషన్‌కు నియమించడంపై కూడా స్థానిక వర్గాల్లో చర్చ జరుగుతోంది. పోలీసు శాఖలో తీసుకుంటున్న పరిపాలనా నిర్ణయాలు నగర భద్రతపై ప్రభావం చూపుతున్నాయా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఇటీవల ఒంగోలులో చెడ్డీ గ్యాంగ్ సంచారం కలకలం రేపింది. ఇందుర్తి నగర్‌లో అర్ధరాత్రి సమయం లో ఆరుగురు సభ్యులతో కూడిన ముఠా సంచరిస్తున్న దృశ్యాలు ఓ ఇంటి సీసీటీవీ కెమెరాలో నమోదయ్యాయి. ఈ వీడియో సామా జిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ప్రజల్లో మరింత భయాందోళనలు నెలకొన్నాయి. అయితే ఈ ఘటనపై పోలీసులు పెద్దగా స్పందించలేదనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇటీవల చీరాల ప్రాంతంలో కూడా దొంగల ముఠా సంచ రిస్తోందని అక్కడి పోలీసులు అనుమానితుల ఫోటోలను విడుదల చేయడం గమనార్హం. ఈ పరిణామాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఒంగోలు నగరంలో కూడా రాత్రి గస్తీని మరింత కట్టుదిట్టం చేయాలని, బీట్ వ్యవస్థను సమర్థవం తంగా అమలు చేయాలని ప్రజలు కోరుతు న్నారు. ముఖ్యంగా చోరీలకు పాల్పడుతున్న ముఠాలను త్వరగా గుర్తించి అరెస్టు చేయడంతో పాటు ఖాళీగా ఉన్న పోలీసు అధికారుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆరోపణలపై పోలీసు శాఖ అధికారిక స్పందన అందుబాటులో లేదు.

## రాపూరులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**● 13 మంది అరెస్ట్... రూ.19.480 నగదు స్వాధీనం**



**రాపూరు (నెల్లూరు), జులై 5 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా రాపూరు మండల కేంద్రం పంచాయితీ పరిధిలోని రామిరెడ్డిపల్లి గ్రామ సమీపం లోని ఒక తోటలో నిర్వహి స్తున్న పేకట స్థావరంపై రాపూరు ఎస్‌ఐ కె.తిరుమల రావు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు.

ఈ దాడిలో పేకాట ఆడు తున్న 13 మందిని అదుపు లోకి తీసుకోని, వారి వద్ద నుండి రూ.19,480 నగదు, పేకాట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె. తిరుమల రావు తెలిపారు.

6-7Pg7exHMNWJQE_6-7Pg7exHMNWJQE.qxd 05/Jul/26 11:37 PM Page 1



# నెల్లూరులో మంత్రి నారాయణ సుడిగాలి పర్యటన

● పలు అభివృద్ధి పనులు పరిశీలన... వైకాపాకు మంత్రి నారాయణ చురకలు ● స్కూల్ గ్రౌండ్‌లో బ్యాట్ పట్టిన మంత్రి నారాయణ, బౌలింగ్ చేసిన అజీజ్



**నెల్లూరు(వైద్యం), జులై 5 ప్రభాతవార్త:** అభివృద్ధిపై ఆత్మపరిశీలన చేసుకొని ఆరోపణలు చేయాలని వైకాపాకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చురకలంటించారు. ఐదేళ్ల వైఎస్ ఆర్సీపీ పాలనలో జరిగిన, రెండేళ్ల కూటమి పాలనలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకొని విమర్శలు చేయాలని సూచించారు. నెల్లూరు సిటీ నియోజక వర్గంలో అదివారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. కాలువలు, పాఠశాలల ఆధునీకరణ పనుల పురోగతిని పరిశీలించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ గత ఐదేళ్ల ప్రభుత్వ కాలంలో నగర అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. గతంలో తాము రూ.1100 కోట్లతో ప్రారంభించిన యూజీడీ, డ్రింకింగ్ వాటర్ పనులను పట్టించుకోకుండా వదిలేశారని విమర్శించారు. విపక్షాలు ఎన్ని అవాకులు చవాకులు పేలినా చెట్ల పెంపకంపై ఎంత రచ్చ చేసినా అభివృద్ధిని అడ్డుకోలేరన్నారు. ఐదేళ్లలో నెల్లూరుకు ఏం చేశారో వారు అంతరాత్మ సాక్షిగా ప్రశ్నించుకోవాలని చురకలంటించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విజన్ ప్రకారం నెల్లూరులోని 15 ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని వివరించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు చదువే ఏకైక మార్గమని, ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా విద్యే బిడ్డల భవిష్యత్తును మారుస్తుందని పేర్కొన్నారు. పేద బిడ్డలకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో మంత్రి నారాయణ ఆధ్వర్యంలో నెల్లూరు నగరవ్యాప్తంగా ఒకదానిని మించి ఒకటిగా వందల కోట్లతో 15 స్కూళ్లను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని ప్రశంసించారు.

**మంత్రి బాటింగ్ విద్యార్థులు ఫిదా:** నెల్లూరులో ఒక



ఆసక్తికరమైన దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. నిరంతరం ప్రజాసేవ, నగర అభివృద్ధి సమీక్షలతో బిజీగా ఉండే మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఒక్కసారిగా చిన్నపిల్లల్లా మారిపోయి నెల్లూరు మూలాపేట బాలికోన్నత పాఠశాల స్కూల్ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడి సందడి చేశారు. రాజుగారి కోటను తలపించేలా బ్రహ్మాండంగా రూపుదిద్దుకున్న పాఠశాల మైదానంలో అబ్దుల్ అజీజ్ బౌలింగ్ వేయగా మంత్రి నారాయణ భారీ షాట్ కొట్టి అక్కడున్న విద్యార్థులు, అధికారుల చప్పట్లతో గ్రౌండ్ మొత్తాన్ని హోరెత్తించారు. బెత్తం పట్టిన చేత్తో బాట్ పట్టి విద్యార్థులను ఫిదా చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, డిఈఓ బాలాజీరావు, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, కార్పొరేటర్ కరిముల్లా, స్థానిక టిడిపి నాయకులు ఇంతియాజ్, మొయినుద్దీన్, ఖలీల్, కాలేషా, కపీర రేవతి తదితరులు పాల్గొన్నారు.



## పిఎబిఆర్ డ్యామ్‌లోని ఇన్‌టెక్ వెల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి పయ్యావుల

● ఓఅండ్ఎం అధికారుల నిర్లక్ష్య ధోరణిపై మంత్రి మండిపాటు

● అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశం

**అనంతపురం, జులై 5 ప్రభాతవార్త బ్యూరో:** పిఎబిఆర్ డ్యామ్‌లోని శ్రీరామిరెడ్డి ప్రాజెక్ట్ నుండి ఉరవకొండకు తాగునీటి సరఫరా చేసే ఇన్‌టెక్ వెల్‌ను ఆదివారం సాయంత్రం మంత్రి పయ్యావుల కేశవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ తనిఖీ సమయంలో మోటార్లు ఆఫ్‌లో ఉండటం, పైగా అక్కడ ఒక్క అధికారి కానీ, కనీసం ఒక్క వర్కర్ కానీ అందుబాటులో లేకపోవడంతో మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, తీవ్రమైన నీటి ఎద్దడి ఉండి, డ్యామ్‌లో నీరు ఉన్నప్పటికీ ఉరవకొండకు నీటి సరఫరా చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓఅండ్ఎం అధికారుల నిర్లక్ష్య ధోరణిపై మంత్రి మండిపడ్డారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి ఆదేశించారు. తాగునీటి విషయంలో ఇలాంటి అలసత్వాన్ని సహించేది లేదని, బాధ్యులపై తగు చర్యలు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు.

## గల్లంతైన మత్స్యకారులను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం

● ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారులను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం అని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల గురించి విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి ఆయన ఆరా తీశారు. గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల వివరాలను ఈ సందర్భంగా ఆయన అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెరైన్ పోలీసులు, కోస్ట్ గార్డు, నేవీ సమన్వయంతో ఈ గాలింపు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. నేవీ హెలికాప్టర్‌తో ఇప్పటికే గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని డిప్యూటీ సీఎంకు విశాఖ జిల్లా కలెక్టర్ వివరించారు. సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని ఆయనను ఆదేశించారు. అలాగే మత్స్యశాఖ ఉన్నతాధికారులను కూడా ఈ సందర్భంగా ఆయన అప్రమత్తం చేశారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. ఈ మేరకు డిప్యూటీ సిఎం కార్యాలయం ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించింది.

## మైనర్‌తో పెళ్లి... పోక్సో కేసు నమోదు

**తిరుపతి, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏమాత్రం బయటి ప్రపంచం తెలియని ఓ 15 యేళ్ల మైనర్ బాలికతో ఆటోడ్రైవర్ మాయామాటలతో శారీరక సంబందం పెట్టుకున్నాడు. అంతేగాక బాలికను నమ్మించి ఆపై పెళ్లి కూడా చేసుకున్నాడు. అతని మాయమాటలకు నమ్మిన బాలిక పెళ్ళికి సిద్ధమైంది. బాలికను వివాహం చేసుకున్న ఆటో డ్రైవర్ చివరకు మైనర్ అని కూడా లేకుండా వివాహమైన రాత్రి బాలికతో శారీరక సంబంధం పెట్టుకొన్నట్లు బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసింది. అలిపిరి పోలీసలు ఆటో డ్రైవర్‌పై పోక్సో చేసి నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మళ్లీ రోడ్డెక్కనున్న మామిడి రైతులు

● కేజీకి రూ.17.47 అమలుకు డిమాండ్ ● 8న చిత్తూరులో శాంతియుత నిరసన

**చిత్తూరు, జులై 5 ప్రభాతవార్త:** మామిడి రైతులకు కేజీకి రూ.4 ప్రోత్సాహక ధర ప్రకటించినప్పటికీ, ఫ్యాక్టరీలు జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించిన మేరకు మామిడికి ధర చెల్లించకపోవడంతో ఇప్పటికే పలు ఆందోళనలు చేపట్టిన మామిడి రైతులు బుధవారం మరోమారు రోడ్డెక్కి ఆందోళన చేయడానికి సిద్ధం అయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతు సంఘం జిల్లా కమిటీ ఆదివారం ఎస్టీయు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఈ మేరకు మామిడికి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కేంద్రం చిత్తూరులో శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతు సంఘం కమిటీ అధ్యక్షులు మునీశ్వర్‌రెడ్డి మామిడి రైతుల నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఈ సమావేశంలో ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం తోతాపురి మామిడికి మద్దతు ధర ప్రకటించిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేజీ తోతాపురికి రూ.17.47 చెల్లించాలని మామిడి రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర జిల్లాలోని ఏ ఒక్క ఫ్యాక్టరీ, ర్యాంపుల్లో



మామిడి రైతుల నిరసన పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా మామిడి రైతుల సంఘ నాయకులు

అమలు చేయడం లేదని, ఈ విషయంపై ఇటు ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అటు వ్యవసాయ శాఖ మంత్రి సైతం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. గత రెండేళ్ళుగా మామిడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో మామిడి రైతు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నాడని వాపోయారు. జిల్లాలోని తోతాపురి మామిడి రైతుల గిట్టుబాటు ధర కల్పనతో పాటు ఫ్యాక్టరీల నుండి రైతులకు రావాల్సిన పాత బకాయిలను రాబట్టుకోవడానికి బుధవారం చిత్తూరులో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మామిడి రైతు సంఘ నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు చిత్తూరు గాంధీ విగ్రహం ఆవరణలో మామిడి రైతు సంఘం ఆధ్వర్యంలో మామిడి రైతులు గుమిగూడి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి శాంతియుతంగా కార్యక్రమంను కొనసాగిస్తామన్నారు. జిల్లాలోని మామిడి రైతులందరు ఈ కార్యక్రమానికి తరలివచ్చి మామిడి రైతుకు మద్దతుగా నిలిచి ప్రభుత్వం నుడి మామిడికి గిట్టుబాటు ధర రాబట్టుకోవడానికి సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మామిడి రైతుల సంఘ ఉపాధ్యక్షులు మునిరత్నంనాయుడు, ఉమాపతినాయుడు, బెల్లంకొండ శ్రీనివాసులు, మోహన్‌రెడ్డి, జైదేవయ్య, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



## ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన భక్తజనం

**ఇంద్రకీలాద్రి, జులై 5 ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రద్దీని దృష్ట్యా ఆలయ ఇఒ వికె శీనా నాయక్, డిఇఒ కిషోర్ కుమార్, ఎఇఒలు చంద్రశేఖర్, రమేష్ బాబు క్యూలైన్లు పర్యవేక్షణ చేయగా భక్తులకు కావలసిన అన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 10.30 గంటల నుండి అంతరాలయ దర్శనాలను మధ్యాహ్నం 2.15 గంటల వరకు అన్ని రకాల వీఐపీ దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు. భక్తుల సేవలో పాలకమండలి, అధికారులు పాల్గొని క్యూలైన్లను క్రమబద్ధీకరించారు.

**భక్తుల విరాళాలు:** దుర్గమ్మ భక్తులు ఆదివారం విరాళాలు అందించారు. నిత్యాన్నదాన పథకానికి తిరువూరుకు చెందిన వివి మనుబ్రహ్మాచారి రూ.1,00,116లు, గుంటుపల్లికి చెందిన కంచర్ల బెనర్జీ, కుటుంబీకులు రు.1,00,116ల విరాళం అందించారు. విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడకు చెందిన మరో దాత వై.యోహిత్ రూ.1లక్ష విరాళం అందించారు. హైదరాబాద్‌కు చెందిన వి వీర ప్రకాష్, కుటుంబీకులు రూ.1లక్ష విరాళం అందించారు. చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన ఇందుకూరి నరేష్ కుమార్ రెడ్డి, కుటుంబీకులు రు.1లక్ష విరాళాన్ని ఆలయ అభివృద్ధికి అందించారు. ఆయా దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## ఏలూరు జిల్లాలో తీవ్ర విషాదం

### రైలు ఢీ కొట్టి నలుగురు వ్యక్తుల దుర్మరణం

**ఏలూరు, జూలై 5 ప్రభాతవార్త బ్యూరో:** ఏలూరు జిల్లాలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఉంగుటూరు మండలం చేబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొనడంతో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న తాడేపల్లిగూడెం జీఆర్పి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. సంఘటనా స్థలంలో షేక్ హసీనా పేరు మీద ఉన్న ఏటీఎం కార్డు, తాడేపల్లిగూడెం ఆర్టీసీ పార్కింగ్ రసీదును పోలీసులు గుర్తించారు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందా లేదా ఆత్మహత్యకు పాల్పడ్డారా అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి చర్లపల్లి షాలిమార్ ఎక్స్‌ప్రెస్ రైలు ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు రైల్వే స్టేషన్ సమీపంలో నలుగురు వ్యక్తులను ఢీ కొట్టింది. మీ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. రైలు వేగంగా ఢీకొనడంతో వారి మృతదేహాలు చెల్లాచెదురయ్యాయి. వీరు ఒకే కుటుంబానికి చెందినవారు లేదా బంధువులుగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ప్రస్తుతం మృతుల వివరాలను తెలుసుకొంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడేపల్లిగూడెం జిఆర్‌పి ఎస్ఐ అప్పారావు తెలిపారు.

# సరిహద్దుల నుంచే నిఘా కోసం చైనా రాడార్ వ్యవస్థ ఏర్పాటు

**న్యూఢిల్లీ, జులై 5:** భారత సరిహద్దుల్లో చైనా తన మిలిటరీ సామర్థ్యాన్ని విస్తరిస్తోంది. మయన్మార్ సరిహద్దుకు సమీపంలో నైరుతి యువాన్ ప్రావిన్సులో చైనా ఒక అధునాతన రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. భారత్‌కు భద్రతా పరంగా ఇబ్బందులు కలిగించే వ్యవస్థ వల్ల భారత క్షిపణి వ్యవస్థ, జాతీయ భద్రతపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. కొత్తగా ఏర్పాటు చేయబడిన లార్జ్ ఫేజ్డ్ అర్రే రాడార్ 5,000 కిలో మీటర్లకు పైగా నిఘా పరిధిని కలిగి ఉందని తెలుస్తోంది. దీని ద్వారా చైనా హిందూ మహా సముద్రంలోని ప్రాంతాలపై, భారత భూభాగాలను కూడా పర్యవేక్షించగలదు. ఈ అధునాతన రాడార్ వ్యవస్థ చైనా నిఘా సేకరణ సామర్థ్యాలను, ముఖ్యంగా ఇండియా బాలిస్టిక్ మిస్సైల్ ప్రోగ్రామ్‌కి సంబంధించి కన్నేసి ఉంచగలదు. ముందస్తు హెచ్చరికలు, నిఘా కోసం రూపొందించిన ఎల్‌పార్ వ్యవస్థ, బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాలను రియల్ టైమ్‌లో గుర్తించి ట్రాక్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. దీని పరిధి లోకి భారత్‌లో కీలమైన, క్షిపణి ప్రయోగాలను నిర్వహించే తూర్పు తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం వస్తుంది. ఈ ద్వీపం నుంచే అగ్ని5, కే 4 వంటి అధునాతన క్షిపణులను భారత్ పరీక్షిస్తోంది. క్షిపణి వేగం, మార్గం, దూరాలపై కీలమైన డేటాను చైనా సంగ్రహించే అవకాశం ఉంది. భారత దేశ క్షిపణులను కౌంటర్ చేయడానికి చైనా అను గుణంగా క్షిపణులను, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల్ని అభివృద్ధి చేసే అవకాశం ఉంది. హిందూ మహాసముద్రంలో భారత్ ప్రాబల్యాన్ని తగ్గించేందుకు చైనా ఎప్పటి నుంచో ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ ప్రాంతంలో శ్రీలంక, మాల్దీవులతో స్నేహం నడుపుతోంది. ప్రస్తుతం భారత సరిహద్దులకు దగ్గరగా ఉన్న ఈ భారీ రాడార్‌తో బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంపై నిఘా వేస్తుంది. ఈ ప్రాంతంలోని వాణిజ్య షిప్పింగ్ మార్గాలు, భారత నేవీ ఉనికిని పర్యవేక్షించే అవకాశం ఉంది. ఇప్పటికే చైనాకు బీజింగ్ కోర్లా, జిన్జియాంగ్‌లో ఎల్‌పార్ రాడార్లు ఉన్నాయి. ఇవి భారత్‌పై నిఘా కవరేజీని అందిస్తున్నాయి. యునాన్‌లో కొత్తగా



## 12న విజయవాడలో మెగా జాబ్ మేళా

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా జులై 12న విజయవాడలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ మొగల్రాజపురంలోని పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. బిఎన్ఐ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 100కుపైగా కంపెనీలు, అందులో పలు బహుళజాతి సంస్థలు పాల్గొననున్నాయి. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, పీజీ, ఫార్మసీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు గల అభ్యర్థులు పాల్గొనవచ్చు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనంతో ఉద్యోగాలు లభిస్తాయి. అభ్యర్థులు ముందుగా నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకుని, రెజ్యూమే, ఆధార్, పాన్ కార్డు, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరుకావాలని నిర్వాహకులు సూచించారు. మరిన్ని వివరాలకు 83339 08080, 90326 33548, 99857 59304 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.



## ముంబయిలో భారీ వర్షం

### ముకేష్ అంబాని కాన్వాయ్‌కు తప్పిన ప్రమాదం

**ముంబయి, జులై 5:** మహారాష్ట్రతోపాటు దేశంలోని గుజరాత్, ఢిల్లీ ఇతర ఉత్తర భారత రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికితోడు వాతావరణ శాఖ కూడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో తీరప్రాంత రాష్ట్రాలన్నీ అప్రమత్తం అయ్యాయి. ముంబై భారీ వర్షాలతో అతలాకుతలమైంది. 24 గంటల్లో కొన్ని ప్రాంతాల్లో 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాహనాల రాకపోకలు స్తంభించి పోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ప్రజలకు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ సూచన చేసింది. భారీ వర్షాలు ముంబైను వణికించాయి. ప్రధానంగా నగరంలో గడిచిన 24 గంటల్లో 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవ్వగా లోతట్టు ప్రాంతాల్లో 30 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. విక్రోలిలో అత్యధికంగా 31.06 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. మరోవైపు ముంబైలోని కొన్ని ప్రాంతాల్లో మెట్రో, ప్రజా రవాణా సేవలు యథాతథంగా కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించినా మెట్రో సేవల్లో అంతరాయం ఏర్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. కొన్నిచోట్ల కొండచరియలు విరిగిపడగా మరికొన్ని చోట్ల రోడ్లు నీట మునిగిపోయాయి. ముంబైలోని కుర్లా వెస్ట్ ప్రాంతంలో చెట్టుకూలడంతో వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం మధ్యాహ్నం 12:40 గంటల సమయంలో వర్షాలు, గాలులకు నౌపా డాలో ఒక చెట్టు కూలింది. 63 ఏళ్ల యూనస్‌పై ఆ చెట్టు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చెట్టు కొమ్మల కింద చిక్కుకున్న ఆయనను బయటకు తీసి వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే యూనస్ మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మరోవైపు ముంబైలో భారీ వర్షాలకు ఇప్పటి వరకు నలుగురు మరణించారు.

## పోలీసు యంత్రాంగం ప్రమాదకర దిశగా పయనం

వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ ఆరోపణ



**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో పోలీసు యంత్రాంగం అత్యంత ప్రమాదకరమైన దిశగా పయనిస్తోందని వైసిపి అధినేత జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా చంద్రబాబు పాలనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తనను ప్రశ్నించిన వారిని, రాజకీయంగా వ్యతిరేకించే వారిని అణచివేసేందుకు చంద్రబాబు పోలీసు వ్యవస్థను ఒక సాధనంగా మార్చుకుంటున్నారని, ఇది రాష్ట్రాన్ని పెను ప్రమాదంలోకి నెడుతోందని ఆరోపించారు. "చంద్రబాబు గారూ... రాష్ట్రానికి కావాల్సింది 'రౌడీ పోలీసింగ్' కానీ, 'జంగిల్ రాజ్' కానీ కాదు. ప్రజలకు భద్రత కల్పించే పరిపాలన, బాధితులకు న్యాయం చేసే వ్యవస్థ, చట్టం ముందు అందరూ సమానమే అని విశ్వసించే సమాజం కావాలి. రాజకీయ ఆదేశాలతో కాకుండా రాజ్యాంగబద్ధంగా పనిచేసే పోలీసు వ్యవస్థ మనకు అవసరం" అని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు. చంద్రబాబు తన దుర్మార్గపు పాలనతో రాష్ట్రవ్యాప్తంగా విష బీజాలు నాటారని, అవి క్రమంగా మొలకెత్తి విష వృక్షాలుగా మారుతున్నాయని జగన్ అభివర్ణించారు. పోలీసుల పనితీరును ప్రశ్నిస్తూ జగన్ పలు ఘటనలను ఉదహరించారు. "పిల్లలు కనపించకుండా పోతే దర్యాప్తులో వేగం ఉండదు. మహిళలపై నేరాలకు సంబంధించి ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం. గిరిజన మహిళను వివస్త్రను చేసి కొట్టినా అరెస్టులు జరగవు. కానీ, సోషల్ మీడియాలో మిమ్మల్ని ప్రశ్నిస్తే మాత్రం కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం, చిత్రహింసలకు గురిచేయడం, నాన్‌బెయిలబుల్ సెక్షన్లు ప్రయోగించడం వంటివి చేస్తారా?' ' అని జగన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో నెల రోజుల క్రితం అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి కేసు, పెద్దాపురంలో మానసిక వికలాంగురాలిపై జరిగిన లైంగిక దాడి కేసు నమోదులో జాప్యం, నెల్లూరు జిల్లాలో మాజీ టిడిపి కౌన్సిలర్ ఒక గిరిజన మహిళను వివస్త్రను చేసి దాడి చేసిన ఘటనను ఆయన ప్రస్తావించారు. సాయికృష్ణ కస్టడీ మరణం, అతని మృతదేహం అదృశ్యం కావడం రాష్ట్రాన్ని కుదుపునకు గురిచేసిందని, అతని తల్లి అడిగే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదని అన్నారు.

క్రాంతికుమార్ ఆత్మహత్య, అతను ఇచ్చిన మరణ వాంగ్మూలం, దాన్ని ప్రజలు సోషల్ మీడియాలో ప్రత్యక్షంగా చూడటం తీవ్రంగా కలచివేసిందన్నారు. గంగమ్మ, తిరుపతమ్మ కస్టడీ మరణాలు, పోలీసు వేధింపుల కారణంగా కళావతి ఆత్మహత్య చేసుకోవడం వంటి ఘటనలు రాష్ట్ర పోలీసు వ్యవస్థకు తీవ్ర అప్రతిష్టను తెచ్చిపెట్టాయని, అయినా మీ తీరు మారడం లేదని మండిపడ్డారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే చంద్రబాబు ఈ పంథాను ఎంచుకున్నారని జగన్ ఆరోపించారు. సాధారణ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయకుండా, ప్రతి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను ఆదేశించి సోషల్ మీడియా కార్యకర్తలపై నాన్‌బెయిలబుల్ సెక్షన్లు పెట్టించి, వారి కేసులను వ్యవస్థీకృత నేరాలతో ముడిపెడుతున్నారని, ఇది అత్యంత ప్రమాదకరమైన ధోరణి అని హెచ్చరించారు. "ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వారిని భయపెట్టాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమే అవుతుంది" అని జగన్ తెలిపారు. యూట్యూబర్, జర్నలిజంలో ఉస్మానియా యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్ అయిన కెవిఆర్‌ను ఎలాంటి చట్టపరమైన ప్రక్రియలు పాటించకుండా భారీ పోలీసు బలగంతో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి, అతను చేయని నేరాలకు ఎఫ్ఐఆర్‌లో ఇరికించి జైల్లో పెట్టడం అత్యంత దారుణమని జగన్ ఖండించారు. మరో యూట్యూబర్ రావణ్ విషయంలో నాలుగు వేర్వేరు కోర్టులు బెయిల్ మంజూరు చేసినా, విపరీతమైన అహంకారంతో మీ అనుచరులు నేరుగా పోలీస్ స్టేషన్లపై దాడి చేశారని, పోలీసులు మోన ప్రేక్షకులుగా మిగిలిపోయారని ఆరోపించారు.

## 'ఎస్ఐఆర్'పై ఎపి సచివాలయంలో నేటి నుంచి 8 వరకు ప్రత్యేక శిబిరం

**విజయవాడ, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై ఈనెల 6వ తేదీ నుండి 8వ తేది వరకు సచివాలయ ఉద్యోగుల సౌకర్యార్థం ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నారు. ఈప్రత్యేక శిబిరాన్ని 6వ తేది సోమవారం ఉ.10.30గం.లకు ఎపి సచివాలయం మూడవ భవనం అప్సా(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం) హాల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్, సాయి కాంత్ వర్మ తదితరులు పాల్గొనున్నారు. ఈ ప్రత్యేక క్యాంపులో ఎన్యుమరేషన్ ఫారాలు ఆన్లైన్ సబ్ మిషన్, కొత్త ఓటర్లు ఎన్రోల్మెంట్, ఓటర్ల జాబితా నుండి చనిపోయిన వారి పేర్లు తొలగింపు, చిరునామా మార్పు తదితర అంశాలపై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తారు. కావున ఉద్యోగులు 2002 నాటి ఓటరు వివరాలు, తాజా ఫోటో, ప్రస్తుత ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు)ఆధార్ కార్డు, రెసిడెన్షియల్ అడ్రస్ ప్రూఫ్ వివరాలతో హాజరు కావాల్సి ఉంటుంది.

## బ్యాగులో పెట్టిన బంగారు మాయం

**తిరుపతి, జులై 5 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలో జరిగిన ఓ వివాహానికి హాజరైన కుటుంబానికి చెందిన బంగారు నగలు మాయమాయ్యాయి. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్ణాటక బెంగళూరుకు చెందిన రెడ్డప్ప ఆనందన్ తన చిన్నాన్న కొడుకు వివాహ రిసెప్షన్‌కు శనివారం తిరుపతికి వచ్చారు. తిరుపతిలోని ఆర్ఎస్ గార్డెన్‌లో ఉన్న అన్న ఇంటికి చేరాడు. అక్కడ కొంత సమయం విశ్రాంతి తీసుకున్నాడు. రిసెప్షన్ ఫంక్షన్‌కు వెళ్లే ముందు బ్యాగ్‌లో ఉంచిన 64 గ్రాముల నెక్లెస్, హారం కనపడకపోవడంతో వుతికారు. చివరకు తిరుపతి వెస్ట్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. అయితే నగలు ఎక్కడ ఎలా మాయమయ్యాయనేది పోలీసులు విచారణ చేస్తున్నారు.

06-07pg10_06-07pg10.qxd 06/Jul/26 12:19 AM Page 1



# క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లిన ఫ్రాన్స్, మొరాకో



తొలి ఆఫ్రికా దేశంగా మొరాకో

**పెన్సిల్వేనియా, జులై 7:** ఫిఫా ప్రపంచకప్ 2026లో మొరాకో, ఫ్రాన్స్ జట్లు క్వార్టర్ ఫైనల్ బెర్తులు ఖరారు చేసుకున్నాయి. తొలి రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో సహ ఆతిథ్య జట్టు కెనడాపై 3-0 గోల్స్‌తో మొరాకో.. పరాగ్వేపై ఏకైక గోల్‌తో ఫ్రాన్స్ గెలుపొందాయి. క్వార్టర్ ఫైనల్‌లో మొరాకోతో ఫ్రాన్స్ తలపడనుంది.

ప్రికార్వర్ట్ ఫైనల్లో పరాగ్వేపై ఫ్రాన్స్ చెమటోడ్చి నెగ్గింది. పరాగ్వే చివరకు వరకు గట్టి పోటీ ఇచ్చింది. ఈ పోరు రసవత్తరంగా సాగింది. పెన్సిల్వేనియాలో జరిగిన మ్యాచ్‌లో పరాగ్వేపై 1-0 తేడాతో ఫ్రాన్స్ విజయం సాధించింది. ఫ్రాన్స్ స్టార్ స్ట్రైకర్, కెప్టెన్ కిలియన్ ఎంబాపె సెకండాఫ్‌లో లభించిన పెనాల్టీని గోల్‌గా మలిచి జట్టును క్వార్టర్ ఫైనల్స్‌కు చేర్చాడు. టోర్నమెంట్ అంతటా దూకుడుగా ఆడిన ఫ్రాన్స్ జట్టుకు, ఈ మ్యాచ్‌లో మాత్రం పరాగ్వే డిఫెండర్లు ఊహించని సవాలును విసిరారు. ఈ మ్యాచ్ లో గెలవడానికి ఫ్రాన్స్ జట్టు చమటోడ్చాల్సి వచ్చింది.

గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లలో ప్రత్యర్థులపై సులువుగా విజయాలు సాధిస్తూ దూసుకొచ్చిన ఫ్రాన్స్ జట్టుకు... పరాగ్వే గట్టి పోటీ ఇచ్చింది. గత మ్యచ్‌లో ఫుట్‌బాల్ దిగ్గజం జర్మనీని ఓడించి సంచలనం సృష్టించిన పరాగ్వే, అదే ఉత్సాహంతో ఫ్రాన్స్‌ను సైతం కట్టడి చేయడానికి పక్కా వ్యూహంతో బరిలోకి దిగింది. మ్యాచ్ ప్రారంభమైన నిమిషం నుంచే ఫ్రాన్స్ జట్టు బంతిని తమ ఆధీనంలో ఉంచుకుని అటాకింగ్ గేమ్ ఆడింది. ప్రారంభ నిమిషాల్లో ఫ్రాన్స్ ఏకంగా 80 శాతానికి పైగా బాల్‌ను తమ వద్దే ఉంచుకుంది. ముఖ్యంగా పరాగ్వే యువ సంచలనం జూలియో ఎన్సిసో చురుగ్గా కదులుతూ ఫ్రాన్స్ ఆధిపత్యాన్ని అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. ఫలితంగా, తొలి 45 నిమిషాల ఆటలో ఫ్రాన్స్ గోల్ కోసం కేవలం ఐదు ప్రయత్నాలు మాత్రమే చేసినా ఒక్కటీ కూడా ఫలించలేదు.

### గోల్డెన్ బూట్‌రేసులో ఎంబాపే... ఏడో గోల్

తొలి అర్ధభాగంలో ఫ్రాన్స్ స్టార్ ఎంబాపెను పరాగ్వే మిడ్‌ఫీల్డర్ ఆండ్రెస్ క్యూబాస్ అడ్డుకోవడంతో ఫౌల్ అయ్యింది. ఈ క్రమంలో ఎంబాపె కోపంతో స్పందించగా, ఇరు జట్ల ఆటగాళ్లు ఒకరినొకరు నెట్టుకుంటూ మైదానంలో పెద్ద ఎత్తున ఘర్షణకు దిగారు. రెఫరీ వెంటనే జోక్యం చేసుకుని ఆటగాళ్లను శాంతింపజేయాల్సి వచ్చింది.ఎంబాపె అద్భుతం టండో అర్ధభాగంలో ఆట స్వరూపం పూర్తిగా మారిపోయింది. ఫ్రాన్స్ జట్టు మరింత పట్టుదలతో మైదానంలోకి అడుగుపెట్టింది. మిడ్‌ఫీల్డర్ మను కోనే లాంగ్‌రేంజ్ నుంచి కొట్టిన ఒక శక్తివంతమైన షాట్‌ను పరాగ్వే గోల్‌కీపర్ ఓర్లాండో గిల్ గాల్లోకి ఎగిరి అద్భుతంగా అడ్డుకున్నాడు. ఈ క్రమటంలో ఫ్రాన్స్ కోచ్ 66వ నిమిషంలో వ్యూహాత్మకంగా డెసిరే డౌను మైదానంలోకి పంపాడు. డౌ మైదానంలోకి వచ్చిన వెంటనే మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. మెరుపు వేగంతో కదులుతూ ముగ్గురు పరాగ్వే డిఫెండర్లను దాటుకుని పెనాల్టీ బాక్స్‌లోకి దూసుకెళ్తున్న డౌను పరాగ్వే ఆటగాడు డియాగో గోమెజ్ కింద పడేశాడు. దీంతో రెఫరీ ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఫ్రాన్స్‌కు పెనాల్టీ కిక్ ఇచ్చాడు. దిగ్గజ ఆటగాడు ఎంబాపె ఏమాత్రం ఒత్తిడికి లోనవకుండా, బంతిని అత్యంత చాకచక్యంగా గోల్ పోస్ట్‌లోకి పంపి ఫ్రాన్స్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు.ఈ గోల్‌తో మెస్సీతో సమానంగా 7 గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో ఎంబాపే ముందున్నాడు. గోల్ సమం చేసి మ్యాచ్‌ను ఎక్స్‌ట్రా టైమ్‌కు తీసుకెళ్లాలని పరాగ్వే జట్టు చివరి 20 నిమిషాల్లో తీవ్రంగా పోరాడింది. కానీ, ఫ్రాన్స్ డిఫెండర్లు, మిడ్‌ఫీల్డర్లు సమన్వయంతో ఆడుతూ పరాగ్వే ప్రయత్నాలను భగ్నం చేశారు. మ్యాచ్ ముగియడానికి కొన్ని క్షణాల ముందు, ఇంజ్యూరీ టైమ్‌లో ఎంబాపె వ్యక్తిగతంగా రెండో గోల్ సాధించే సువర్ణావకాశాన్ని అందుకున్నాడు. అయితే పరాగ్వే గోల్‌కీపర్ ఓర్లాండో గిల్ వరుసగా రెండు అద్భుతమైన సేవ్‌లు చేసి ఫ్రాన్స్ ఆధిక్యం పెరగకుండా అడ్డుకున్నాడు. చివరకు ఫ్రాన్స్ 1-0తో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది.

### చరిత్ర సృష్టించిన మొరాకో.. తొలి ఆఫ్రికా దేశం

మరో ప్రికార్వర్ట్ ఫైనల్లో అతిథ్య కెనడాపై 3-0 గోల్స్‌తో గెలుపుతో మొరాకో చరిత్ర సృష్టించింది. వరుసగా రెండు ప్రపంచకప్‌లలో క్వార్టర్స్‌కు చేరిన తొలి ఆఫ్రికన్ జట్టుగా రికార్డు నెలకొల్పింది. ఈ మ్యాచ్‌లో అజెద్దీన్ రెండు గోల్స్‌తో మొరాకోకు చారిత్రక విజయాన్ని అందించాడు. అదనపు సమయంలో సూఫియాన్ రహిమీ మరో గోల్ చేసి మొరాకోను క్వార్టర్స్‌కు చేర్చాడు.జూలై 9న బోస్టన్‌లో జరిగే తొలి క్వార్టర్‌లో ఫ్రాన్స్, మొరాకో తలపడనున్నాయి.




గోల్డెన్ బూట్ రేసులో ఎంబాపె(7 గోల్స్)

## ఫెదరర్ రికార్డును బ్రేక్ : క్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్

**లండన్,జులై 5:** ఏడుసార్లు వింబుల్డన్ ఛాంపియన్ నోవాక్ జొకోవిచ్ మరో అరుదైన రికార్డు నెలకొల్పాడు. నాలుగో రౌండ్‌లో రష్యన్ క్వాలిఫయర్ రోమన్ సఫియుల్లిన్‌పై 7-6, 6-3, 3-6, 6-3తో నెగ్గి రోజర్ ఫెదరర్ రికార్డును బద్దలు కొట్టాడు. వింబుల్డన్‌లో విజయాల సంఖ్యను 106కు చేర్చాడు. ఈ క్రమంలో ఫెదరర్(105) మ్యాచ్‌ల విజయాన్ని వెనక్కి నెట్టా డు. ఆల్ ఇంగ్లాండ్ క్లబ్‌లో పురుషుల, మహిళల విభాగాలలో కలిపి మార్టినా నవ్రతిలోవా(120) మాత్రమే ఎక్కువ సింగిల్స్ మ్యాచ్‌లు గెలిచింది. అలాగే జొకోవిచ్ 17వ సారి వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్, వరుసగా తొమ్మిదో సారి క్వార్టర్‌ఫైనల్ చేరాడు. ఇది కూడా రికార్డే. క్వార్టర్ ఫైనల్లో కెనడియన్ మూడో సీడ్ ఫెలిక్స్ ఆగర్‌అలియాసిమ్, స్పానిష్ అలెజాండ్రో డేవిడోవిచ్ ఫోకినా మ్యాచ్ విజేతతో తలపడతాడు.

ఈ వారం ఆల్ ఇంగ్లాండ్ క్లబ్‌లో ఆడిన తన మొదటి మూడు మ్యాచ్‌లలో రెండింటిలో ఒక సెట్ కోల్పోయిన తర్వాత తిరిగి పుంజుకున్నాడు. 25వ గ్రాండ్ స్లామ్ సింగిల్స్ టైటిల్‌పై కన్నేసిన జొకోవిచ్... రష్యన్ క్వాలిఫయర్‌తో జరిగిన నాలుగో రౌండ్‌లో చెమటోడ్చాల్సి వచ్చింది. తొలిసెట్‌లోనే ఇరువురు పోటాపోటీగా తలపడ్డారు. టైబ్రేకర్ వరకు జరిగిన ఈ సెట్‌ను 7-6తో కైవసం చేసుకున్న జొకోవిచ్... రెండో సెట్‌ను అలవోకగా 6-3తో నెగ్గాడు. అయితే మూడో సెట్‌లో పుంజుకున్న రోమన్.. జొకోవిచ్ సర్వీసును కొల్లగొట్టి సెట్‌ను6-3తో నెగ్గిఆధిక్యాన్ని 2-1కు తగ్గించాడు. అయితే నాలుగోసెట్‌లో జొకోవిచ్..ప్రత్య ర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండాసెట్‌ను మ్యాచ్‌ను ముగించి క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించాడు.

### సబలెంకాకు ఒసాకా షాక్

మహిళల సింగిల్స్‌లో సంచలనం నమోదైంది. టాప్‌సీడ్ సబలెంకాను 14వసీడ్ నయోమి ఒసాకా(జపాన్) వరుస సెట్లలో 6-2,7-6తో ఓడించింది.వింబుల్డన్‌లో ఫ్యాషన్లతో హోరెత్తిసున్న ఒసాకా... గేమ్‌లో అదే జోరు కొనసాగిస్తోంది.తొలి సెట్‌ను అలవోకగా నెగ్గి ఒసాకా శుభారంభం చేసింది. రెండోసెట్‌లో పుంజుకున్న సబలెంకా... సర్వీసులను నిలుపుకోవడంతో టైబ్రేక్‌కు సాగింది. అయితే ఒసాకా ఈ దశలో సబలెంకా సర్వీసును కొల్లగొట్టి రెండో సెట్‌తో పాటు మ్యాచ్‌ను ముగించి క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించింది.



వింబుల్డన్‌లో 106 మ్యాచ్‌లు నెగ్గిన జొకోవిచ్

## మహిళల టి20 ఛాంపియన్‌గా ఆస్ట్రేలియా

**లార్డ్స్, జులై 5:** మహిళల టీ20 ప్రపంచకప్ విజేతగా ఆస్ట్రేలియా నిలిచింది. లార్డ్స్ వేదికగా జరిగిన ఫైనల్లో ఇంగ్లాండ్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. 151 పరుగుల లక్ష్యాన్ని 17.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. బెత్ మూనీ(64) హాఫ్ సెంచరీతో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (48), ఎలీస్ పెర్రీ (13..), జార్జియా వోల్ (9) పరుగులు చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో షార్లెట్ డీన్, లారెన్ బెల్, సోఫీ ఎకిల్‌స్టోన్ తలో వికెట్ తీశారు.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ ఆరంభంలో తడబడింది. 32 పరుగులకే ఓపెనర్లు ఇద్దరు అమీ జోన్స్(6), డానీ హోడ్జ్(8) వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో నాట్‌సీవర్ బ్రంట్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడింది. 53 బంతుల్లోనే 5 ఫోర్లతో 58 పరుగులు సాధించింది. అలీస్ క్యాప్సీ (23)తో కలిసి మూడో వికెట్‌కు 35 రన్స్ జోడించింది. చివర్లో ఫ్రేయా కెంప్ మెరుపులతో ఇంగ్లాండ్ 150 మార్కుకు చేరుకుంది.కెంప్ 28 బంతుల్లోనే 4 ఫోర్లు, ఓ సిక్స్‌తో 44 పరుగులు చేసింది. దీంతో ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 150 రన్స్ చేసింది. ఆస్ట్రేలియా బౌలర్లలో కిమ్ గార్త్, లూసీ హామిల్టన్, సోఫీ, అన్నాబెల్ సదర్లాండ్ తలో వికెట్ తీశారు.

151 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా ఆరంభంలోనే ఓపెనర్ జార్జియా వోల్(9) వికెట్ కోల్పోయింది. అయితే బెత్ మూనీ(49 బంతుల్లో 64; 10 ఫోర్లు), లిచ్‌ఫీల్డ్(35 బంతుల్లో 48; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రెండో వికెట్‌కు ఏకంగా సెంచరీ భాగస్వామ్యంతో ఆస్ట్రేలియా గెలుపుకు బాటలు వేశారు.ఇద్దరూ అవుటైనా మిగతా పనిని పెర్రీ(13), గార్డ్‌నర్(3) పూర్తి చేయడంతో ఆస్ట్రేలియా 17.1 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఏడు వికెట్లతో ఘనవిజయం సాధించింది.



# డివిడెండ్లు బోనస్‌లతో ఈ వారం బిజీబిజీ

**ముంబయి, జులై 15:** కంపెనీల డివిడెండ్లు, బోనస్‌లు, స్టాక్ విభజన వంటి వాటితో రానున్న వారం స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు కీలకంగా మారనుంది. పలు ప్రముఖ కంపెనీలు డివిడెండ్‌లు, బోనస్ షేర్లు, స్టాక్ స్ప్లిట్లకు సంబంధించిన రికార్డ్ తేదీలను ప్రకటించాయి. ఈ ప్రయోజనాలు పొందాలంటే ఇన్వెస్టర్లు ఆయా రికార్డ్ తేదీలకు ముందు షేర్లను కలిగి ఉండాలి. రికార్డ్ డేట్ ఆధారంగానే డివిడెండ్, బోనస్ షేర్లు లేదా స్టాక్ స్ప్లిట్ ప్రయోజనాలకు అర్హులైన వాటాదారులను కంపెనీలు నిర్ణయిస్తాయి. సాధారణంగా ఎక్స్‌డేట్ కూడా ఇదే రోజున ఉంటుంది. ఆ రోజు నుంచి షేర్ ధర కార్పొరేట్ యాక్షన్‌కు అనుగుణంగా సర్దుబాటు అవుతుంది.

ఈ వారం జేఎస్‌డబ్ల్యూ సిమెంట్, నెస్లే ఇండియా, యునైటెడ్ స్పిరిట్స్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్ కంపెనీ వంటి ప్రముఖ కంపెనీల కార్పొరేట్ యాక్షన్స్‌పై మార్కెట్ దృష్టి నెలకొంది.డివిడెండ్‌లు డీసీఎం శ్రీరామ్ ఇంటర్నేషనల్, డీజే మీడియాప్రింట్ అండ్ లాజిస్టిక్స్, పిలానీ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్, సుందరం ఫైనాన్స్,సెరా శానిటరీవేర్ కంపెనీలు ఎక్స్‌డివిడెండ్‌గా ట్రేడ్ కానున్నాయి. దొడ్ల డెయిరీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్‌కేపీ సెక్యూరిటీస్, సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ షేర్లు ఎక్స్‌డివిడెండ్‌లోకి ప్రవేశించనున్నాయి. బ్లిస్ జీవీఎస్ ఫార్మా, హన్నా జోసెఫ్ హాస్పిటల్, కేశర్ టెర్మినల్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎంఫాసిస్, యునైటెడ్ స్పిరిట్స్ కంపెనీలకు ఎక్స్‌డివిడెండ్ వర్తించనుంది. హర్షా ఇంజినీర్స్ ఇంటర్నేషనల్, ఆర్‌పీజీ లైఫ్ సైన్సెస్, షీలా ఫోమ్, టైటాన్ కంపెనీ ఎక్స్‌డివిడెండ్‌గా ట్రేడ్ అవుతాయి.




అపోలో టైర్స్,ఆర్టెమిస్ మెడికేర్ సర్వీసెస్,యాక్సిస్ బ్యాంక్, బిర్లా సాఫ్ట్, కంప్యూటర్ ఏజ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, కంట్రోల్ ప్రింట్, డిలింక్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, డైనమిక్ కేబుల్స్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్, గ్రైండ్‌వెల్ నార్టన్, హిందాల్కో ఇండస్ట్రీస్, జేకే సిమెంట్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్, మహీంద్రా లాజిస్టిక్స్, నెస్లే ఇండియా, న్యూ ఇండియా అష్యూరెన్స్, నిలకమల్, ఓరియెంట్ ఎలక్ట్రిక్, పీటీఎల్ ఎంటర్‌ప్రైజెస్, రోస్సారి బయోటెక్, స్మార్ట్‌లింక్ హోల్డింగ్స్, శోభా, వెల్‌స్పన్ లివింగ్, జెడ్ఎఫ్ కమర్షియల్ వెహికల్ కంట్రోల్ సిస్టమ్స్ ఇండియా కంపెనీలు ఎక్స్‌డివిడెండ్‌గా ట్రేడ్ కానున్నాయి.

స్టాక్ విభజనపరంగా గుజరాత్ ఇంజెక్ట్ కేరళ కంపెనీ షేర్ ఫేస్ వ్యాల్యూను రూ.10 నుంచి రూ.1కు విభజిస్తూ జూలై 8ను రికార్డ్ డేట్‌గా నిర్ణయిం చింది. మంగళం వరల్డ్‌వైడ్ కంపెనీ కూడా షేర్ ఫేస్ వ్యాల్యూను రూ.10 నుంచి రూ.1కు విభజించి జూలై 10 రికార్డ్ డేట్‌గా వెల్లడించింది.

బోనస్ షేర్లుగోల్డియామ్ ఇంటర్నేషనల్ కంపెనీ 1:3 నిష్పత్తిలో బోనస్ షేర్లను ప్రకటించింది. హిందుస్థాన్ ఇన్సులేటర్స్ అండ్ ఇండస్ట్రీస్ 2:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను ఇవ్వనుంది.




## ఫ్యాషన్‌బ్రాండ్ నైకా రాబడుల్లో 30శాతం వృద్ధి

**ముంబయి,జులై 5:**ఈకామర్స్ సంస్థ నైకా మాతృసంస్థ ఎఫ్ఎస్ఎన్ ఈకామర్స్ వెంచర్స్ లిమిటెడ్ జూన్ త్రైమాసికంలో బలమైన వ్యాపార వృద్ధిని నమోదు చేసినట్లు తెలిపింది.సమీకృత గ్రాస్ మెర్చండైజ్ వ్యాల్యూ, నెట్ సేల్స్ వ్యాల్యూవృద్ధి30శాతం ప్రారంభ స్థాయిలో ఉండే అవకాశముందని, మొత్తం ఆదాయ వృద్ధి దాదాపు 30 శాతానికి చేరుకుంటుందని కంపెనీ అంచనా వేసింది. కంపెనీ విడుదల చేసిన త్రైమాసిక వ్యాపార అప్‌డేట్ ప్రకారం, బ్యూటీ విభాగం నెట్ సేల్స్ వ్యాల్యూ, నికర ఆదాయంలో 20 శాతం వృద్ధిని నమోదు చేయనుంది. కొత్త వినియోగదారుల చేరిక, ఓమ్నిఛానల్ వ్యాపార విస్తరణ, మార్కెటింగ్ ఆదాయంలో పెరుగుదల ఈ వృద్ధికి ప్రధాన కారణాలని కంపెనీ తెలిపింది.రిటైల్ స్టోర్లలో ఇప్పటికే ఉన్న అవుట్‌లెట్ల విక్రయాల పెరుగుదలతో పాటు కొత్త స్టోర్ల విస్తరణ కూడా బ్యూటీ వ్యాపాంనికి బలాన్నిచ్చిందని పేర్కొంది. అలాగే కంపెనీ సొంత బ్రాండ్ల పోర్ట్‌ఫోలియో కూడా మంచి వృద్ధిని నమోదు చేస్తోందని తెలిపింది. హౌస్ ఆఫ్ నైకా పరిధిలోని కే బ్యూటీ, నైకా కాస్మొటిక్స్, డాట్ అండ్ కీ బ్రాండ్లు స్థిరమైన వృద్ధిని కొనసాగిస్తున్నాయని కంపెనీ వెల్లడించింది. ఈ విభాగంలో నెట్ సేల్స్ విలువలు 50 శాతం పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. బ్యూటీ, ఫ్యాషన్ విభాగాల్లో కొత్త వినియోగదారుల చేరిక కోసం మార్కెటింగ్‌పై పెట్టుబడులు కొనసాగుతున్నాయని, దీంతో మరో త్రైమాసికంలో కూడా ఆరోగ్యకరమైన వృద్ధిని నమోదు చేస్తామని నైకా ఆశాభావం వ్యక్తం చేసింది.

## మార్కెట్‌కు ఈ వారం ఐపిఒల సందడి


## నాలుగు కొత్త ఐపిఒలతో రూ.1460 కోట్లు సేకరణ

**ముంబయి,జులై 5:**భారత ప్రైమరీ మార్కెట్‌లో ఈవారం ఐపీఓల సందడి కొనసాగనుంది. మొత్తం నాలుగు కొత్త ఐపీఓలు ఇన్వెస్టర్ల కోసం వస్తున్నాయి. వీటితో కంపెనీలు సుమారు రూ.1,460 కోట్ల నిధులు సమీకరించనున్నాయి.రెండు మెయిన్‌బోర్డ్, రెండు ఎస్ఎంఈ ఐపీఓలు ఉన్నాయి. ఇదే సమయంలో తొమ్మిది కంపెనీల షేర్లు స్టాక్ ఎక్స్చేంజీల్లో లిస్ట్ కానున్నాయి. జూలై 8న కుసుమ్‌గర్ లిమిటెడ్ మెయిన్‌బోర్డ్ ఐపీఓ ప్రారంభం కానుంది. రూ.650 కోట్ల ఈ ఐపీఓకు ఒక్కో షేరు ధరను రూ.398 నుంచి రూ.419 మధ్య నిర్ణయించారు. జూలై 10తో సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది.

ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉండనుంది. జూలై 9న లేజర్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ రూ.742 కోట్ల ఐపీఓను ప్రారంభించనుంది. ఇందులో రూ.542 కోట్ల తాజా ఈక్విటీ ఇష్యూ, రూ.200 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ ఉన్నాయి. సబ్‌స్క్రిప్షన్ జూలై 13 వరకు కొనసాగుతుంది. ఎస్ఎంఈ విభాగంలో హ్యాపీ స్టీల్స్ లిమిటెడ్ జూలై 9న రూ.25 కోట్ల ఐపీఓను ప్రారంభిస్తోంది. షేరు ధరను రూ.62 నుంచి రూ.66 మధ్య నిర్ణయించగా, మొత్తం 38 లక్షల తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. దేవ్‌సన్ క్యాటలిస్ట్ లిమిటెడ్ కూడా తన ఎస్ఎంఈ ఐపీఓను ప్రారంభించనుంది. రూ.42.34 కోట్ల ఈ ఇష్యూలో రూ.39.39 కోట్ల తాజా షేర్లు, రూ.2.95 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ ఉన్నాయి. ఒక్కో షేరు ధరను రూ.112 నుంచి రూ.118 మధ్య నిర్ణయించారు.మరోవైపు, లిస్టింగ్ క్యాలెండర్ కూడా బిజీగా ఉండనుంది. ఆస్థా స్పిన్‌టెక్స్ జూలై 6న బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్ట్ కానుండగా, నాక్ ప్యాకేజింగ్ జూలై 8న మెయిన్‌బోర్డ్‌లో లిస్టింగ్ అయ్యే అవకాశం ఉంది. ఎస్ఎంఈ విభాగంలో అడాన్ అగ్రో కమోడిటీస్ తేజా ఇంజినీరింగ్ ఇండస్ట్రీస్, అథర్వ పాలీప్లాస్ట్, సీమ్యాక్స్ రిసోర్సెస్, సంపర్క్ ఇండియా లాజిస్టిక్స్, వినీత్ మొబైల్, క్రిటికల్ టెక్ సంస్థలుఈనెల ఐదారుతేదీల్లో లిస్టింగ్ కానున్నాయి.




## టాప్6 కంపెనీల్లో లక్షకోట్లు పెరిగిన మార్కెట్‌క్యాప్




**ముంబయి,జులై 5:** దేశీయ స్టాక్ మార్కెట్లలో సానుకూల ధోరణి కొనసాగడంతో గత వారం దేశంలోని టాప్10 అత్యంత విలువైన కంపెనీల్లో ఆరు సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.1 లక్ష కోట్లకు పైగా పెరిగింది. వీటిలో భారతి ఎయిర్‌టెల్ మరియు బజాజ్ ఫైనాన్స్ అత్యధిక లాభాలు నమోదు చేసిన సంస్థలుగా నిలిచాయి.

గత వారం బీఎస్ఈ సెన్సెక్స్ 663 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 214 పాయింట్లు పెరిగాయి. దేశీయ ఆర్థిక సూచీలు బలంగా ఉండటం, జీఎస్టీ వసూళ్లు ఆశాజనకంగా నమోదు కావడం, పారిశ్రామిక కార్యకలాపాలు మెరుగుపడటం మార్కెట్లకు ఊతమిచ్చాయి.అమెరికా ఉద్యోగ గణాంకాలు అంచనాలకు తగ్గట్టుగా రావడంతో ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్లపై సానుకూల అంచనాలు పెరిగి పెట్టుబడిదారుల విశ్వాసం బలపడింది.గత వారం భారతి ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ.36,529 కోట్ల మేర పెరిగి రూ.11.64 లక్షల కోట్లకు చేరుకుంది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ క్యాప్ రూ.33,060 కోట్ల పెరుగుదలతో రూ.6.43 లక్షల కోట్లకు చేరింది.

ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.16,084 కోట్ల పెరుగుదలతో రూ.10.12 లక్షల కోట్లకు చేరగా, ఎల్ఐసీ విలువ రూ.8,602 కోట్ల పెరిగి రూ.5.44 లక్షల కోట్లకు చేరుకుంది.హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.7,665 కోట్ల పెరిగి రూ.12.34 లక్షల కోట్లకు చేరగా, హిందుస్థాన్ యూనిలీవర్ విలువ రూ.6,461 కోట్ల పెరిగి రూ.5.17 లక్షల కోట్లకు చేరింది.అయితే లార్సెన్ అండ్ టుబ్రో మార్కెట్ విలువ రూ.26,572 కోట్ల మేర తగ్గి రూ.5.54 లక్షల కోట్లకు పడిపోయింది.

రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాప్ రూ.18,946 కోట్ల మేర తగ్గి రూ.17.65 లక్షల కోట్లకు చేరగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విలువ రూ.4,846 కోట్ల మేర తగ్గింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మార్కెట్ విలువ కూడా స్వల్పంగా రూ.1,031 కోట్ల మేర తగ్గింది.మార్కెట్ విలువ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలోనే అగ్రస్థానాన్ని కొనసాగిస్తుండగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టుబ్రో, ఎల్ఐసీ, హిందుస్థాన్ యూనిలీవర్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.




## మూడు బ్యూటీక్రీమ్‌లపై మహారాష్ట్ర ఎఫ్‌డిఎ నిషేధం

**ముంబయి, జులై 5:** మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ పరీక్షల్లో గోరీ బ్యూటీ క్రీమ్, ఫేస్ ఫ్రెష్ గోల్డ్ బ్యూటీ క్రీమ్ అండ్ సీరమ్, గోల్డెన్ స్టార్ బ్యూటీ క్రీమ్ నాణ్యత ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించింది. వీటిలో పాదరసం, సీసం మోతాదులు అనుమతించిన పరిమితికి మించి ఉన్నాయని ఈ క్రీములను ఎక్కువ కాలం ఉపయోగిస్తే మూత్రపిండాలు,నాడీ వ్యవస్థ, చర్మంపై తీవ్రమైన దుష్ప్రభావాలు కలిగే ప్రమాదం ఉందని ఎంఎఫ్‌డీఏ హెచ్చరించింది. అందువల్ల ఈ ఉత్పత్తులను కొనుగోలు చేయడం, వినియోగించడం, విక్రయించడం, పంపిణీ చేయడం తక్షణమే నిలిపివే యాలని సూచించింది. ఈ ఉత్పత్తుల ప్యాకెట్లపై తయారీదారు పేరు, చిరునామా, బ్యాచ్ నంబర్, తయారీ తేదీ, గడువు తేదీ వంటి తప్పనిసరి వివరాలు కూడా లేవని అధికారులు గుర్తించారు.

దీంతో రిటైలర్లు, హోల్‌సేలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, ఈకామర్స్ సంస్థలు ఈ ఉత్పత్తుల విక్రయాలను వెంటనే నిలిపివేయాలని ఎంఎఫ్‌డీఏ ఆదేశించింది. మార్కెట్ నుంచి వెనక్కి తీసుకున్న స్టాక్ వివరాలతో పాటు మిగిలిన నిల్వలపై నివేదిక సమర్పించాలనిఆదేశించింది.

## మూడునెలల్లో ఫాక్స్‌కాన్ రాబడులు 40% వృద్ధి

**న్యూఢిల్లీ,జులై 5:**ప్రపంచంలోనే అతిపెద్ద కాంట్రాక్ట్ ఎలక్ట్రానిక్స్ తయారీసంస్థ ఫాక్స్‌కాన్ ఆర్థిక ఫలితాల్లో భారీ వృద్ధి నమోదు చేసింది. కృత్రిమ మేధస్సు (ఏఐ)సర్వర్లకు పెరిగిన డిమాండ్‌తో పాటు వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ వ్యాపారం పుంజుకోవడంతో కంపెనీ ఆదాయం దాదాపు 40 శాతం పెరిగింది.ఏప్రిల్ నుంచి జూన్ వరకు రెండో త్రైమాసికంలో ఫాక్స్‌కాన్ ఆదాయం 2.513 ట్రిలియన్ తైవాన్ డాలర్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 39.8 శాతం వృద్ధి.ప్రపంచ ప్రముఖ ఏఐ చిప్ తయారీ సంస్థ ఎన్‌విడియాకు ఏఐ సర్వర్ల ప్రధాన సరఫరా దారుగా,ఆపిల్ ఐఫోన్‌ల అతిపెద్ద తయారీ సంస్థగా ఉన్న ఫాక్స్‌కాన్‌కు ఏఐ ఉత్పత్తులపై పెరిగిన డిమాండ్ భారీగా కలిసి వచ్చింది.క్లౌడ్, నెట్‌వర్కింగ్ విభాగంలో ఏఐ సర్వర్ల విక్రయాలు బలంగా పెరగడంతో ఆదాయం గణనీయంగా పెరిగిందని కంపెనీ తెలిపింది.ఐఫోన్ స్మార్ట్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగం కూడా ఏడాది ప్రాతిపదికన మంచి వృద్ధిని నమోదు చేసింది. జూన్ నెలలో మాత్రమే కంపెనీ ఆదాయం 821.8 బిలియన్ తైవాన్ డాలర్లకు చేరుకుంది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14